

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-8-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 206 పేజీలు: 8 వెల: 6.50


**గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ మళ్లీ భారీ దాడులు**

**అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు**

5లో


# సమర్ధంగా నీటి నిర్వహణ

## 80శాతం పైగా నిండిన రిజర్వాయర్లు

### కృష్ణ, గోదావరి, పెన్న తదితర నదుల ద్వారా ఇప్పటికి 310 టిఎంసిల వినియోగం

### సీమ జిల్లాల ప్రాజెక్టులకు సమృద్ధిగా నీరు

### - సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్టు 25, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సమర్ధ నీటి నిర్వహణ సత్ఫలితాలను ఇస్తోందని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టంచేసారు. నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సిఎం తెలిపారు. ఇరిగేషన్ స్కీమ్‌లు.నీటి నిర్వహణ తదితరంశాలపై జలవనరుల శాఖ అధికారులతో సిఎం చంద్రబాబు సోమవారం కీలకంగా సమీక్షించారు.ఇప్పటికే పలు సమీక్షల్లో ఇరిగేషన్ అధికారులకు ఇదే విషయంపై చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తూనే ఉన్నారు. తాజా సమీక్షలో సిఎం చంద్రబాబు ప్రతీ వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలన్న లక్ష్యం మేరకు ఓవైపు రిజర్వాయర్లను నింపుతూనే మరోవైపు అన్ని నదీ బేసిన్ల ఆయకట్టుకు నీరిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టామన్నారు..దానికి అనుగుణంగా ఈసారి కృష్ణా, గోదావరి, వంశధార, పెన్నా నదీ బేసిన్లలో అన్ని రిజర్వాయర్లలోనూ కలిపి ప్రస్తుతం 80 శాతంమేర నీటి నిల్వలు ఉన్నాయి.మన నిర్ణయాలు ఆచరణలో విజయవంతంగాముందుకు సాగుతున్నాయన్న చంద్రబాబు. కృష్ణా నదిపై ప్రధాన ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు గత నెలలోనే నిండాయి. పైనుంచి నిరంతర వరద ప్రవాహాలు కొనసాగుతుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు కిందికి పంపుతున్నారు. ఇదే సమయంలో ఆయా ప్రాజెక్టులనుంచి గరిష్ట మొత్తంలో నీటిని వివిధ లిఫ్టుల ద్వారా, కాలువల ద్వారా ఇతర రిజర్వాయర్లకు, చెరువులకు, పంటలకు మళ్లిస్తున్నారు. ఈ ఏడాది జులై నెలలోనే కృష్ణాకు భారీ వరద రావడంతో పెద్ద ఎత్తున నీటినికి సీమ ప్రాంతానికి తరలించి ప్రాజెక్టులు నింపుతున్నారు. ప్రస్తుతం కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు ఈ ఏడాది జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 52 టీఎంసీల నీటిని రైతులు వినియోగించుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణతో గతంతో పోలిస్తే ఈసారి అదనంగా 12 టీఎంసీల వినియోగం జరిగింది. గోదావరి బేసిన్‌లోని సర్ ఆర్ధర్ కాటన్ బ్యారేజీ ద్వారా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను యథాతథంగా దిగువకు సముద్రంలోకి వదులుతున్నారు. గోదావరి డెల్టాలోని పంటల సాగుకు సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 70 టీఎంసీల మేర నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. పెన్నా బేసిన్లో వెలిగోడులో 15 టీఎంసీలు, సోమశిలలో 56 టిఎంసిలు, కండలేరులో 31 టిఎంసిల నీరునిల్వఉంది. వంశధార బేసిన్లోని గొట్టా బ్యారేజీనుంచి ఈ సీజన్లో 8టిఎంసిల నీటిని ఆయకట్టుకు అందించింది ప్రభుత్వం. మొత్తంగా చూస్తే ఆగస్టు 24 నాటికి ప్రధాన జలాశయాల్లో 650 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

**సమర్ధ నీటి నిర్వహణ వినియోగం**

ఈ యేడాది ఇప్పటి వరకు కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్లలో కలిపి 309 టిఎంసిల నీటిని ఆయకట్టుఅవసరాలకు వినియోగించారు. సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 70 టిఎంసిలు, ప్రకాశం బ్యారేజీ నుంచి >>2



# నర్సింగ్ కోర్సుల్లో సంస్కరణలు

### మొదటిసారి ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రవేశాలు..

### మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలను కూడా చేపట్టనున్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిభ కలిగిన విద్యార్థులకు పెద్దపీట వేయడంతో పాటు, నాలుగేళ్ల వ్యవధితో కూడిన బియస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాల్లో అవకతవకలకు తావులేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపెట్టింది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే ప్రవేశాలతో ఈ సంస్కరణలు అమల్లోకి రానున్నాయి. ఈమేరకు బియస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి 1998లో జారీఅయిన జిఒనంబరు 145 మరియు 2023లో జారీ అయిన జిఒ నంబరు 41లో తగు మార్పులు చేయడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**నూతన సంస్కరణలు..**

ఇప్పటి వరకు నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగాను, ఇంటర్మీడియేట్ మార్కుల ప్రాతిపదికన ప్రవేశాలు జరిగాయి. మొదటిసారిగా గత ఏడాది జులైలో బియస్సీ(నర్సింగ్)లో ప్రవేశాల కోసం ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎగ్జామినేషన్ టెస్ట్‌ను(ఏపిఎన్‌సెట్) డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించింది. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతాయి. ఇప్పటి వరకు ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ నిర్ణయిస్తూ ఉండగా... మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలను ఆయా కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించేవి. తద్వారా ప్రతిభ తక్కువ కలిగిన విద్యార్థులకు, ఇతర రాష్ట్రాల వారికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు లభించేవని ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలతో పాటు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ సీట్లకు కూడా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టనుంది. విశ్వవిద్యాలయం నియమించే సెలక్షన్ కమిటీ ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులనే మేనేజ్‌మెంట్ సీట్లలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఈసంస్కరణతో ప్రతిభ కలి >>2



సోమవారం గాంధీ బునకర్ మేళా ప్రారంభ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుచిత్ర ఎల్ల

# మన చేనేతకు ప్రపంచ గుర్తింపు

### జాతీయ స్థాయిలో ఎపి చేనేతకు 10 అవార్డులు గర్వకారణం

### ప్రతి కుటుంబం చేనేతను ఆదరించాలి: సుచిత్ర ఎల్ల

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ చేనేత, హస్తకళలకు ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని హ్యాండ్‌లూమ్,క్రాఫ్ట్స్ అభివృద్ధికి నిర్దేశించిన సలహాదారు సుచిత్ర ఎల్ల తెలిపారు. 'గాంధీ బునకర్ మేళా'(జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025)ను విజయవాడ శేష సాయి కళ్యాణ వేదికలో సోమవారం సుచిత్ర ఎల్ల, చేనేత. జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి, 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణిలతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసినసభలో జ్యోతి ప్రజ్వలనచేసారు..ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ చేనేత మరియు హస్తకళల ప్రొడక్ట్స్‌ను జాతీయ, అంతర్జాతీయంగా మార్కెట్ చేసేందుకు బాధ్యత తీసుకుని పనిచేస్తామన్నారు. మన వస్తువులకు బ్రాండింగ్ ఎలా చేయాలో వాటికి >>2



# ప్రధాని మోడీ డిగ్రీ వివాదం

### 'సిఐసి' ఆదేశాలను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రధాని నరేంద్రమోడీ డిగ్రీ వివరాలను వెల్లడించాలంటూ ఢిల్లీ విశ్వవిద్యాలయానికి కేంద్ర సమాచార కమిషన్ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు పక్కన పెట్టింది. ఈ మేరకు ఫిబ్రవరి 27న రిజర్వ్ చేసిన తీర్పును జస్టిస్ సచిన్ దత్తా నేడు వెలువరించారు. నీరజ్ అనేవ్యక్తి ప్రధాని మోడీ డిగ్రీ వివరాల కోసం సమాచార హక్కు చట్టం కింద సిఐసికి దరఖాస్తు పెట్టారు. ప్రధాని 1978లో బిఎ పూర్తి చేశారు. దీంతో ఆ ఏడాది బిఎ పరీక్షలో ఉత్తీర్ణులైనవారి రికార్డుల తనిఖీకి 2016 డిసెంబర్‌లో ప్రధాన సమాచార కమిషనర్ అనుమతించారు.

దీన్ని డియు సవాల్ చేయగా 2017 జనవరిలో ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. తెలుసుకునే హక్కు కన్నా వ్యక్తిగత గోప్యతా >>2

# 'స్త్రీశక్తి' గ్రాండ్ సక్సెస్

### • ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్ • బస్సులకు రెండు వైపులా బోర్డులు • ఆర్టీసీ సమీక్షలో సిఎం చంద్రబాబు • 13 రోజుల్లో 100% ఆక్యుపెన్సీతో బస్సులు నడుస్తున్నాయన్న అధికారులు



సోమవారం ఆర్టీసి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల సహకారంతో స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీపై సిఎం చంద్రబాబు సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం అమలు ఎలా జరుగుతుందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో ఎంత మేర పెరిగిందని ఆరా తీశారు. స్త్రీ శక్తి బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా..? అని ముఖ్యమంత్రి అడిగారు. స్త్రీ శక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60 డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో వస్తోందని.. అలాగే 13 జిల్లాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో బస్సులు తిరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా.. ఉచిత బస్సు వెసులుబాటును మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని... అవసరమైనమేరకే ప్రయాణాలు చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.."ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేస్తారు. ప్రభుత్వం అందించేపథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారు. అందుకే తాను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పటి నుంచి మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తిచూపిస్తా. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంభనకల్పిస్తే.. ఇప్పుడు స్త్రీశక్తి ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చాం. దీని వల్ల బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుంది." అని సిఎం >>2

# కుప్పంలో కృష్ణమ్మ పరుగులు

### • మూడు నెలల ముందే రైతులు, ప్రజల కల సాకారం
### • హంద్రీ-నీవా కాలువల వెంబడి జనం • జలహారతులతో స్వాగతం



హంద్రీ-నీవా కాలువల ద్వారా కుప్పం వచ్చిన కృష్ణాజలాలు

**కుప్పం, ఆగస్టు 25 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు తలపెట్టిన సంకల్పం సిద్ధించింది. రాష్ట్రంలోనే చిట్టచివరి నియోజకవర్గమైన కుప్పానికి కృష్ణాజలాలు తెస్తానని చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. సిఎం చంద్రబాబునాయుడు చొరవతో కుప్పం ప్రాంతంలో హంద్రీ-నీవా కాలువల్లో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. దీంతో పడమటి మండలాల రైతులు, ప్రజలు కృష్ణమ్మకు జలహారతులతో ఘనస్వాగతం పలుకుతూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం డ్యామ్ బ్యాక్ వాటర్‌నుంచి వస్తున్న కృష్ణాజలాలతో రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో రైతులకు సాగుకు, ప్రజలకు తాగేందుకు జలాలు అందుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ కల్లా హంద్రీ-నీవా జలాలు కుప్పానికి వస్తాయని పేర్కొన్నా మూడు నెలల ముందే ముఖ్యమంత్రి చొరవతో కుప్పానికి నీళ్లు చేరాయి.

**రైతులు.. ప్రజల కల సాకారం :**

ఎటువంటి శాశ్వత జలవనరులులేని కుప్పం ప్రాంతంలో రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఇలాంటి తరుణంలో కుప్పం రైతుల కష్టాలు తీర్చాలని సిఎం చంద్రబాబు 2015లోనే హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్‌కెనాల్‌పనులకు శ్రీకారం చుట్టారు. >>2

# డిప్యూటీ స్పీకర్ రఘురామకు సుప్రీం కోర్టులో ఊరట

### కానిస్టేబుల్ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేసిన ధర్మాసనం



**విజయవాడ,ఆగస్టు25.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై కానిస్టేబుల్ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఫరూక్ బాషా అనే కానిస్టేబుల్ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను సోమవారం సుప్రీం ధర్మాసనం కొట్టివేస్తున్నట్లు తీర్పువెలువరించింది. రఘురామ, అతడి కార్యాలయ సిబ్బంది దాడి చేశారంటూ కొన్నేళ్ల కిందట కేసు వేసిన పిటిషనర్ ఫరూక్.. ఈ కేసును తాను కొనసాగించుకోదలచుకోవడం లేదంటూ అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలుచేశారు. ఈ అఫిడవిట్ పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ జెకే మహేశ్వరిధర్మాసనం ఈ కేసును కొట్టివేస్తు న్నట్లు తీర్పు ఇచ్చింది.హైదరాబాద్ గచ్చిబౌలి బౌల్డర్ >>2

# 'మెగాసిటీ'గా తిరుపతి!

### నెల్లూరు తరహాలో రోడ్ల పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలు

### ఎల్‌ఆర్‌ఎస్‌కు మంత్రివర్గం ఆమోదం: మంత్రి నారాయణ



సోమవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

**తిరుపతి,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకున్న తిరుపతినగరం ప్రాధాన్యత దృష్ట్యా మెగాసిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు, నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నెల్లూరు తరహాలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల పరిశుభ్రతకు స్వీపింగ్ యంత్రాలను వినియోగించాలని మంత్రి నగర కమిషనర్ మౌర్యను ఆదేశించారు. వచ్చే జూన్ నెలాఖరుకు >>2

# 'మెప్మా'తో మహిళలకు స్వయం ఉపాధి

### వెయ్యి మందికి పైగా లబ్ధిదారులకు రుణ సౌకర్యం

### చేతిలోని స్మార్ట్‌ఫోన్‌తో సైతం మహిళలకు ఆదాయం: మంత్రి లోకేష్



**సచివాలయం,ఆగస్టు 25,ప్రభాతవార్త :** ఎపి మహిళలు సరికొత్త మార్గంలో పయనిస్తున్నారు.మెప్మా సహకారంతో స్వయం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆసరాగా ఉంటారని ఐటి,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.చేతిలోని స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ,ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతూ సొంతంగా సంపాదిస్తున్నారు.రాష్ట్రంలో విజయవాడ,విశాఖపట్నం,నెల్లూరు తదితర నగరాల్లో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సొంత కాళ్లపై నిలబడేందుకు ర్యాపిడో ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

**ఒక కుటుంబం -- ఒక వ్యాపారవేత్త స్ఫూర్తి**

మహిళల స్వయం ఉపాధికి తొలి అడుగు ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పడింది. అదే రోజు సిఎం చంద్రబాబు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. సిఎం మానస పుత్రికగా ప్రారంభించిన ఒకకుటుంబం - ఒక వ్యాపారవేత్త కింద మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరి >>2



ఫిజీ ప్రధాని సిత్వెని రబుకా సోమవారం న్యూఢిల్లీలో రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీకి నివాళులర్పించిన దృశ్యం

# కోర్సుల్లో సంస్కరణలు

>> గిన విద్యార్థులకు నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు లభిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**ప్రవేశానికి అర్హతలు**

నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశం పొందడానికి...సాధారణ తరగతులకు (అన్ రిజర్వ్‌డ్) చెందిన వారు ఎపిఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 పర్సంటైల్‌లో ఉండాలి(అనగా ఎపిఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 శాతం వారు పొందిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి). సాధారణ తరగతులకు చెందిన దివ్యాంగులు 45 పర్సంటైల్ లో ఉండాలి(45 శాతం వారు సాధించిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి).

ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ తరగతులకు చెందిన వారు, ఈ తరగతులకు చెందిన దివ్యాంగులు 40 పర్సంటైల్‌లో ఉండాలి.రాష్ట్రంలో బియస్సీ(నర్సింగ్) విద్యను అందించే కళాశాలల్లో మొత్తంగా 13,726 సీట్లుండగా...2024-25 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో 6,441 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకోగా, మేనేజ్‌మెంట్ కోటాలో 5,144 మంది ప్రవేశాలు పొందారు. 2,141 సీట్లు మిగిలిపోయాయి. కన్వీనర్ కోటా ప్రవేశాల్లో రిజర్వేషన్ నియమాలు వర్తిస్తాయి. మేనేజ్‌మెంట్ సీట్లలో రిజర్వేషన్లు ఉండవు.



సోమవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రైతుల 'సంయుక్త కిసాన్ మోర్చా' ఆందోళన దృశ్యం

# సమర్ధంగా నీటి నిర్వహణ

>> 52 టిఎంసిలు, వంశధార నుంచి 8 టిఎంసిల మేర నీటిని కాలువలకు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు, హంద్రీ నీవా, నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా ఈ సీజన్లో ఇప్పటి వరకు 156 టిఎంసిల నీటి వినియోగం జరిగింది. ఈ ఏడాది హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా మల్యాల ఎత్తిపోతల నుంచి రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో ఉన్న లక్షల ఎకరాల ఆయకట్టుకూ సాగునీరు అందిస్తున్నారు. హంద్రీనీవా కాలువల వెడల్పు చేయడంతో 738 కి.మీ ప్రయాణించి కృష్ణా జలాలు చిత్తూరు జిల్లా చివరి ప్రాంతాలకు చేరుతున్నాయి. కృష్ణా జలాలు ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు సూచనలతో ఏడాది కాలంగా చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ ద్వారా పంటలకు అవసరమైన సాగునీరు సకాలంలో ఇవ్వడంతో పాటు... రానున్న కాలానికి అవసరమైన విధంగా రిజర్వాయర్లను నీటితో నింపుతున్నారు.

ఈ సీజన్ లోనే 1969 టిఎంసిలు సముద్రం పాలు.. ఇలా సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో వరద నీటిని సద్వినియోగం చేసుకుంటున్నా... వివిధ నదీ బేసిన్ల నుంచి పెద్ద ఎత్తున నీరు సముద్రంలోకి వెళ్లింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలతో మన ప్రాజెక్టులు నిండగా మిగిలిన నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా బేసిన్ల నుంచి ఈ సీజన్లో జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 1969 టిఎంసిలకు పైగా నీరు సముద్రంలో కలిసింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి నీరు ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 1483 టిఎంసిల మేర సముద్రంలోకి వెళ్లింది. ప్రకాశం బ్యారేజి నుంచి డెల్టా అవసరాల వినియోగం తర్వాత సముద్రంలోకి ఈ సీజన్లోనే 468 టిఎంసిల నీరు వెళ్లింది. అలాగే వంశధార బేసిన్లో ఈ వర్షాకాల సీజన్లో ఇప్పటికే 18 టిఎంసిలకు పైగా సముద్రంలోకి వదిలారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి 4.38 లక్షలు, సాగర్ నుంచి 3.38 లక్షలు, పులిచింతల నుంచి 2.72 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి పంట కాలువలకు 18 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పైనుంచి వరద వస్తుండడంతో 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఎగువ రాష్ట్రాలనుంచి వరద వచ్చిన సమయంలో మన రిజర్వాయర్లు నింపుకున్నా...పెద్ద మొత్తంలో నీరు సముద్రం లోకి పోతోంది. నదుల అనుసంధానం ద్వారా వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ముందుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసుకుని గరిష్ట నీటి వినియోగం సాధించడం, కొత్త ప్రాజెక్టులు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్న విషయం నిరంతరం గుర్తుంచుకోవాలన్నారు.

# డిగ్రీ వివాదం

>> పరిరక్షణ హక్కు మిన్న కాబట్టి సిఐసి ఉత్తర్వును కొట్టివేయాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ప్రధాని మోడీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించడానికి యూనివర్సిటీ సిద్ధంగానే ఉన్నా ఆర్టిఐ కింద ఈ వివరాలను అపరిచితులతో పంచుకునేందుకు సుముఖంగా లేదని తెలిపారు. విద్యార్థుల రికార్డులకు తాము సంరక్షణదారులమని ఇతరుల ఆసక్తిని తృప్తిపరిచేందుకు ఆ రికార్డులను ఆర్టిఐ కింద బయటపెట్టాల్సిన అవసరం లేదని డియు పేర్కొంది.

## సుప్రీం కోర్టులో ఊరట

>> హిల్స్‌లోని రఘురామకృష్ణరాజు నివాసం వద్ద ఎస్‌కే ఫరూక్ బాషా అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. ఆయన భద్రతా సిబ్బంది పిలిచి విచారించారు. ఐడీ, ఆధార్ కార్డులు చూపించమని అడగ్గా ఫరూక్ అందుకు నిరాకరించాడు. దీంతో అనుమానం వచ్చి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించి రఘురామ పిఎ ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో ఫరూక్ బాషా ఎపి ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ అని తేలింది. ఆ తర్వాత విధి నిర్వహణలో ఉన్న తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారంటూ.. ఎంపీ రఘురామ కృష్ణరాజుతోపాటు మరో నలుగురిపై ఫరూక్ బాషా కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం తనతో పాటు తన కుమారుడు, మరో ఇద్దరిపై నమోదైన కేసును క్వాష్ చేయాలని రఘురామ హైకోర్టును ఆశ్రయించగా చుక్కెదురైంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ 12 జూలై 2022న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సమయంలో ఎంపీగా ఉన్నానని, అప్పటి సీఎం వైఎస్ జగన్‌తో ఘర్షణలు ఉన్న కారణంగా వై కేటగిరీ భద్రత ఉండేదని. అందుకే అనుమానాస్పదంగా తిరుగాడుతున్నవ్యక్తిని సందేహంతోప్రశ్నిస్తే ఇదంతా జరిగిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అదీగాక, ఇటీవల ఫరూక్ సైతం ఎపికి, హైదరాబాద్‌కు 400 కిలోమీటర్ల దూరంఉన్న కారణంగా పిటిషన్ ఉపసంహరించు కోవాలని ముందుకొచ్చిన నేపథ్యంలో సుప్రీం ధర్మాసనం కేసును కొట్టివేసింది

# కుప్పంలో కృష్ణమ్మ పరుగులు

>> పెద్దపంజాణి మండలం అప్పినపల్లి నుంచి కుప్పం బ్రాంచ్‌కెనాల్ కాలువ 143కి.మీ.ల మేర ఉంది. అప్పట్లోనే దాదాపు 436కోట్లు నిధులు కేటాయించారు. అనంతరం 2019లో మరో వంద కోట్లు మంజూరు చేశారు. అయితే ఎన్నికల నాటికి 87శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం అధికారంలో వచ్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం హంద్రీ-నీవా పనులు పూర్తి చేయక ఎన్నికల ఏడాది 2024లో స్టంట్ వేసింది. కాలువల్లో పూర్తిస్థాయి నీరు లేకున్నా నీటిని విడుదల చేసి అభాసుపాలైంది. మరలా అధికారంలో వచ్చాక సిఎం చంద్రబాబు హెచ్ఎన్ఎస్ఎస్ పనుల పూర్తికి చర్యలు చేపట్టారు. ఏడాది కాలంలోనే దాదాపు గతంలో ఎన్నడూ ఖర్చు చేయని రీతిలో 3890కోట్లు ఖర్చు చేసి చివరి ప్రాంతం అయిన కుప్పానికి నీరు అందిస్తున్నారు. దీంతో రైతులు, ప్రజల కల సాకారం అయింది. పడమటి ప్రాంతాలైన పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోకి హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు రావడంతో కాలువల వెంబడి జనం, రైతులు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. తమ తమ గ్రామాల్లో కృష్ణమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, జలహారతులు పడుతున్నారు.

**ఎక్కడి శ్రీశైలం.. ఎక్కడి కుప్పం :**

ఎక్కడో కర్నూలు జిల్లాలో ఉన్న శ్రీశైలం డ్యామ్.. రాష్ట్రంలోనే చివరి నియోజకవర్గం కుప్పం. వీటి మధ్య దూరం దాదాపు 550కి.మీ.లకుపైనే. అక్కడి నుంచి కృష్ణానదీ జలాలు కర్నూలు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల మీదుగా పుంగనూరు, పలమనేరు మీదుగా కుప్పం రావడం అంటే అది నిజంగా చరిత్రే. ఈ చరిత్రను సిఎం చంద్రబాబు సృష్టించి రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్న అపర భగీరథుడు అనడంలో సందేహం లేదు.

# 'స్త్రీశక్తి' గ్రాండ్ సక్సెస్

>> చెప్పారు.

**సహకరిస్తోన్న మహిళలకు ధన్యవాదాలు..**

స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారు. అవ సరం ఉంటేనే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అనవసర ప్రయాణాలు పెట్టుకో వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా సరే.. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి... వారికి చేయూత అందివ్వడానికే స్త్రీ శక్తి పథకం ప్రారంభిస్తున్నామని మహిళలకు చెప్పాను. ఆ మేరకు మహిళలు కూడా సహక రిస్తున్నారు. రాష్ట్ర పరిస్థితిని అర్థంచేసుకుని... దానికి అనుగుణంగా వ్యవహ రిస్తున్న మహిళలకు ధన్యవాదాలు. ఇప్పటి వరకు సహకరించిన విధంగానే మహిళలు భవిష్యత్తులోనూ సహకరించాలని కోరుతున్నాను. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకా లకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే.. మరింత ఉత్సాహంగా పని చేస్తాం. మరింత మేలు ప్రజలకు, మహిళలకు చేకూర్చగలం." అని చంద్రబాబు వివరించారు.

**బోర్డులు పెట్టండి... లైవ్ ట్రాకింగ్ అమల్లోకి తీసుకురండి.**

స్త్రీ శక్తి పథకం కింద నడిపే బస్సులకు వెనుకా... ముందు భాగాన బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తంగా 8,458 స్త్రీ శక్తి బస్సులకు బోర్డులు పెట్టాలని చెప్పారు. సీట్లకోసం పోటీ పడితే.. ఆర్టీసీ సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు ప్రయాణికులతో ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తలేదని ఆర్టీసీ ఎండీ తెలిపారు. మహిళా ప్రయాణికుల సంఖ్య ఎంత మేరకు పెరిగిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం మహిళలు ప్రయాణిస్తే.. 60 శాతం మంది పురుషులు ప్రయాణించే వారని.. ఇప్పుడు 65 శాతం మేర మహిళలు ప్రయాణిస్తుంటే.. 35 శాతం మేర పురుషులు ప్రయాణిస్తున్నారని అధికారులు వివరించారు. అలాగే స్త్రీ బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానం ఎప్పటి నుంచి అమల్లోకి తెస్తున్నారని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రెండు, మూడు రోజుల్లో గుంటూరు డిపోలో స్త్రీ శక్తి బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని... ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి బస్సులకు లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ప్రవేశపెడతామని అధికారులు చెప్పారు. లైవ్ ట్రాకింగ్ విధానం అమల్లోకి వస్తే.. బస్సుల వేళలు తెలుసుకుని.. ఆ మేరకు తమ ప్రయాణ సమయాలను మహిళలు ఫిక్స్ చేసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్ష సందర్భంగా ఆర్టిక్యులేటెడ్ ఈ బస్సులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ తరహా బస్సులు ప్రస్తుతమున్న సాధారణ బస్సులకు... మెట్రో రైలుకు మధ్య మిడిల్ లెవెల్ ట్రాన్స్ పోర్టు వ్యవస్థగా ఉంటాయని అధికారులు వివరించారు.

## 'మెగాసిటీ'గా తిరుపతి!

>> తిరుపతిలో తుడ టవర్స్‌ను పూర్తిచేస్తామన్నారు. గతప్రభుత్వం క్రమపద్ధతి లేకుండా టౌన్‌ప్లానింగ్ చేసిందని ఆయన విమర్శించారు. భవన నిర్మాణాల అనుమతుల విషయంలో కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందని తెలిపారు. సోమవారం ఉదయం తిరుపతి తుడ కార్యాలయంలో పట్టణాభివద్ధిపై తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, నగరపాలక కమిషనర్ మౌర్య, తుడ విసి శుభంబన్సల్, పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మతో కలసి మంత్రి నారాయణసమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి ప్లానింగ్ లేకుండా భవనాలు నిర్మించారని, ల్యాండ్ రెగ్యులైజేషన్ పథకం(ఎల్ఆర్ఎస్) ఇప్పటికే మంత్రివర్గం ఆమోదించిందన్నారు. త్వరలోనే బిల్డింగ్ రెగ్యులైజేషన్ పథకం(బిఆర్ఎస్)పై చర్చించనున్నట్లు తెలిపారు.

ప్రతినెలా శాటిలైట్ చిత్రాల పరిశీలన, అధ్యయనంతో ప్లానింగ్‌కు విచలనంఉంటే సిఎం సూచనలతో చర్యలు తీసుకుంటామన్నారు. ఆమోదంలేకుండా భవనాలు నిర్మించుకుంటే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. తిరుపతి నగరం పరిధిలో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసి తుడ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. తుడ ప్రాజెక్ట్ నిర్మాణపనుల్లో వేగంపెంచాలని, కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పన్నుల ద్వారా వస్తున్న ఆదాయాన్ని కమిషనర్ మౌర్య మంత్రికి వివరించారు. పక్కాప్రణాళికలతో ముందుకెళ్లి లక్ష్యాన్ని చేధించాలని మంత్రి నిర్దేశం చేశారు.ప్రభుత్వాన్ని తప్పుదారిపట్టించే నివేదికలు వద్దని, ఏ విషయంలనూ వాస్తవ పరిస్థితులు చెప్పాలని గట్టిగా తెలిపారు.

## రాష్ట్రంలో రైతులకు ఎరువుల కొరత ఉండదు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ ఆగస్ట్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పంటలకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌లో ఎరువుల అవసరం, సరఫరా, నిల్వలు, కేంద్రంరాష్ట్రం సమన్వయం, రైతులకు ఇచ్చిన హామీలపై మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా వివరణ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు 31.15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరంగా అంచనా వేయబడి, ఇప్పటి వరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరాయనితెలిపారు. అందులో యూరియా, డీఏపీ, ఎంఒపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులు కలిపి 6.22 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రైతులకు ఎరువుల కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉంచిందని మంత్రి తెలిపారు. గోదావరి వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో రవాణా సమస్యలు తలెత్తినప్పటికీ, రైతులకు ఎరువులు సమయానికి అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంకా 79,633 మెట్రిక్ టన్నులు డిపోలలో నిల్వగా ఉండగా, అవసరమైన ప్రాంతాలకు తరలింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఎరువుల సరఫరాలో కేంద్రం-రాష్ట్రం సమన్వయంతో 50:50 నిష్పత్తిలో పంపిణీ జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం నుండి ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నులు చేరాయని, 0.47 లక్షల మెట్రిక్ టన్నులు రాబోతున్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 0.75 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని, మిగిలిన 0.90 లక్షల మెట్రిక్ టన్నులు గంగవరం, కాకినాడ, విశాఖపట్నం, ఒరిస్సా పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని వివరించారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, సమయానికి అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఈ విధానం వల్ల ఎరువుల నిల్వలు, అవసరాలు, పంపిణీపై రియల్ టైమ్ సమాచారం అందుతుందని చెప్పారు. జిల్లా స్థాయి అధికారులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని మంత్రి స్పష్టం చేశారు. రైతులు సాగు కొనసాగించడానికి కావలసినంత ఎరువులు సకాలంలో అందుతాయని హామీ ఇచ్చారు. వర్షాల ప్రభావంతో కొన్నిచోట్ల రవాణా ఆలస్యం జరిగినా, రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాల వలన దెబ్బతిన్న ప్రాంతాల్లో పంటలకు ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు అందిస్తున్నామని చెప్పారు.

## వారం - వర్జ్యం

26-08-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
తదియ మ. 1.57
హస్త పూర్తి
వర్జ్యం : మ.1.01-2.46
దు.ఉ.8.24-9.14, 2) రా.11.27-12.17
శుభసమయం:ఉ.5.30-9.30, సా.4.30-5.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. కుటుంబసమస్యల నుండి బయటపడతారు.

**వృషభం:** ఉద్యోగంలో మార్పుల వెను వెంటనే ఫలితాలు ఇవ్వకపోయినా భవిష్యత్తులో కలిసివస్తుంది.

**మిథునం:** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. సోదరుల నుండి విలువైన సమాచారం.

**కర్కాటకం :** సంతాన విద్యా విషయంలో బాధ్యతాయుతంగా మసలుతారు. వస్తు లాభం.

**సింహం:** ఊహించని పరిణామాలు కుటుంబంలో కలతలు సృష్టిస్తాయి. వాహన సౌఖ్యం.

**కన్య :** సన్నిహితులతో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**తుల :** భాగస్వామ్య వ్యాపారాలు మినహా ఇతర వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

**వృశ్చికం:** ఉద్యోగపరంగా కొన్ని ఒడిదుడుకులు సంభవం. ఋణాలు తీరి కొంత ప్రశాంతత పొందుతారు.

**ధనుస్సు:** పెద్దల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**మకరం:** జీవిత భాగస్వామి సహకారం మీకు మనోధైర్యాన్నిస్తుంది. వాహనయోగం.

**కుంభం:** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలను శ్రమించి సాధిస్తారు.

**మీనం :** అయిష్టంగా కొన్ని కార్యక్రమాలు చేయవలసి రావడం కొంత ఇబ్బందికి లోనుచేస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహిళలకు స్వయం ఉపాధి

>> యాస్ (మెప్మా) సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది.అందులో భాగంగా తొలిదశలో 9పట్టణాల్లో 1000మంది లబ్దిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400వాహనాలు,విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వీటిలో ఎలక్ట్రిక్ టూ వీలర్లు కాగా,240ఎలక్ట్రిక్ త్రీ వీలర్లు ఉన్నాయి.

**మహిళల విజయగాథలు**

విజయవాడకు చెందిన వడ్లపూడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొనుగోలుచేసి ర్యాపిడో నడపడం ప్రారంభించారు.ప్రస్తుతం నెలకు రూ.10వేల వరకు సంపాదిస్తున్నారు.సొంత కాళ్లపై నిలబడటం ద్వారా వస్తున్న ఆదాయం కన్నా ఆర్థిక స్వాతంత్ర్యం లభించడంతో సంతోషంగా ఉందని మంజు చెబుతున్నారు.

విజయవాడలోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షవాతం రావడంతో కుటుంబ బాధ్యతలను తాను స్వీకరించారు.ఎస్సీ వర్గానికి చెందిన నేను బ్రహ్మానందరెడ్డిని ప్రేమ వివాహం చేసుకున్నాను.ఆయనకు పక్షవాతం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే రూ.6000లు దివ్యాంగ పెన్షన్ మందులకు సరిపోతుంది.ఈ సమయంలో మెప్మా ద్వారా రుణం పొంది యాక్టివా టూ వీలర్ కొన్నారు.ర్యాపిడో నడుపుతూ నెలకు రూ.12వేలు సంపాదిస్తున్నాను ఈఎంఐ చెల్లించడంతోపాటు ఇంటిని నడపడానికి ఆ ఆదాయం తోడ్పడుతుందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**ఇది ఆరంభం మాత్రమేనన్న మంత్రి లోకేష్**

మహిళలు సాధికారత సాధించాలనేది ప్రభుత్వ ఆలోచన అని విద్య,ఐటి శాఖమంత్రి లోకేష్‌అన్నారు. టిడిపి మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టడంతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.ర్యాపిడోతో కలసి రాష్ట్రంలో 1000మందికి పైగా మహిళలు స్వీయ ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఇది ఆరంభం మాత్రమేనని,రాబోయే రోజుల్లో మరింత చేస్తామని మంత్రి నారా లోకేష్ వివరించారు.

# మన చేనేతకు ప్రపంచ గుర్తింపు

>> ఇంకా ఆదరణ ఎలా చేయాలో అనే విషయాలపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. మన కళలను, ఆర్టిజన్స్‌ను, హ్యాండీ క్రాఫ్ట్స్‌ను అభివృద్ధి చేయటం మనందరి బాధ్యత అని అన్నారు. మన కుటుంబాలు చేనేతను ఆదరించేలా చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. హ్యాండ్ ల్యూమ్స్ ఒక జీవనోపాధి దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ క్రింద మన చేనేతకు 10 అవార్డ్స్ రావడం చేనేతకు గర్వకారణం అన్నారు. మొత్తం దేశంలో 30 అవార్డ్స్‌లో మనకు 10 అవార్డులు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఇందులో బాపట్ల జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు, రాష్ట్రంలో 9 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను పెంచేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్స్‌ను ఆగస్టు నెలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జిఎస్టీ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించి మరియు దేశములోని ప్రముఖ చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకువచ్చి వినియోగదారులకు అందుబాటులో ఉంచే కార్యక్రమములో భాగంగా వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చేనేత. జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, జాయింట్ డైరెక్టర్ రాజారావు, డిప్యూటీ డైరెక్టర్ బి. నాగేశ్వరరావు, ఏడీలు హరికృష్ణ, వనజ, తదితరలు పాల్గొన్నారు.

**'గాంధీ బునకర్ మేళా'ను (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన 2025)**

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన2025 అనంతరం చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ ప్రాంతాలకు చెందిన స్టాల్స్‌ను ఆసక్తిగా గమనించారు. అంతేకాకుండా ఒక్కో చీర తయారీకి ఎన్ని రోజులు పడుతుంది, ఎంత మంది చీర తయారీలో పాల్గొంటారు అని స్టాల్స్ నిర్వాకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో దేశం మొత్తం మీద వివిధ రాష్ట్రాల నుంచి 100 స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రదర్శనలో బీహార్, చత్తీస్‌గఢ్, హర్యానా, జమ్మూ కాశ్మీర్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్, ఝార్ఖండ్, గుజరాత్, ఢిల్లీ, హ్యాండిక్రాఫ్ట్స్ విభాగంలో 5, ఆంధ్ర రాష్ట్రం నుండి 45 చేనేత సంఘాలు పాల్గొననున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో అన్నిరకాల చేనేత ఉత్పత్తులు ఉత్పత్తి ధరలకే అందుబాటులో ఉంచబడును. కాటన్/సిల్క్ చీరలు, డ్రస్ మెటీరియల్స్, బెడ్‌షీట్లు, కలంకారి, జంధాని, కార్పెట్స్ వంటి విస్తృత శ్రేణి ఉత్పత్తులు ఈ మేళాలో ప్రదర్శన.అమ్మకానికి అందుబాటులో ఉంటాయి. కావున, మన విజయవాడ మరియు పరిసర ప్రాంత ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత కార్మికులను ప్రోత్సహించవలసిన అవసరం ఉంది.

# ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు

## ఐఐటి, నిట్, నీట్‌లో రాష్ట్రం నుంచి 55 మంది ఎంపిక

## సిఎం చంద్రబాబును కలిసి సంతోషాన్ని పంచుకున్న విద్యార్థులు

## సీట్లు పొందిన ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష అందించిన సిఎం

**విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిభావంతులైన విద్యార్థుల ఎదుగుదలకు ఆర్థికంశాలు అవరోధం కాకూడదని సిఎం చంద్రబాబు అన్నారు. విద్యలో రాణించే పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఐఐటీ, నిట్, నీట్ పరీక్షల్లో రాణించడానికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహంతో పాటు,అన్ని వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఈ యేడాది ఐఐటి, నిట్, నీట్‌లో విజయం సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సంతోషాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ముఖ్యమంత్రి... మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు... రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ప్రోత్సహించండి,స్ఫూర్తినింపండి**

విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు రూపుదిద్దుకోవాలి. రాష్ట్రంలోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా ఉంది. ఇందుకు 55 మంది విద్యార్థులే నిదర్శనం. సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి నాలుగు రెట్లుపెరగాలి. ఇప్పుడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు తాము చదువుకున్న పూర్వ విద్యాసంస్థకు వెళ్లి అక్కడ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి. అని ముఖ్యమంత్రి విద్యార్థులతో అన్నారు.

**356 మందికి శిక్షణ... 55 మంది ఎంపిక**

కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీనీట్ సెంటర్లలో వీరంతా కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారు. ఈ సెంటర్లలో జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్‌డ్‌లో 176 మంది శిక్షణ పొందగా 129 మంది క్వాలిఫై అయ్యారు. నీట్‌కు 180 మంది కోచింగ్ తీసుకోగా 143 మంది క్వాలిఫై అయ్యారు. చివరగా ఐఐటీలో 12 మంది, నిట్‌లో 30 మంది, నీట్ ఎంబీబీఎస్‌లో 13 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మొత్తం 55 మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థినులు ఉండటం విశేషం. వీరు కాకుండా బీడీఎస్‌లో మరో 14 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంది. జీఎఫ్‌టీఐ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 19 మందికి సీట్లు లభిస్తాయి.

**ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్లు**

ఈ ఏడాది కొత్తగా మరో 7 ఐఐటీనీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. సమావేశం చివరిలో ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, ఒక్కో విద్యార్థికి రూ.లక్ష చొప్పున చెక్ స్వయంగా అందించి వారితో విడివిడిగా ఫోటోలు దిగారు. మొత్తం 55 మంది విద్యార్థులకు రూ.55 లక్షలు ఇచ్చారు. విద్యార్థులు అంతా పేదరికం నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభ చూపడంతో ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. భుజం తట్టి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సమావేశం చివరిలో బోధనా సిబ్బంది, విద్యార్థులు ముఖ్యమంత్రితో గ్రూపు ఫోటో తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవాణి ఆఫ్‌లైన్ జారీ కొనసాగింపునకు తర్జనభర్జనలు!

## - ఆన్‌లైన్ టిక్కెట్‌లతోనూ సమస్యలున్నట్లు భక్తుల ఫిర్యాదు




**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆలయంలో మరీ దగ్గరగా కులశేఖరపడి (మొదటి గడప) వద్దనుండి దర్శనం చేసుకునే అవకాశం ఉన్న శ్రీవాణిబ్రేక్ దర్శనాల టిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో జారీ కొనసాగింపు విషయంలో టిటిడి ఎటూ తేల్చుకోలేకపోతోంది. భక్తుల నుండి డిమాండ్ విపరీతంగా ఉండటంతో ఈ టిక్కెట్లు తిరుమలలోని అన్నమయ్యభవనం సమీపంలో శ్రీవాణి ప్రత్యేక కౌంటర్‌ల వద్ద సమయం, సందర్భం లేకుండా జారీచేయడమే ప్రధానంగా భక్తుల నుండి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీతసమయం ప్రకారం ప్రతి రోజూ ఉదయం 10గంటలకు ఈ ప్రత్యేక కౌంటర్‌ల వద్ద టిక్కెట్లు జారీచేయాల్సి ఉంది. ఇందుకు భక్తులు వేకువజామున 3,4గంటల నుండే అక్కడ క్యూలైన్లో బారులుతీరి నిలబడుతున్నారు. రోజువారీగా తిరుమలలోని కౌంటర్లలో 800 శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు ,రేణిగుంట విమానాశ్రయంలో 200 టిక్కెట్లు పొందిన భక్తులకు ఏరోజుకారోజు దర్శనం కావడంతో సాయంత్రం 4.30గంటలకు ఆలయంలోనికి వైకుంఠమ్ 1 క్యూలైన్‌ల నుండి అనుమతినిస్తున్నారు. దీనివల్ల డబ్బున్న ధనవంతులేగాక సామాన్యభక్తులు కూడా దర్శనం త్వరగా చేసుకునేందుకు వీలుకల్పించారు. ఈ నేపధ్యంలో సాధారణరోజుల్లోనూ మధ్యాహ్నం 12గంటలలోపే శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు పూర్తిగా జారీఅవుతున్నాయి. ఇంకా వారాంతం,రద్దీ విపరీతంగా ఉండే రోజుల్లో మరీ అర్ధరాత్రి వేళ టిక్కెట్లు జారీచేస్తుండటంతో ఉదయం 6గంటలకల్లా ఆరోజు దర్శన టిక్కెట్లు పూర్తిగా కోటా లేకపోతోంది. టిక్కెట్లు జారీచేసే విషయంపై గత వారం తిరుమలలో భక్తులు రచ్చచేయడం, నిరసనలకు దిగడం జరిగింది. దీంతో శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్ చేయాలని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే ఆన్‌లైన్‌లో రోజువారీగా 500 టిక్కెట్లు మూడునెలలముందే విడుదల చేస్తుండటం, ఈ టిక్కెట్లు అందుకున్న భక్తులు కొన్ని అనివార్యకారణాలతో దర్శనాలకు రాలేకపోతున్నారనేది టిటిడి సమాచారం. అలాంటి సమయంలో ఆ టిక్కెట్లు వృధాగానే పోతున్నాయి. దీనివల్ల ఆఫ్‌లైన్‌లోనే జారీచేయడం వల్ల కొండకు చేరుకున్న భక్తులు తమతమ స్థాయిని బట్టి ముందువచ్చిన వారికి ముందు అనే విధంగా ఏరోజుకారోజు టిక్కెట్లు అందుకోవడానికి సౌలభ్యంగా ఉంటుంది. అంతేగాక ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు తిరుమలలోనే స్థానిక ఆలయాలు, తీర్థాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించే వీలుకూడా ఉంది. గదులకోసం తంటాలు తప్పుతాయి. మరీ ఎవరైనా భక్తులు సెంటిమెంట్‌గా భావిస్తే యాత్రికుల వసతి సముదాయాల్లో విశ్రాంతి తీసుకోవడం చేయవచ్చు. ఇవన్నీ పరిగణనలోనికి తీసుకుంటున్న టిటిడి అధికారులు ఆఫ్‌లైన్‌లోనే శ్రీవాణి బ్రేక్ దర్శన టిక్కెట్లు కొనసాగించడం మంచిదని అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ టిక్కెట్లు జారీ కౌంటర్ల వద్ద పూర్తి పారదర్శకంగా డిజిటల్ డిస్‌ప్లే చేస్తూ ఎన్ని టిక్కెట్లు లభ్యత వున్నాయనే సమాచారం తెలియజేస్తున్నారు. సోమవారం భక్తుల రద్దీ ఓ మాదిరిగా కొనసాగడంతో మధ్యాహ్నం 1గంటకు 80వరకు శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు ఉన్నాయి. గంటసమయంలో ఆ టిక్కెట్లను భక్తులు బుక్‌చేసుకుని సాయంత్రం దర్శనానికి వెళ్ళడం విశేషం. ప్రతిరోజూ 1,500 టిక్కెట్లు జారీఅవుతున్న శ్రీవాణి మరో 500వరకు పెంచాలని భక్తుల నుండి వస్తున్న విజ్ఞప్తి. మరీ దీనిపై టిటిడి అధికారులు సమగ్రంగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. మరీ టిక్కెట్లు 300వరకు పెంచాలనే యోచనతో కార్యాచరణ రూపొందిస్తున్నారనేది సమాచారం. అయితే 10,500 రూపాయలు చెల్లించి దర్శన టిక్కెట్ పొందుతున్న భక్తులకు వసతి సదుపాయం విషయంలో కూడా కుదరదనే అంశంపై భక్తులకు అవగాహన కల్పించాలని ఆలోచన చేస్తున్నారు. మరీ వారంరోజుల్లో ఈ అంశాలపై టిటిడి అధికారులు ఒకస్పష్టతకు రానున్నారు.

## తిరుమల సమాచారం

### వరాహస్వామికి ఏకాంత అభిషేకం




**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివరాహక్షేత్రం కలియుగవైకుంఠం తిరుమలలో సోమవారం ఉదయం భూవరాహస్వామికి ఏకాంత అభిషేకం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరాహస్వామి జయంతి సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదోక్తంగా పాలు,పెరుగు,తేనె,చందనం, పసుపు, కొబ్బరిజలం వివిధ రకాల పండ్లతో తయారుచేసిన పంచామృతంతో మూలవర్లకు ఏకాంత అభిషేకం నిర్వహించారు. కాగా తిరుమలలో ఆగమశాస్త్రం ప్రకారం వరాహస్వామికి తొలిపైజ, తొలినైవేద్యం , తొలి దర్శనం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి పాల్గొన్నారు.

### రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం: మంత్రి నారాయణ



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళ ప్రభుత్వంలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని, ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం మెల్లగా అన్నీ సరిదిద్దుకుంటే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని రాష్ట్రమంత్రి డాక్టర్ పి.నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదప్రజలు ఆర్థికంగా ముందుకు వెళ్ళేలా పి4 పథకం అమలుచేయడం అన్ని వర్గాల నుండి ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామని, మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని చంద్రబాబునాయుడుకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ప్రసాదించాలని వేడుకున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి విజన్ దూరదృష్టితో కూడుకుందన్నారు. ఆయన దిశానిర్దేశం రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా అభివృద్ధిచెందేందుకు దోహదపడుతుందన్నారు. సోమవారం ఉదయం కుటుంబం,అనుచరులతో కలిసి తిరుమలకు వచ్చిన మంత్రి నారాయణ విఐపి బ్రేక్ ప్రారంభసమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు,ఓఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కిన మంత్రి ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి: ప్రముఖులు



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అంతా మంచి జరగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. సోమవారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ, ఎంపిలు రఘునందన్‌రావు,మాగుంట శ్రీనివాస్ వేర్వేరుగా శ్రీవారి ఆలయంలోపలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి గోవిందుడి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### సైనికశక్తి, దేశభద్రత మరింత శక్తిమంతంగా ఉండాలి:కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ సైనికులు దేశభద్రతలో పట్టుదలతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి తెలిపారు. సైనికశక్తి, దేశభద్రత మరింత శక్తివంతంగా ఉండాలని భగవంతుడ్ని ప్రార్థించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా మంచి వర్షాలు కురిశాయని, రైతులు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం వేకువజామున కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కుటుంబంతో కలసి శ్రీవారి సుప్రభాతసేవలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దేవదేవుడి దర్శనం చేయించి ఆశీస్సులందజేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రేపు జగన్ తిరుమల పర్యటన లేదన్న వైఎస్సార్సీ



**తిరుమల,ఆగస్టు 25ప్రభాత వార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం(రేపు) తిరుమలకు వస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఆయన పర్యటనపై టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. ఆయన ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి రేపు వస్తున్నట్లు, ఆయన అన్యమతస్థుడు కావడంతో హిందూమతంపై విశ్వాసం ఉన్నట్లు డిక్లరేషన్ ఇవ్వాలని, అలా సంతకం చేయకుంటే దర్శనానికి అనుమతిస్తారా?అనే పుకార్లు షికారుచేశాయి. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ళు శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలోతిరుమలకు వచ్చి పట్టువస్త్రాలు సమర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వైఎస్ జగన్ వైసిపి నేతగా,పులివెందుల ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈ నేపధ్యంలో ఆయన తిరుమల పర్యటన ఉందనే సామాజిక మాధ్యం వార్తతో టిటిడిలో గుబులురేగింది. ఈ సున్నిత మైన విషయంపై ఎలా వ్యవహరించాలనే అంశం పెద్ద దుమారం రేపింది. అయితే చివరకు సోమవారం సాయంత్రం వైసిపి ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమలకు జగన్ పర్యటన లేదని స్పష్టత నివ్వడంతో నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. 27న తిరుమలకు జగన్ రావడం లేదని, అసలు ఆయన పర్యటన లేదని చెప్పారు. అంతేగాక సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా హిందు ధర్మపరిరక్షణ జరిగిందని, శ్రీనివాస దివ్యఅనుగ్రహ హోమం ప్రారంభించామని కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## ఒక్క క్లిక్.. వేయి భావాల లాజిక్

### - పాత్రికేయరంగంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకం

### - ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**.విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ఫొటోగ్రాఫర్ ఒక్క క్లిక్‌తో కెమెరాలో బంధించే ఛాయాచిత్రం వేయి భావాల లాజిక్ అని.. ఫొటోలు ఎన్నో మధురానుభూతులకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని, ఫొటో లేని వార్తా పత్రిక వెలుగు లేని దివిటీ లాంటిదని, ఛాయాచిత్రం చూడటంతోనే సగం వార్తా సారాంశం పాఠకులకు అర్థమయిపోతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విశ్రాంత ఐఏఎస్ అధికారి డి. చక్రపాణి అన్నారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి.. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ పి.ప్రసాద్ సేకరించిన పురాతన అరుదైన కెమెరాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ మధురానుభూతులను ఫొటోల రూపంలో భావితరాలకు అందించేందుకు వీలుంటుందని.. ఫొటోలు అనేవి తరతరాలకు విజ్ఞాన వారధులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏది చేసినా వినూత్నంగా చేయాలని ప్రోత్సహిస్తుంటారని, విలువైన వనరుల సృష్టి జరగాలని ఆకాంక్షిస్తారని.. ఫొటోగ్రఫీ పోటీల నిర్వహణ ద్వారా ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించి.. కొత్త ఉత్తేజంతో వారు ముందడుగు వేసేలా దోహదపడతాయన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా ఆర్థిక రంగానికి దాదాపు 67 శాతం సేవా రంగం ద్వారా లభిస్తోందని.. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా సేవా రంగం మరింత పురోగతి సాధించేందుకు వీలుంటుందన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టి కృషి అవసరమని.. ఛాయాచిత్రాల విజ్ఞాన సారథులు అయిన ఫొటోగ్రాఫర్లు కూడా ఇందులో భాగస్వాములు కావాలన్నారు. ఈ పోటీలు ఆరంభం మాత్రమేనని.. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి మాట్లాడుతూ.... ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు, ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించేందుకు వివిధ రకాల ఇతివృత్తాలతో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని.. విజేతలకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లు ఉన్నా వాటిని ఎదుర్కొంటూ ఫొటోగ్రాఫర్లు విజయవంతంగా ముందుకెళ్తున్నారని..

వృత్తి జీవితానికి వన్నె తెస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణిలు ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్‌టీఆర్, యోగాంధ్ర, తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం 2, న్యూస్ ఫొటోలకు సంబంధించి మూడు విభాగాల్లో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించగా విజేతలకు ప్రతి విభాగంలో ప్రథమ (రూ. 10 వేలు), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 4 వేలు) బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు.

## ఏడాదిన్నర బాలుడిపై పైశాచికంగా దాడి!

### తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన బాలుడు



బాలుడి తల్లిదండ్రులు

**పలమనేరు టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** అభం శుభం తెలియని ఏడాదిన్నర బాలుడిపై పైశాచికంగా దాడి జరిగింది. ఈ దాడి ఎవరు చేశారన్న విషయం తెలియడం లేదు. శరీరంపై కాల్చిన గాయాలు, మర్మావయంపై కొరికిన గాట్లు ఉన్నాయి. ఈ నెల 24న సాయంత్రం జరిగిన ఈ సంఘటన హృదయ విదారకంగా వుంది. అపస్మారక స్థితిలో బాలుడు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇది తల్లిదండ్రుల పనేనా లేక ఇతరులు ఎవరైనా ఈ దారుణానికి పాల్పడ్డారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ వద్ద ఓ కోళ్ళఫామ్‌లో చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఓ జంట పనిచేస్తున్నారు. వీరికి ఏడాదిన్నర బాలుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో బాలుడు ఈ నెల 24న హఠాత్తుగా భోరున ఏడుస్తూ అరవడంతో తల్లిదండ్రులు వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆసుపత్రిలో వైద్యులు విషయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలుడు అపస్మారక స్థితిలో కోమాలో వుండడంతో ఐసియులో వుంచి చికిత్స చేస్తున్నారు. డా.మరియమ్మ మాట్లాడుతూ ఇది సాధారణంగా వచ్చిన వ్యాధి కాదని బాబును ఎవరో విచక్షణా రహితంగా కొట్టారని, దీంతో బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడని తెలిపారు. తల్లిదండ్రులను విచారిస్తే తాము పనుల్లోకి వెళ్ళడానికి తెలిసిన వ్యక్తి దగ్గర వదిలి వెళ్ళామని చెపుతున్నారని వివరించారు. రక్త పరీక్షలు చేశామని రక్తం తక్కువగా వుందని తెలిపారు. విషయం తెలుసుకున్న హ్యూమన్‌రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ మాదేశ్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తల్లిదండ్రులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## అలిపిరి వద్ద భూమిపై భూమన ఆరోపణలు దారుణం: టిటిడి

**తిరుమల,ఆగస్టు 25ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో 2021 నవంబర్‌లో అలిపిరి సమీపంలోని దేవుని పాదాలచెంత 20 ఎకరాల స్థలాన్ని ఒబెరాయ్ హోటల్‌కు కేటాయింపులు చేసిన దాన్ని తిరిగి వెనక్కుతీసుకోవడం జరిగిందని టిటిడి పేర్కొంది. ఆ భూమికి బదులు దక్షిణంవైపు పర్యాటకశాఖకు స్థలాన్ని టిటిడి కేటాయిస్తూ మేనెలలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో తీర్మానించింది. అయితే దీనిపై వైసిపి నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు సబబుకాదని, భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశం కావున ఆయన వ్యాఖ్యలను టిటిడి ఖండించింది. అలిపిరి-చెర్లోపల్లిరోడ్డులో దక్షిణంవైపు ఇప్పటికే పలు నిర్మాణాలు జరిగిన విషయం విదితమే.దక్షిణంవైపు భూమిని పర్యాటకశాఖకు కేటాయించి తిరుమల కొండను ఆనుకుని ఉత్తరంవైపుగా ఉన్న పవిత్రమైన భూమిని టిటిడి తీసుకోవడం జరిగిందన్నారు.

## రేపటి నుండి కాణిపాకం బ్రహ్మోత్సవాలు



**కాణిపాకం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో రేపటి నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా ఆలయంలో 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా ఈనెల 27న వినాయకచవితి, 28న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబర్ 5న జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగుస్తాయి. అలాగే 6న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు 16న జరిగే తెప్పోత్సవంతో ముగియనుంది. ఈమేరకు ఆగస్టు 27న వినాయక చవితి, 28న ధ్వజారోహణం,హంసవాహనసేవ, 29న బంగారు నెమలివాహన సేవ, 30న మూషికవాహన సేవ,

31న బంగారు చిన్నశేషవాహనం, బంగారు పెద్ద శేషవాహనసేవ, సెప్టెంబర్ 1న చిలుక వాహనం (పగలు), వృషభవాహనసేవ (రాత్రి), 2న గజవాహన(ఏనుగు)సేవ, 3న రథోత్సవం, 4న బిక్షాండి, తిరుకళ్యాణం, అశ్వవాహన సేవ, 5న ధ్వజావరోహణం, వడాయత్తుఉత్సవం,

ఏకాంతసేవ జరుగనుంది. అదేవిధంగా ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 6న అధికార నందివాహనసేవ, 7న రావణ బ్రహ్మ వాహనసేవ, 8న యాళివాహనసేవ, 9న సూర్యప్రభ వాహనసేవ, 10న చంద్రప్రభ వాహనసేవ, 11న కల్పవృక్ష వాహనసేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకిసేవ, 14న కామధేనువాహనం,15న పూలంగిసేవ, 16న తెప్పోత్సవం జరుగనుంది.

## సెప్టెంబర్ 15కల్లా దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి



దాతలకు దుర్గమ్మ వారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లు సెప్టెంబర్ 15కల్లా పూర్తి చేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల వివరాల పురోగతిని తెలుసుకున్నారు. కమీషనర్ ఆదేశాల మేరకు నూతన లడ్డూపోటులో లడ్డూ తయారీ చేయాలన్నారు. నూతన అన్నదాన భవనంలో అన్నదానం జరగాలన్నారు. దసరా ప్రత్యేక పూజలు కుంకుమార్చన, దేవిఖడ్గమాల, శ్రీచక్రనవణార్చన లు మహామండపం 6వ అంతస్థులో జరుగుతాయన్నారు. చండీహోమం యాగశాలలో జరుగుతాయన్నారు. అన్ని పూజల టికెట్లు ఆన్‌లైన్లో కొనుగోలు చేయాలన్నారు. టికెట్లు అందుబాటులో వుంచే వివరాలు త్వరలో తెలుపుతామన్నారు. భక్తులకు ఉదయం 6 నుండి 10.30 వరకు పులిహోర, కట్టుపొంగలి, కదంబం, దద్దోజనం అందిస్తామని, ఉదయం 10.30 నుండి సాయంత్రం 4 వరకు భోజనం, సాయంత్రం 4. నుండి రాత్రి 9.30 వరకు పులిహోర, కదంబం కొండ దిగువన అందించాలని, మూలానక్షత్రం రోజున విజయదశమి రోజున చిన్న లడ్డూ ఉచితంగా అందిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ రంగారావు, ఇఇ లు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఇఓ చంద్రశేఖర్, సుధారాణి, గంగాధర్, రమేష్‌బాబు, శ్రీనివాస్, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన యు లక్ష్మిపార్వతి రు.1,00,101ల విరాళాన్ని సోమవారం తమ భర్త వెంకటేశ్వరరావు పేరిట నిత్యాన్నదాన పథకానికి అందించారు. విజయవాడకు చెందిన ఎస్ కృష్ణ, అనంతలక్ష్మి దంపతులు రు.1లక్ష విరాళాన్ని కనకదుర్గ డెవలెప్‌మెంట్ ట్రస్టుకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. శ్రీ కనకదుర్గానగర్ నుండి మహామండపం వరకు బిటి రోడ్ పనులు సోమవారం ప్రారంభమైన సందర్భంగా వాహనాలకు ప్రవేశం లేదని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. వాహనదారులు ఘాట్‌రోడ్డు మార్గంలో కొండపైకి చేరుకోవాలన్నారు. దుర్గమ్మ వారిని దర్శించుకునే భక్తులు ఫోన్లను మొబైల్ కౌంటర్లలో భద్రపరుచుకోవాలన్నారు.

## ర్యాపిడోతో మహిళలు డ్రైవర్లుగా ఉపాధి పొందడం సంతోషం : మంత్రి లోకేష్



**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ రవాణా సేవల సంస్థ ర్యాపిడోతో కుదిరిన భాగస్వామ్యం ద్వారా వెయ్యిమందికి పైగా మహిళలు డ్రైవర్లుగా ఉండి ఉపాధి పొందడం పట్ల ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళలు ర్యాపిడో వాహనాలు నడుపుతున్న వీడియోను సోమవారం తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీలు కల్పిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రవాణా ప్రణాళిక అంటే కేవలం ఓ చోటు నుంచి మరో చోటుకు ప్రయాణించడం మాత్రమే కాదని, అది మహిళలకు లభించే అవకాశం, గౌరవం అని లోకేష్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తమది కచ్చితంగా మంచి ప్రభుత్వమని రుజువు చేసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం గొప్ప విజయం సాధించిందని, అదే స్ఫూర్తితో మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. మహిళలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

## నేడు సీమ మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక రైలు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 25,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య ఈ నెల 26,27వ తేదీల్లో మంగళ,బుధవారాల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06549ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బెంగళూరు నుండి మంగళవారం రాత్రి 9.15గంటలకు బయలుదేరి, బుధవారం ఉదయం 11.30గంటలకు బీదర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బీదర్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 06550 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మధ్యాహ్నం 14.30గంటలకు బీదరు నుంచి బయలుదేరి గురువారం తెల్లవారుజామున 4గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

ఈరైళ్లు మార్గమధ్యలో యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని,

మంత్రాలయం, రాయచూర్ క్రిష్ణా, యాద్గిర్, వాడి, షాహాబాద్, గుల్బర్గా, హొమ్నాబాద్ స్టేషన్లలో నిలుస్తాయి.

వార్త

సజ్జనుడి జీవితం ఎలా ఉత్తమమవుతుంది అంటే ప్రేమతో, దయాగుణంతో అతను చేసే చిన్నచిన్న పనుల వల్లనే.

- గ్లిబ్బర్

# పాశవిక ప్రవృత్తికి ఏవీ పగ్గాలు?

భారతదేశమంటే సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా పదేపదే ఎంతో గొప్పగా చెప్పుకుంటాం. కానీ సమాజంలో పూజ్యనీయులైన మహిళల మాన,ప్రాణ విషయంలో చెప్పుకోదగిన గౌరవ మర్యాదలతో ప్రవర్తించలేకపోతున్నాం. చట్టసభల్లో మహిళా బిల్లు ఏనాడో అటకెక్కించారు. రానురాను మహిళల రక్షణ విషయంలో విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. జరిగిన, జరుగుతున్న సంఘటనలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పాలకులు ఎంతగా చెప్తున్నారో అంతకు రెట్టింపు స్థాయిలో మహిళలపై నేరాలు పెరిగిపోతున్నాయి. వాస్తవంగా చదువు,సంధ్యలు పెరిగే కొద్దీ, విజ్ఞానం ఆర్జించే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పు రావాలి. సంస్కారం, సభ్యత మరింత పెరగాలి. మంచి ఏదో చెడు ఏదో గ్రహించే విచక్షణాజ్ఞానం పెంపొందాలి. దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా తిరోగమిస్తున్నామేమోననిపిస్తున్నది. మహిళలపై పెరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, వేధింపుల సంఘటనలు ఆవేదనే కాదే ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకున్న కిరాతకుడే భార్య గర్భవతి అని తెలిసినా అత్యంత దారుణంగా హతమార్చిన సంఘటన తెలంగాణ రాజధాని హైదరాబాద్ శివారులో చోటుచేసుకున్నది. పుట్టబోయే బిడ్డ గురించి కలలకంటున్న ఆమెను అనుమానంతో రాక్షసుడిగా మారి గొంతుకోసి అంత్యంత కిరాతకంగా చంపాడు. అంతేకాదు మృతదేహాన్ని అదృశ్యం చేసేందుకు అమానవీయంగా వ్యవహరించాడు. రంపంతో కాళ్లు, చేతులు, తల వేరు చేసి మూటకట్టి విడివిడిగా మూసీనదిలో పారవేశాడు. మిగిలిన శరీర భాగాన్ని తరలించే ప్రయత్నం చేస్తూ మరోపక్క భార్య అదృశ్యమైందని కట్టుకథ అల్లి చివరిదశలో పోలీసులకు దొరికిపోయాడు. ప్రేమించి పెళ్లిచేసుకున్న నెల తర్వాత నుంచే ఆమెకు వేధింపులు ఆరంభమయ్యాయి. భరించలేని ఆ యువతి వికారాబాద మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అనుగుణంగా కేసు నమోదు అయింది. ఆ తర్వాత గ్రామంలో పెద్ద సమక్షంలో మూడు, నాలుగు సార్లు పంచాయతీ కూడా జరిగింది. భార్యపై అనుమానం పెరగడంతో ఉద్యోగం కూడా మాన్పించాడు. వైద్యపరీక్షలు పూర్తి అయిన తర్వాత తాను వెళ్లి తల్లిగారి ఇంటివద్దనే ఉంటానని చెప్పినా అంగీకరించకపోవడంతో వాదులాట జరిగి అంతం చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. మొన్న శనివారం భార్య మీద దాడి చేసి గొంతు కోసి ఈ కిరాతకానికి ఒడిగట్టాడు. ఇక దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో నోయిడా ప్రాంతంలో అదనపు కట్నంకోసం మరొక కిరాతకుడు జుట్టుపట్టుకొని ఈడ్చికెళ్లి తల్లిదండ్రులతో కలిసి రసాయనికాలు చల్లి నిప్పంటించి చంపిన దారుణ సంఘటన చోటుచేసుకున్నది. ఆయన డిమాండ్ మేరకు మృతురాలి తల్లిదండ్రులు ఒక ఖరీదైన కారుతోపాటు మోటారుసైకిల్, మరి కొంత నగదు, బంగారం పెద్దఎత్తునే ముట్టచెప్పారు. అయినా తాను కుటుంబం కోసం కొన్న మెర్సిడీస్‌బెంజ్ కారు కొనివ్వాలని,మరో ముప్పైఆరు లక్షల అదనపుకట్నం ఇవ్వాలని కొంతకాలంగా ఒత్తిడి చేస్తున్నట్లు మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తాము ఇవ్వకపోవడంతో తమ కుమార్తెపై శనివారం ఆయన కుటుంబ సభ్యులతో సహా అందరూ కలిసి దాడిచేసి రసాయనికం చల్లి నిప్పంటించారు. డెబ్భైశాతం గాయాలతో ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. ఆరేళ్ల కుమారుడు కూడా తనముందే తన తండ్రి అమ్మను కొట్టి ఆమెపై రసాయనం పోసి సీజర్‌లైట్‌తో నిప్పంటించాడని చెప్పడం అందరిని కలచివేసింది. పోలీసులు అరెస్టు చేసిన తర్వాత ఆయనను సంఘటనాస్థలానికి తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా ఇన్‌స్పెక్టర్ పిస్తోల్ లాక్కొని పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపే కాల్పుల్లో నిందితుడికి కాలికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఇక భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పట్టణంలో మరొక దారుణం చోటుచేసుకున్నది. తమ అల్లుడు ఫోన్ చేసి మెట్ల మీద నుంచి తన భార్యపడిపోయిందని ఆస్పత్రిలో చేర్పించామని చెప్పడంతో పరుగున వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లేసరికి అక్కడ ఒక ఎముకల గూడుగా మారి విగత జీవిగా పడిఉన్న తమ కుమార్తెను చూసి హతాశులయ్యారు. అల్లుడే తమ బిడ్డను తిండిపెట్టకుండా హింసించి హత్య చేశాడని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. గత రెండున్నర సంవత్సరాలుగా తమకుమార్తెతో మాట్లాడే అవకాశం లేకుండా అదనపు కట్నం కోసం ఆమెను వేధించాడని వారు వాపోతున్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మరొక రాక్షసుడు భార్యను కత్తితో హత్య చేసి ఆ తర్వాత పెట్రోలు పోసి తగలబెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వరంగల్‌జిల్లాలో మరొక యువతి భర్త ఘాతుకానికి బలైపోయింది. తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని భర్త చెప్పడంతో ఇరుగుపొరుగువారు 108కి ఫోన్‌చేయగా వారువచ్చి ఆ యువతి చనిపోయిందని నిర్ధారించారు. కేవలం వరకట్నం కోసం తమ కుమార్తెను మట్టుబెట్టాడని ఫిర్యాదు చేశారు. ఆమెకు ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఎందరో యువతులు నిత్యం బలైపోతూనే ఉన్నారు. ఇంకెందరో బయటకు చెప్పుకోలేక,అటు పోలీసుస్టేషన్ గడప ఎక్కలేక తమలో తాముకృంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు అన్నీఇన్నీకావు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు చట్టాలు చేసిచేతులు దులుపుకుంటే సరిపోదు. ఆచరణలో త్రికరణశుద్ధిగా ప్రయత్నంచేయాలి. అప్పుడే ఈ పశుప్రవృత్తికి కొంతవరకైనా పగ్గాలు వేయగలుగుతాం.

సంపద ఉప్పునీరు లాంటిది. ఎంత తాగితే అంత దప్పిక పెరుగుతుంది.



గోల్డ్‌స్మిత్

ఏప్పుడైతే బాధ్యత మొత్తం మన భుజస్కంధాలపై మోపబడుతుందో అప్పుడు మనం అత్యుత్తమంగా, అత్యున్నతంగా పనిచేస్తాం.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



## సొంత కెప్టివ్‌మైన్లు అవసరం

దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థలు కీలక పాత్ర పోషించాయి. అలాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లోవిశాఖ ఉక్కు కర్మాగారం ఒకటి. ఇది కేవలం ఉక్కు తయారీ కేంద్రం కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అన్న నినాదం వందలాది కుటుంబాల భవిష్యత్తును ప్రతిబింబిస్తోంది. 1971లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు, ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని 1982లో ఉత్పత్తి ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ కర్మాగారం తూర్పు తీర ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలిచింది. అయితే ఇనుము ఖనిజ మైన్ల లేమి, పెరిగిన ముడిసరుకు వ్యయాలు, అప్పుభారాలు క్రమంగా సంస్థను బలహీనపరిచాయి. ఇటీవల మళ్లీ ప్రైవేటీ కరణ ప్రతిపాదనలు ముందుకు రావడం ఆందోళన కలిగిస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## బదలీ అయిన వారిని రిలీవ్ చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జూన్ నెలలో బదలీలు చేపట్టింది. కానీ కొంత మంది ఉపాధ్యాయులు 2025 బదలీల్లో బదలీ అయ్యి రిలీవర్ లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. బదలీ అయ్యి మూడునెలలు పూర్తి అవుతున్నా ఇప్పటికీ పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. అటువంటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి బదలీ పొందిన స్థానాల్లో జాయిన్ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. డిఎస్సీ 2025 ద్వారా నియమింపబడే ఉపాధ్యాయులను, బదలీ అయ్యి రిలీవర్‌లేక పాత స్థానాల్లోనే పనిచేస్తున్న ఉపాధ్యాయుల స్థానాల్లో నియమించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ఉత్సవాల నిర్వహణకు చెక్ పెట్టాలి

ఆనాటి ఆ స్వతంత్ర పోరాటంలో భారతీయ భావజాలంతో ప్రజలను ఒకటిచేయడానికిబాలగంగాధర్ తిలక్ గారు వినాయక చవితి ఉత్సవాలను ప్రారంభించారు. కానీ ఈ రోజుల్లో వీధికో వినాయకుడు బయలుదేరాడు. విచిత్ర వేషాలతో కొత్తదనం పేరుతో కోతి చేష్టలు చేస్తున్నారు. నిజంగా ఈ వినాయక చవితి ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయి. ఇకనైనా పాలకులు ఈ ఉత్సవాల నిర్వహణకు చెక్ పెట్టాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## నేరాలకు అడ్డాగా ఓటీటీ ప్లాట్ ఫామ్స్

హైదరాబాద్ కూకట్‌పల్లిలో సంచలనం సృష్టించిన బాలిక హత్య కేసును పరిశీలిస్తే పక్క బిల్డింగ్‌లో నివాసం ఉంటున్న 15 సంవత్సరాల టెన్త్ క్లాస్ స్టూడెంట్ కిల్లర్‌గా గుర్తించారు. చోరీకోసం ఇంట్లోకి ప్రవేశించిన ఆ బాలుడు అడ్డు వచ్చిన బాలికను చంపేసిన తీరు చాలా బాధాకరం కలిగిస్తుంది. ఓటీటీలకు అలవాటు పడిన ఆ బాలుడు క్రైమ్ వెబ్ సిరీస్‌లను చూసి, అందులోని సన్నివేశాలను ప్రేరణగా పొంది చోరీకి ప్రణాళిక వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఓటిటీ కంటెంట్ ప్రజలకు అవగాహన కల్పించడం కంటే నేరాలను ప్రోత్సహించేందుకు అడ్డాలుగా మారిపోయాయి. ఓటీటీలకు సెన్సార్ షిప్ లేకపోవడంతో ఓటీటీల్లో క్రైమ్ సీన్స్ హద్దు మీరుతున్నాయి. ఇలాంటి నేరస్వభావాలను ప్రోత్సహించే ఓటీటీలు, సోషల్ మీడియా కంటెంట్‌లపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి

ఏపి విశ్వబ్రాహ్మణ రాష్ట్రకార్పొరేషన్ నియామకాన్ని ప్రస్తావిస్తూ, వేల విశ్వబ్రాహ్మణ కుటుంబాలు పూర్తిగా బంగారు నగల తయారీ, మరమ్మత్తులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నందున ఏ ఉపాధి లేక వారి పిల్లల చదువు, పోషణ భారంగా మారి, బజారు షాపుల్లో ప్రైవేట్ వృత్తి చేస్తున్నారు. చదువులకు పెట్టుబడి లేదు. కుటుంబంలో ఆడ పిల్లల వివాహాలు చేయలేక కొంతైనా ఆర్థిక సహకారానికి ఆశపడుతున్నారు. జిల్లా స్థాయిలో కార్పొరేషన్ కుటుంబాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన కల్పించాలి. ఇల్లు లేని వారికి స్థలాలు మంజూరు చేసి రుణ సహాయం చేస్తే మంచిది.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## పర్యవేక్షణ లోపం.. వసతులు కొరత

పెట్రోల్ బంకుల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో కనీస వసతులు కరవవుతున్నాయి. పెట్రోలు,డీజిల్ లీటర్ ధర పెద్ద పెద్ద అక్షరాల్లో తెలిపే బోర్డులు,ఉచితంగా కల్పించాల్సిన సౌకర్యాలైన గాలి నింపేయంత్రాలు, ప్రథమ చికిత్స పెట్టె, స్వచ్ఛమైన తాగునీరు, ఫిర్యాదులు పెట్టె, ఫైర్ నియంత్రణ యంత్రాలు పలు బంకుల్లో మచ్చుకైనా కనిపించడం లేదు. కొన్నిట్లో నామ మాత్రంగా ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహణ సరిగా ఉండట్లేదు. విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు బంకులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇసి వైఫల్యం వెనుక మన బాధ్యత లేదా?

ప్రజాస్వామ్యంలో రాజకీయంగా, పార్టీలకున్న పాత్ర ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో ఏ విధంగా సహకరించాలన్న మూలసూత్రాన్ని విస్మరిస్తున్నారు. 1990 లో శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడు కమిషన్‌కు పదునైన పనితీరును, ఎలక్టొరల్ అక్రమాలను ఎదుర్కోటానికి మాన్యువల్‌ను దుమ్ముదులిపి చట్టపరంగా చర్యలు ఎవరినీ లెక్క చేయకుండా చేపట్టడంతో ప్రతిభతో కూడిన బలైన ఎన్నికల కమిషన్‌గా శేషన్‌కమిషన్ ప్రపంచ చరిత్రలోనే మిగిలిపోయింది. ఎన్నికల్లో అభ్యర్థులు పార్టీలు హద్దును అతిక్రమించి ఖర్చు పెట్టున్నప్పుడు తీసుకుంటున్న చర్యలు పేలవంగా ఉన్నాయి. ఎన్నికల పండుగను డబ్బులు సంపాదించే పండుగగా ఓటర్లు భావించేస్థితికి మన నాయకులు తీసుకొని వచ్చారు. ఓటర్లు తమకు ఉన్న విలువ గమనించి బాధ్యతగా నిజాయితీగా ఓటు వాక్కును వినియోగించుకోవాలి. రాజకీయ పార్టీలు స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిధిలోన్యాయంగాఎన్నికలు జరిగేట్లు చూడాలి. అప్పుడే ఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టే హక్కు ఎవరైనా పొందగలరు.



రావులపాటి సీతారాం రావు

కేవలం ఎలక్షన్ కమిషన్‌ను తప్పు పట్టటానికే దేశంలోని విద్యాధికులు, నిపుణులు, సామాన్యులు ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఎలక్షన్ కమిషన్ వల్ల కొన్ని పొరపాట్లు జరిగి ఉండవచ్చు. ఆ విషయాన్ని పక్కన పెట్టి కాసేపు నిజానిజాల మీద దృష్టిసారిస్తే పూర్తి అవగాహన సాధ్యపడుతుంది. రాజకీయ పార్టీలకు మనదేశంలోని రాజ్యాంగ వ్యవస్థల అస్తిత్వం కొంత వరకు కోల్పోవడంలో పాత్ర లేదా? ఆ అవగాహన ఈ ముఖ్యమైన విషయంలో అత్యంత అవసరంగా కనపడుతున్నది! ఎన్నికలలోని లోపాలను పట్టించుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉంది. నిజమే! ఓటింగ్ లిస్టులలో ప్రతి రాష్ట్రంలో ఎన్నో పొరపాట్లు జరుగుతున్నాయి. ఓటర్ల పేర్లలో ఒక్కడి పేరే పలుమార్లు కనపడుతున్నది. అర్హతలేని వారిని ఓటర్లుగా చేరుస్తున్నారు. బినామీ ఓటర్లు కూడా తయారవుతున్నారు. ఒకరి బదులు మరొకరు ఓటు వేస్తున్నారు.ఇన్ని తప్పులతో ఉన్న ఎలక్టొరల్ లిస్టుల వల్ల ప్రజల నమ్మకం సడలుతున్నది. దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను ఎలక్షన్ వ్యవస్థ మీద క్రమేపీ తగ్గడానికి రాజకీయ పార్టీల పాత్ర కూడా ఉందన్న సత్యాన్ని గమనించి తగిన చర్యలు ప్రభుత్వాలూ, రాజ్యాంగ వ్యవస్థలూ తలపెట్టినప్పుడే ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు బాగుపడతాయి. చివరకు సుప్రీంకోర్టు బీహార్ రాష్ట్రంలోని ఓటర్ల నమోదులోని అవకతవకలను సమీక్షిస్తూ బీహార్‌లో తీసివేయబడ్డ ఓటర్లను నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు అయినా ఓటరుగా గుర్తింపు తెలిపే ఏ డాక్యుమెంట్ అయినా ఆన్‌లైన్‌లో గుర్తింపుకు సాక్ష్యంగా ఇస్తే చాలు అని ఆదేశించే పరిస్థితి వచ్చింది. ఎన్నికల అవకతవకలు వెలుగులోకి రావటం ఒక విధంగా మంచిదే! వాటిని సరిచేసుకొని, ఎన్నికల కమిషన్‌కు మరింత పారదర్శకంగా, వివాదరహితంగా ఎన్నికలు నిర్వహించడానికి అవకాశం వచ్చినట్లయింది. రాజకీయ పార్టీలు కూడా తమ స్వపక్ష వాదాలు పక్కనపెట్టి, సరైన ఎన్నికల నిర్వహణకు తోడ్పడవచ్చు. పార్టీరహితమైన ఆలోచనలు సమిష్టిగా చేయగలిగితే ప్రజలకు మేలు చేసినవారు అవుతారు. ఎన్నికలల్లో రాజకీయ నాయకులు మరింతగా తలదూర్చకపోతే, ఓటర్లు తమ బాధ్యతను గుర్తించి నైతిక విలువలతో ఓటు హక్కును వినియోగించుకోగలరు. అప్పుడు అభివృద్ధి పొందుతున్న ప్రజాస్వామ్యం బ్రతకటమే కాకుండా దేశంలో పటిష్టంగా నిలబడుతుంది. రాజకీయాలు సక్రమంగా ఉండకపోతే ఎన్నికలు నవ్వులపాలు అవుతాయి. ప్రజాస్వామ్య విలువలను మట్టిలో కలుపుతాయి. ఎలక్టొరల్ రోల్ అప్పుడప్పుడు సక్రమంగా ఉందా లేదా అని చూసుకోవాల్సిన అవసరం బాధ్యత ఎన్నికల కమిషన్‌కు ఉంటుంది. దానిని స్వప్రయోజనాల కోసం రాజకీయ పార్టీలు తప్పుపట్టడం సమంజసంకాదు. ఓట్లు, ఓటర్లకు సంబంధించిన అంశాలలో రాజకీయ పార్టీలు, ఓటర్లు,సామాన్య ప్రజలు ఈ మధ్యన అప్రమత్తంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఖచ్చితంగా నమోదు కాబడిన ఓటర్ల లిస్టు, తప్పులు లేని లిస్టు కావాలని పట్టుబడుతున్నారు. కేరళలో లోకల్‌బాడీ ఎన్నికలలో కూడా జాగ్రత్త వహించటం వెలుగులోకి వచ్చింది.




అదే ఓటర్‌కార్డు మీద డూప్లికేటు ఓటర్ కార్డులు బయట పడటం (ఐ.డికార్డు కూడా ఉండటం) ఎన్నో ఓటర్ కార్డులు ఒకే వ్యక్తి కలిగి ఉండటం బయటపడటంతో అక్కడఓటర్లు, పార్టీ నాయకులు నానా హంగామా చేశారు. ఇంతగా విషయాలు ఇంతకు మునుపు బయటకు రాకపోయినా కొందరు ఓటర్లు న్యాయం కోసం పోరాడారు. కానీ ఇప్పుడు ప్రతి వారిలో అవగాహన పెరగడంతో అధికారుల ముందు, సంబంధిత ఎలక్టొరల్ ఆఫీసర్ల ముందు పట్టుపట్టి ప్రతి విషయాన్ని తప్పిదాన్ని మీడియాలో రాజకీయంగా ప్రచారం చేయడంతో బూత్ కమిటీ వ్యవస్థకు ప్రాధాన్యత పెరిగింది. కేరళలోనే కాదు దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలోబూత్ కమిటీలు ఏర్పడి ఎన్నికలలో లొసుగులు వేలెత్తి చూపుతూ క్షేత్రస్థాయిలోనే పోరాటాన్ని పెంచారు.ఓటు విలువను ఇనుమడింపచేశారు. గతించిన రోజుల్లో గ్రామాలలో పెత్తందారులు, భూస్వాములు, వెనుకబడిన వర్గాల వారికి తెలియకుండానే వారి ఓట్లను రిగ్గింగ్ చేయటమేకాకుండా ప్రతిసారి, ఏ ఎన్నికలలోనైనా వారు నిలబెట్టిన వారే గెలిచే చక్రం తిప్పేవారు. దానితో వారికి రాజకీయ పార్టీలలో కూడా ప్రాధాన్యత పెరిగి, వారిని ఏదో విధంగా లోబర్చుకుంటే చాలు తమ అభ్యర్థులను గెలిపించుకోవచ్చు అన్న నమ్మకం పెరగడంతో చాలా చోట్ల సామాన్య ఓటర్‌కు తెలియకుండానే వారి ఓట్లు బాలెట్ బాక్స్‌లలో పడేవి. నిజాయితీగా ఎన్నికలు జరుగకపోయే ఆ రోజులు పోయాయి. నిజానికి ఎన్నికల కమిషన్ మాన్యువల్‌లో ఇలాంటి అక్రమ పద్ధతులు నివారించడానికి ఎన్నో మార్గదర్శక సూత్రాలు పొందుపర్చారు. ఉదాహరణకు హెచ్చుసంఖ్యలో ఒకే ఇంటి నుంచి ఓట్ల నమోదు కోసం ఎన్నో దరఖాస్తులు ఇవ్వడం నిషిద్ధంఅయితే ఒకే కుటుంబంలో నిజంగా ఎక్కువ సంఖ్యలో దరఖాస్తుదారులు, సభ్యులుగా ఉంటే ఎంక్వైయిరీ చేసి అనుమతించవచ్చు. బూత్ లెవల్ ఏజెంట్ల పాత్రను గురించి ప్రస్తావించక తప్పదు. ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టినదే బూత్‌స్థాయిలో ఏజెంట్ల పాత్ర.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లు బూత్‌స్థాయి అధికారులకు సహాయపడొచ్చు. బూత్ లెవల్ ఏజెంట్లుగా గుర్తించబడాలంటే వారు అదే చోట ఎలక్టొరల్ లిస్టులో ఓటర్‌గా నమోదు కాబడి ఉండటం తప్పనిసరి. వాళ్ల ముఖ్య కార్యక్రమం కొత్త ఓటర్లను నమోదు చేసుకోవాలన్నా, చెల్లుబాటులో లేని ఓటర్లను తొలగించాలన్నా డ్రాఫ్ట్ రోల్స్‌ను పరిశీలించే అవకాశం వారికిఉంది. తప్పులు సరిదిద్దే పనితోపాటు ఏ లోపాన్నైనా సవరించే బూత్ లెవల్ ఆఫీసర్‌కు సహాయపడవచ్చు. ఎలక్షన్ కమిషన్ అందుకనే రివిజన్ దశలో బూత్ కమిటీలు ఏంచేస్తున్నట్లు అన్న సహేతుకమైన ప్రశ్నను, తప్పులను ప్రశ్నిస్తున్న రాజకీయ పార్టీల ముందు లేవనెత్తింది. ఏది ఏమైతేనేం కేవలం ఎన్నికల కమిషన్ మీదనే భారంఅంతా వేసి వాతావరణం ఎన్నికల్లోఅనుకూలంగా లేకపోతే రాజకీయ పార్టీలు ఏదో లొసుగులను వెలికితీసి కమిషన్‌ను తప్పుపట్టడం అలవాటు చేసుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా, పార్టీలకున్న పాత్ర ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో ఏ విధంగా సహకరించాలన్న మూలసూత్రాన్ని విస్మరిస్తున్నారు. 1990 లో శేషన్ ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్నప్పుడు కమిషన్‌కు పదునైన పనితీరును, ఎలక్టొరల్ అక్రమాలను ఎదుర్కోటానికి మాన్యువల్‌ను దుమ్ముదులిపి చట్టపరంగా చర్యలు ఎవరినీ లెక్క చేయకుండా చేపట్టడంతో ప్రతిభతోకూడిన బలమైన ఎన్నికల కమిషన్‌గా శేషన్‌కమిషన్ ప్రపంచ చరిత్రలోనే మిగిలిపోయింది. ఎన్నికల్లో అభ్యర్థులు పార్టీలు హద్దును అతిక్రమించి ఖర్చు పెట్టున్నప్పుడు తీసుకుంటున్న చర్యలు పేలవంగా ఉన్నాయి.ఎన్నికల పండుగను డబ్బులు సంపాదించే పండుగగా ఓటర్లు భావించేస్థితికి మన నాయకులు తీసుకొని వచ్చారు. ఓటర్లు తమకు ఉన్న విలువగమనించి బాధ్యతగా నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాజకీయపార్టీలు స్వప్రయోజనాల కోసం కాకుండా ప్రజాస్వామ్య పరిధిలోన్యాయంగాఎన్నికలు జరిగేట్లు చూడాలి.అప్పుడేఎన్నికల కమిషన్‌ను తప్పుపట్టే హక్కు ఎవరైనా పొందగలరు. ●

# 'బై వన్, గెట్ వన్'లో లాభ నష్టాలెంత!

డి జె మోహన రావు

అత్యుత్తమమైనదిగా కనిపించేది అబద్ధం కావచ్చు. ఒకటి కొంటే ఒకటి ఉచితం అనే నినాదం వెనుకనున్న వాస్తవం ఇదే. ఒక వస్తువు కొనుగోలుపై మరొకటి ఉచితం అని ప్రకటిస్తే మన మనసులో ఏదో ఒక మూల సంతోషం కలుగుతుంది. 'బై వన్ గెట్ వన్ ఫ్రీ' (బోగో) అనే ఈ నినాదం వినియోగదారుల మనస్తత్వంలో ఒక లోతైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది ఒక ఆకర్షణీయమైన బహుమతిలా కనిపించినా దాని వెనుక బలమైన వాణిజ్య వ్యూహాలు దాగి ఉంటాయి. నేటి వినియోగదారుడిగా మనం కేవలం ఆకర్షణకు లోనై కాకుండా, దీనిలోని ఆర్థిక గూఢార్థాలను విశ్లేషించడం అవసరం. ఇది కేవలం ఒక ఆఫర్ కాదు. మన ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేసే ఒక శక్తివంతమైన సాధనం. వ్యాపార సంస్థలకు ఈ ఆఫర్ కేవలం అమ్మకాలను పెంచుకునే సాధనం మాత్రమే కాదుఇది ఒక సమగ్రమైన వాణిజ్య వ్యూహం. ఒక సంస్థ తమ గోడౌన్లలో పేరుకు పోయిన పాత సరుకును త్వరగా ఖాళీ చేయడానికి ఇది ఒక సమర్ధవంతమైన మార్గం. అలా చేయడం వల్ల కొత్త సరుకుకు స్థలం దొరకడమే కాకుండా నిల్వ ఖర్చులు కూడా గణనీయంగా తగ్గుతాయి. అంతేకాకుండా ఇది మార్కెట్లోకి కొత్తగా ప్రవేశపెట్టిన ఉత్పత్తులకు ఒక వేదికగా పనిచేస్తుంది. ఈ ఆఫర్ ద్వారా ఒక వస్తువు ధరకే రెండు వస్తువులు వస్తాయి కాబట్టి వినియోగదారులు ఆ కొత్త ఉత్పత్తిని ప్రయత్నించడానికి సుముఖత చూపుతారు. ఈ వ్యూహం సంస్థకు ఒకేసారి రెండు లక్ష్యాలను సాధించే అవకాశాన్ని ఇస్తుంది. పాత నిల్వలను తగ్గించడం, కొత్త ఉత్పత్తికి మార్కెట్‌ను సృష్టించడం. మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవడానికి, తమ సంస్థే అత్యుత్తమమైన ఆఫర్లను అందిస్తుందని నిరూపించుకోవడానికి కూడా ఈ వ్యూహం ఉపయోగపడుతుంది. బోగో ఆఫర్‌ను పైపైన చూసినప్పుడు అది పూర్తిగా మనకు లాభదాయకంగా కనిపిస్తుంది.





మనం తరచుగా ఉపయోగించే వస్తువులపై ఈ ఆఫర్ ఉన్నప్పుడు, మన జేబుకు నిజంగానే కొంత ఉపశమనం లభిస్తుంది. కానీ దాని వెనుక ఉన్న కొన్ని సున్నితమైన అంశాలను మనం తప్పకుండా గమనించాలి. అనేక సందర్భాలలో వ్యాపారులు అసలు వస్తువు ధరను కృత్రిమంగా పెంచి ఆ తర్వాత ఈ ఆఫర్‌ను ప్రకటిస్తారు. అంటే, మనం రెండు వస్తువుల ధరను ఒకే వస్తువుపై చెల్లిస్తున్నామని మనకు తెలియకుండానే మోసపోతాం. అంతేకాక, ఈ ఆఫర్‌కు ఆకర్షితులై మనకు అవసరం లేని వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా మన డబ్బును దుబారా చేస్తాం. ఇది మనకు ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోగా, మన జేబుకు మరింత భారం అవుతుంది. ఈ ఆఫర్లను చూసి అనవసరమైన కొనుగోళ్లు చేయడం వల్ల మనకు ఉపశమనం లభించకపోగా, ఇంట్లో వాడని వస్తువుల నిల్వ పెరుగుతుంది. అమ్మకాల ఒత్తిడికి లోనుకాకుండా తెలివైన కొనుగోలుదారుడిగా ఉండటమే ఈ మాయాజాలం నుండి బయటపడే మార్గం. ఈ ఆఫర్‌ను చూసిన వెంటనే ఉద్వేగపూరితమైన నిర్ణయాలు తీసుకోకుండా ఒక నిశ్శబ్దమైన విశ్లేషణ చేయాలి. ఆ వస్తువు మీకు నిజంగా అవసరమా అని ప్రశ్నించుకోవాలి. అవసరం అనుకుంటే ఒకటి కొంటే ఒకటి ఫ్రీగా వస్తుందంటే సంతోషమే. అవసరం లేకున్నా కొనుగోలు చేయడం అంటే డబ్బులు వృధా. కొంతమంది ముందుకు ఎప్పుడన్నా ఉపయోగపడుతుందిలే అనుకుంటారు. అలాంటి వారు చాలా మంది ఉన్నారు. ఆఫర్‌లో ఉన్న వస్తువు అసలు ధరను ఇతర చోట్ల పరిశీలించాలి. దాని నాణ్యతను గురించి తెలుసుకోవాలి. బైన్ వన్ గెట్ వన్ ఫ్రీ కేవలం 'ఉచితం' అనే పదం కోసం అనవసరమైన వస్తు వులను కొనడం మన ఆర్థిక భవిష్యత్తుపై చేసే ఒక బలహీనమైన దాడి. ఎందుకంటే అత్యుత్తమమైన ఆదా అనేది ఆకర్షణీయమైన ప్రకటనల నుండి రాదు. అది మీ అవగాహనతో కూడిన, తెలివైన కొనుగోలు నిర్ణయాల నుండి మాత్రమే వస్తుంది. కాబట్టి ఇకపై మనం ఇటువంటి ఆఫర్‌ను చూసినప్పుడు కేవలం ఒక ఆఫర్‌గా కాకుండా అది ఒక ఆర్థిక పరీక్షగా భావించి, విజయవంతంగా దాటాలి. ●

# పంచాయతీలే ప్రగతికి పట్టుకొమ్మలు



డాక్టర్ తిరునహరి శేషు

దేశ ప్రగతికి పంచాయతీలే పట్టుకొమ్మలు గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యంగా భావిస్తాం కాబట్టి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం, గ్రామీణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లలో నిధుల కేటాయింపు, ప్రత్యేక కార్యక్రమాలు, పథకాల రూపకల్పనతో పాటు ప్రణాళికలలో కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణ స్వభావికంగా వ్యవసాయక రాష్ట్రం 61 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తుంది కాబట్టి రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణ అభివృద్ధి రంగాలకి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించటమే కాదు పల్లె ప్రగతి లాంటి ప్రత్యేక కార్యక్రమాలను కూడా రూపొందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు బడ్జెట్‌లలో గ్రామీణాభివృద్ధి కోసం సగటున 30 వేల కోట్ల రూపాయలను కూడా కేటాయిస్తుంది. దశాబ్దాలుగా గ్రామపంచాయతీల నిధులు, విధుల విషయంలో వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామ పంచాయతీలు స్వయం పోషక ఆర్థిక వ్యవస్థలు కాకపోవటం వలన నిధుల కోసం గ్రామపంచాయతీలు ప్రభుత్వాలు ఇచ్చే నిధులు, గ్రాంట్స్‌పై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక సంఘం కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదల చేసే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించే నిధులే గ్రామ పంచాయతీలకి ప్రధాన ఆర్థిక వనరులు అయితే ప్రభుత్వాలు సకాలంలో గ్రామపంచాయతీలకి నిధులు విడుదల చేయకపోవటం వలన గ్రామీణ ప్రాంతాలలో పౌర సేవలు అందించడంలో, మౌలిక సదుపాయాలు కల్పించడంలో పంచాయితీ పాలకవర్గాలు వైఫల్యం చెందుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2019లో మొదటిసారి 12,751 గ్రామపంచాయతీలకి ఎన్నికలను నిర్వహించారు కాబట్టి 2020 నుండి ప్రతి సంవత్సరం కేంద్రం నుండి పంచాయతీలకు 1430 కోట్ల రూపాయల నిధులు విడుదలైనాయి. 2020-21 నుండి 2023-24 వరకు 6051 కోట్ల రూపాయల నిధులు పంచాయతీలకు కేంద్రం నుండి అందినాయి. కానీ 2024 ఫిబ్రవరి నుండి ఎన్నికైన గ్రామ పంచాయతీల పాలక వర్గాల కాల పరిమితి ముగిసిపోవటం పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలన లోకి రావటం రాష్ట్ర ప్రభుత్వం గత 19 నెలలుగా గ్రామ పంచాయతీలకి ఎన్నికలు నిర్వహించకపోవటం వలన 15



వ ఆర్థిక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీలకు రావలసిన 1514 కోట్ల రూపాయలను నిలిపివేసింది. అలాగే 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రావలసిన 1477 కోట్ల రూపాయల నిధులను కూడా నిలిపివేసే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీ ఎన్నికలను నిర్వహించకపోవటం వలన దరిదాపు 3000 కోట్ల రూపాయల నిధులు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఒకవైపు కేంద్రం నుండి వచ్చే నిధులు రాకపోవటం మరొకవైపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవటం వలన ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామ పాలనా వ్యవస్థ పడకేసిందనే చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధం, వీధి దీపాలు, డ్రైనేజ్ వ్యవస్థ, త్రాగునీరు, రోడ్లు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపిక, సాధారణ పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2019లో మొదటిసారి గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించారు. మళ్లీ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు 12,778 గ్రామపంచాయతీలకు సెప్టెంబర్ 30 లోపు రెండోసారి ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించబోతుంది. అయితే అవినీతి రహిత, అంకితభావం, సమర్థవంతమైన వారిని పంచాయతీ ప్రెసిడెంట్‌లుగా ఎన్నుకోవడం ద్వారా గ్రామ పాలనావ్యవస్థని కొత్త పొంతలు తొక్కించవచ్చు. అలాగే గ్రామీణ అభివృద్ధి పట్ల ప్రభుత్వ దృక్పథం, వ్యూహాలు కూడా మారాలి. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధి సాధనలో ఒక విప్లవాత్మకమైన మార్పుగానే చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత కార్యక్రమాలను సమర్థవంతంగా ఉపయోగించటం, విద్యా, ఆరోగ్యం, పారిశుధ్యం, త్రాగునీరు, రోడ్లు, విద్యుత్, పేదలకి పక్కా ఇళ్ళు లాంటి మౌలిక వసతులను కల్పించటం, వ్యవసాయ ఆధార, అనుబంధ రంగాలు, చేతివృత్తులు, గ్రామీణ చిన్న పరిశ్రమల విస్తరణ ద్వారా ఉపాధి రంగాన్ని విస్తరించటం, ఆధునిక సాంకేతికతతో గ్రామీణ వ్యవస్థని అనుసంధానం చేయటం ద్వారా గ్రామీణ అభివృద్ధిని సాధించే అవకాశాలు ఉంటాయి. గ్రామపంచాయతీలను మహిళలకు రిజర్వ్ చేసిన తర్వాత తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల ప్రగతిలో గుణాత్మకమైన మార్పు కనిపిస్తుంది. ఆళ్లగడప గ్రామపంచాయతీలో చేసిన ప్రయోగం, గంగదేవపల్లి అభివృద్ధి నమూనా, అన్నా హజారే నేతృత్వంలో రాలేగావ్ సిద్ధి అనుభవాలు రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు విస్తరిస్తే గ్రామీణ అభివృద్ధిలో నవశకం మొదలవుతుంది. అభివృద్ధిలో గ్రామీణప్రాంతాల భాగస్వామ్యం పెరగకుండా గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరగకుండా 2035 నాటికి తెలంగాణ రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగలేదనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. గ్రామీణ అభివృద్ధిని కాంక్షి ంచే ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా పంచాయతీలకి సకాలంలో ఎన్నికలు నిర్వహించటంతో పాటు నిధులు విధులతో గ్రామ పాలనా వ్యవస్థని బలోపేతం చేసినప్పుడే గ్రామీ ణాభివృద్ధి అనే స్వప్నం సాకారమవుతుంది. ●

# 30 రోజుల్లో బెయిలు లేదా రాజీనామా

## అరెస్టయితే ప్రధానికైనా, ముఖ్యమంత్రికైనా అదే నియమం

## జైలునుంచి పాలన న్యాయం కాదుకదా!: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. మన ప్రజా స్వామ్యానికి అదిమర్యాదపూర్వకంగాఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశంపైనా స్పందించారు. విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేయగల మని అనుకుంటున్నారు. వారు జైలునే సిఎం, పిఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డిజిపి, చీఫ్‌సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మాపార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు అని అమిత్ షా అన్నారు. ప్రధానిగానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీ నామా చేయాలి. అలా చేయకపోతే చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం.

చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోడీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళితే ఆయనైనా రాజీ నామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంత రాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా? అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిప డ్డారు. ఈ బిల్లు ఖచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విప క్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండిం చారు. ఈ సందర్భంగా 2013నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీపై ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్‌గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదికాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది. అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలోఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతి పక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదుఅని అమిత్ షా స్పష్టంచేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్ర పతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు అని తెలిపారు.



ఫిజి ప్రధాని సిత్వెని రబుకా సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ దృశ్యం



# రాజస్థాన్‌లో భారీ వరదలు

## రెండు కిలోమీటర్ల మేర గొయ్యి!

**జైపూర్, ఆగస్టు 25:** గతకొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజస్థాన్‌లో భారీ వరదలు పోటెత్తాయి. వర్షాల వల్ల సుర్వాల్ జలాశయం పొంగి పొర్లటంతో రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపుర్ గ్రామంలో 2కిలోమీటర్ల మేర గొయ్యి ఏర్పడి జలపాతాన్ని తలపిస్తోంది. పొలాల మీదుగా నిరు ఉధృతంగా ప్రవహించి జదవత గ్రామాన్ని ముంచెత్తడంతో విధ్వంసం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. సవాయ్ మాధోపుర్‌లో 2 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పు, 55 అడుగుల లోతున బిలం ఏర్పడడంతో గ్రామా నికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. వర్షం ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందన్నారు. నీటి ఉధృతికి రెండు ఇళ్లు, పలుదుకాణాలు, రెండు దేవాల యాలుకూలినట్లు అధికారులు తెలిపారు. పోలీ సులు, భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నారు. సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించి గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కరోడి లాల్ మీనా పేర్కొన్నారు. బిలంలోకి చేరుకున్న నీటిని యంత్రాల సహాయంతో మళ్లించాలని అధికారు లను ఆదేశించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో నేల కొతను ఆపడం అసాధ్యమన్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని పలు గ్రామాలు వరద నీటిలో మునిపోయినట్లు అధికారులు పేర్కొ న్నారు. నిమోడా అనే గ్రామంలో దాదాపు 400 ఇళ్లు కూలిపోవడంతో అక్కడి ప్రజలు నిరాశ్రయు లయ్యారని వారిని సహాయక శిబిరాలకు తరలిం చామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సైన్యం, జాతీయ రాష్ట్ర విపత్తు సహాయ దళాలు సహాయక చర్యలు అందిస్తున్నాయన్నారు.

# రష్యాలో భారత్ కార్మికులకు డిమాండ్

**మాస్కో, ఆగస్టు 25:** రష్యాలో భారత కార్మిక శక్తికి డిమాండ్ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. రష్యన్ కంపెనీలు.. ముఖ్యంగా యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని సంస్థలు భారతీయులను నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అక్కడి భారత రాయబారి వినయ్‌కుమార్ తెలి పారు. రష్యాలో ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకునేందుకు భారతీయుల సంఖ్య పెరుగు తుండటంతో కాన్సులర్‌సేవలను మరింత విస్తరి స్తున్నట్లు చెప్పారు. అమెరికా, బ్రిటన్ తదితర పాశ్చాత్య దేశాలు వలసలపై ఆంక్షలు విధిస్తున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించు కున్నాయి. 'రష్యాలో మానవ వనరుల అవసరం ఉంది. భారత్ వద్ద నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి ఉంది. ఈ క్రమంలోనే స్థానిక చట్టాలను అను సరించి కంపెనీలు భారతీయులను నియమించు కుంటున్నాయి. ఇక్కడికి వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్రరంగాల్లో ఉపాధి పొందుతు న్నారు. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో భారతీయులకు డిమాండ్ పెరుగుతోంది' అని ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో వినయ్‌కుమార్ వెల్లడించారు.

స్థానికంగా భారతీయ కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో.. పాస్‌పోర్ట్ పొడి గింపు వంటి కాన్సులర్ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధానికితోడు యువ రష్యన్లు ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకు విముఖత చూపుతుండటం వంటి కారణాలతో.. 2030 కల్లా రష్యాలో 31 లక్షల మంది కార్మికులకు కొరత ఏర్పడనున్నట్లు అంచానా.

ఈ నేపథ్యంలో ఇక్కడి పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక కొరతను తీర్చడానికి ఈ యేడాది చివరికల్లా నిపుణులైన 10 లక్షల మంది భారతీయ కార్మికులను తీసుకోవాలని మాస్కో వ్యూహకర్తలు భావిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.

## అమెరికాలో లాబీయింగ్‌కు

# భారత్ ముమ్మర యత్నాలు!



**వాషింగ్టన్, ఆగస్టు 25:** అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి రావడానికి కొన్ని రోజులముందే భారత్ లాబీయింగ్ యత్నాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వంతో వ్యూహాత్మక అంశాల్లో కమ్యూనికేషన్లు నిర్వహించడం, సోషల్ మీడియా, మీడియా రిలేషన్స్, డిజిటల్ ఆడిట్ వంటివాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సంస్థను నియమించుకొంది. ఫారెన్ ఏజెంట్ రిజిస్ట్రేషన్ ఫైలింగ్ ప్రకారం.. భారత దౌత్య కారాలయం నెలకు 75,000 డాలర్లు చెల్లించేలా మూడు నెలలకు మెర్క్యురీ పబ్లిక్ అఫైర్స్ సంస్థతో ఒప్పందం చేసుకొంది. ఇది ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చింది. మెర్క్యురీ సంస్థ మాజీ రిపబ్లికన్ సెనెటర్ డేవిడ్ విట్టర్, 2020 ట్రంప్ ట్రాన్సిషన్ బృందం కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా చేసిన బ్రయాన్‌తో కలిసి భారత్ కోసం పనిచేస్తుంది. న్యూయార్క్ రాష్ట్రానికి సెనెటర్‌గా ఎన్నికైన తొలి ఇండో-అమెరికన్ కెవిన్ థామస్ సాయం చేయనున్నారు. ప్రస్తుతం ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ విలిస్ మెర్క్యురీ సంస్థతో సంబంధాలున్నాయి. 2024వరకు ఆమె ఈ సంస్థకోసం రిజిస్టర్డ్ లాబీయిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత శ్వేతసౌధంలో బాధ్యతలు చేపట్టారు. బ్రయాన్ గతంలో ట్రంప్ ప్రచార బృందంలో, జెడివాన్స్ సెనెట్‌కు పోటీ చేసినప్పుడు పనిచేశారు. విమర్శలు వచ్చాక.. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత పాకిస్థాన్ చాలా వేగంగా ఆయనతో సంబంధాలను బలోపేతం చేసుకొంది. భారత్ మాత్రం కొంత వెనకబడిందనే విమర్శలు వచ్చాయి. ఇక పాక్ నాయకత్వం ట్రంప్ మాజీ బాడీగార్డ్ కీత్ షల్లర్ నిర్వహిస్తున్న లాబీయింగ్ సంస్థను నియమించుకొంది. మరోవైపు భారత్ ఇప్పటికే ట్రంప్ మాజీ సహాయకుడు జేసన్ మిల్లర్‌కు చెందిన ఎస్‌హెచ్‌డబ్ల్యు పార్టనర్స్ ఎల్‌ఎల్‌సిని నియమించుకొని నెలకు 1.50 లక్షల డాలర్లు చెల్లిస్తున్నాం. అమెరికాలో కీలకమైన ఒప్పందాలు, ఇతర పనులను పూర్తి చేసుకోవడానికి లాబీయింగ్ సంస్థలను నియమించుకోవడం కొత్తేమీ కాదు. చాలా దేశాలు వీటితో కలిసి పనిచేస్తుంటాయి.

**రష్యాను అదుపు చేయడానికే భారత్‌పై చర్యలు..**

రష్యా దూకుడును అదుపు చేయడానికి ట్రంప్ సర్కారు చాలా చర్యలు తీసుకొందని ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ వెల్లడించారు. దీనిలో భాగంగానే భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించినట్లు పేర్కొన్నారు. ఆయన ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఎక్కడ తక్కువకు వస్తే అక్కడే చమురు కొంటాం

## రష్యాలో భారత్ దౌత్యవేత్త వినయ్‌కుమార్ స్పష్టీకరణ



**మాస్కో, ఆగస్టు 25:** రష్యా నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రష్యాతో ఆయిల్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కొన్ని నెలల క్రితమే ట్రంప్ హెచ్చరించారు. భారత్, రష్యానుంచి క్రూడ్ ఆయిల్ కొనటం అంటే.. ఇక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి రష్యాకు నిధులు సమకూరుస్తున్నట్లే అని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికల్ని భారత్ ఏమాత్రం లెక్కచేయలేదు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటూ ఉంది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. ఏకంగా 50 శాతం టారీఫ్ విధించారు. అయినా కూడా భారత్ వెనక్కు తగ్గలేదు. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ వారం రోజుల క్రితం మాట్లాడారు. తాము ఎవరి బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. తమకు భారత ప్రజల ప్రయోజనాలే ముఖ్యం అని అన్నారు. ఈనేపథ్యంలోనే రష్యాతన మిత్ర దేశం భారత్‌కు బంపర్ ఆఫర్ ఇచ్చింది. క్రూడ్ ఆయిల్‌పై5శాతం డిస్కౌంట్ ప్రకటించింది.

**ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాం..**

రష్యానుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై రష్యాలోని భారత అంబాసిడర్ వినయ్‌కుమార్ స్పందించారు.

తాజాగా, రష్యా ప్రభుత్వ మీడియా టాస్ ఏజెన్సీకి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశంలోని ఆయిల్ కంపెనీలు ఆయిల్ ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాయి.

భారత ప్రభుత్వానికి దేశప్రజల ప్రయోజనాలే ముఖ్యం.

ప్రజలకు సరిపడా ఆయిల్ అందించ డానికి తగిన చర్యలు తీసుకుంటుంది. రష్యాతో పాటు పలుదేశాలకు భారత్ పర స్పరసహకారం అందించటంవల్ల జాతీయ ఆయిల్ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్ నిలకడగా ఉంది. అంతెందుకు.. రష్యాతో అమెరికాకూడా వ్యాపారాలు చేస్తోంది కదా..' అని అన్నారు.

# వివాదాస్పదంగా గోర్ నియామకం

## భారత్-అమెరికా మధ్య ట్రంప్ పెట్టిన మరో చిచ్చు



**వాషింగ్టన్, ఆగస్టు 25:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్-అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్‌లో అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవే క్షకుడిగా నియమించడం దౌత్య వర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరే కించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 యేళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీత మైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

**భారత్ ప్రాధాన్యం తగ్గించినట్లా?**

గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అని అన్నారు. పాకిస్థాన్‌సహా పొరుగు దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈచర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూఢిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్-అమెరికా సంబంధాల్లో ఇండో-పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. ఇకపోతే.. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియమాకం భారత్-అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకు తీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను కూడా కలవడం ఇబ్బందికరమే అనితెలిపారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోడీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతరసందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

**నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..**

2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత్-పాక్-అఫ్ఘానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్-అఫ్ఘానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.

**ట్రంప్-మస్క్ వివాదాన్ని ఎగదోసి..**

శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పర పతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ సానా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనెట్‌కు పంపే సమయంలో మస్క్-ట్రంప్ విభేదాలు తీవ్రస్థాయిలోఉన్నాయి. అదేసమయంలో ఇస్సాక్ మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా ఉన్న మస్క్ చివరిరోజున.. నాసా చీఫ్‌పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక సెనేట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీకాదు. బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీకి సెనెట్ ఆమోదముద్ర వేయడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఆన చివరి రెండేళ్ల మాత్రమే భారత్‌లో పనిచేశారు.

# గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ మళ్లీ భీకర దాడులు..

## ముగ్గురు జర్నలిస్టులు సహా 15 మంది మృతి



**టెల్‌అవీవ్, ఆగస్టు 25:** హమాస్ అంతమే లక్ష్యంగా గత 22 నెలలుగా గాజా నగరంపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. తాజాగా గాజా నగరంలోని పలు ప్రాంతాలపై ఐడిఎఫ్ దాడులకు తెగబడింది. నాజర్ ఆస్పత్రిపై సోమవారం జరిపిన దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల్లో ఒక రాయిటర్స్‌కు చెందిన హాతేమ్ ఖలీద్, ఓ ఫొటోగ్రాఫర్ అని స్థానిక వార్తాసంస్థ తెలిపింది. 2023 అక్టోబరు 7న మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటివరకూ గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 62 వేలు దాటింది. లక్షలాది మంది గాయపడ్డారు. ఇక ఈ యుద్ధంలో సుమారు 200 మందికిపైగా మీడియా వర్కర్స్ మరణించారు.

**గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం.. 64 మంది మృతి**

గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తోంది. వైమానిక దాడులతోపాటు.. ట్యాంకులతోనూ విరుచుకుపడుతోంది. గత 24 గంటల వ్యవధిలో 64 మంది మృతి చెందారని, 300 మందికి గాయాలయ్యాయని హమాస్‌కు చెందిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. గాజాసిటీ లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ 60 వేల మందితో రిజర్వు దళాలను రంగంలోకి దింపింది. మొత్తం గాజాస్ట్రిప్‌ను ఆక్రమించే ఉద్దేశం ఉందని బందీల విడుదలపై హమాస్‌తో పరోక్ష చర్చలు విఫలమైన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న సంగతి తెలిసిందే. యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయెల్ ఆదివారం దాడులు చేసింది. ఓ విద్యుత్‌కేంద్రం, గ్యాస్ స్టేషన్‌పాటు రాజధాని వ్యాప్తంగా వివిధ ప్రాంతాలపై బాంబుల కురిపించింది.

# సంక్షిప్తంగా..

## ఇడి దాడులతో గోడదూకబోయిన ఎమ్మెల్యే



**కోల్‌కతా, ఆగస్టు 25:** పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలువురు నేతల ఇళ్లపై దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఇడి అధికారులు ముర్షిదాబాద్ జిల్లాలోని తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహా నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు ప్రదేశాలపై దాడులు నిర్వహించారు. అయితే సోదాల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే తమ ఇంటి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకి గోడ దూకి పారిపోయేందుకు యత్నించారు. ఇంటి బయట కాపలా అధికారులు కృష్ణ సాహాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పారిపోయే క్రమంలో ఎమ్మెల్యే తన వద్ద ఉన్న సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు తన మొబైల్ ఫోన్‌ను ఇంటికి సమీపంలోని చెరువులోకి విసిరేసినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపామన్నారు. ఇంటి నుంచి పారిపోవడానికి ఎందుకు ప్రయత్నించారనే విషయంపై కృష్ణ సాహాను విచారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 2023 ఏప్రిల్‌లో సిబిఐ అధికారులు కృష్ణ సాహాను అరెస్టు చేశారని, 2025 మేలో ఆయనకు బెయిల్ మంజూరయిందని తెలిపారు. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కార్ రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షను 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు.

## నటి ఆరోపణలు.. ఎమ్మెల్యేను సస్పెండ్ చేసిన కాంగ్రెస్



**తిరువనంతపురం, ఆగస్టు 25:** కేరళ కాంగ్రెస్‌లో ఓ నటి చేసిన ఆరోపణలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ అతనిపై చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే రాహుల్ మామకుటత్తిల్‌ను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఓ ప్రముఖ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా వ్యవహరిస్తు న్నాడని, మూడేళ్లుగా వేధిస్తున్నారంటూ రీని జార్జ్ అనే నటి ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆ పార్టీ సీనియర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. రాహుల్ పేరును ఆమెనేరుగా ప్రస్తావించనప్పటికీ బిజెపి, సిపిఎం శ్రేణులు ఆయన ప్రమేయం ఉందని ఆరోపించాయి. రాజీనామా చేయాలని నిరసనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా ప్రకటించారు. నాపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడాను. వారెవరూ నన్ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయలేదు. ఆ నటి నా స్నేహితురాలు. ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి నేనేకాదని నమ్ముతున్నాను. నేను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదుఅని రాజీనామా అనంతరం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయినా విమర్శలు ఆగకపోవడంతో ఇప్పుడు పార్టీ చర్యలు తీసుకుంది.

## యుపిలో ట్రాక్టర్, కంటైనర్ ఢీ: 8 మంది మృతి

**లక్నో, ఆగస్టు 25:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా ఘటల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి 2.15 గంటల సమయంలో 34వ జాతీయ రహదారిపై బులంద్‌షహర్, అలీగఢ్ సరిహద్దుల్లోని ఘటల్ వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కంటైనర్ అదుపుతప్పి గోగాజీ భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో 8 మంది మృతి చెందారు. మరో 43 మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. బాధితులు యూపీలోని కాస్గంజ్ నుంచి రాజస్థాన్‌లోని గోగామేడికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 43మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను ఘటనా స్థలం నుంచి తొలగించామన్నారు. ట్రక్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# మాస్టర్‌ప్లాన్ అమలుకు మరో శివరాత్రి రావాలేమో!

## మంత్రి, కలెక్టర్ ప్రకటనలు ఉత్తుత్తివేనా?

## ఎమ్మెల్యే హామీల మాటేమిటి?




సన్నిధి వీధిలో మాస్టర్ ప్లాన్‌కు అడ్డంగా ఉన్న భవనం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 25 ప్రభాతవార్త** :శ్రీకాళహస్తీశ్వరాలయం మాస్టర్ ప్లాన్ అమలుకు మరో శివరాత్రి రావాలా? మహాశివరాత్రి ఏర్పాట్లు సమీక్ష సందర్భంగా సాక్షాత్తు దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మహాశివరాత్రి లోపల మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని అడ్డం ఉన్న ఒకే ఒకణ్ణి ఒప్పించి, నష్టపరిహారం చెల్లించి అమలుకు మార్గం సుగమం చేయాలని ఆదేశించారు. నిధులు ఇవ్వటానికి కూడా మంత్రి సిద్ధం అంటూ ప్రకటించారు.శివరాత్రి జరిగి ఆరునెలలు అయినా అతీ గతీ లేదు. దాంతో జనం ఇక కొత్త ఆలయ పరిసరాలను చూడవచ్చునని కలలు కన్నారు.కానీ నెలలు గడుస్తున్నా ఆ ఒక్కణ్ణి తొలగించటానికి ఎందుకో మీన మేషాలు లెక్కించుకుంటున్నారు. దేవాదాయశాఖ అధికారులు ఏమో మేము ప్రతి పాదనలు పంపామంటూచేతులు దులుపుకుంటుండగా ఫైలు కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ఎందుకు ముందడగు వేయటం లేదో ఎవరికి అంతుపట్టడం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయం మాస్టర్ ప్లాన్‌ను గతంలో దివంగత నేత గోపాలకృష్ణారెడ్డి అప్పటి ముఖ్యమంత్రి(ప్రస్తుత) నారాచంద్రబాబునాయుడు సూచనలతో మాస్టర్ ప్లాన్‌ను ఆమలు చేసారు. సుమారు రూ.వంద కోట్లు భక్తులు సమర్పించిన విరాళాలతో భూసేకరణ చేసారు. ఆలయం చుట్టు నిర్మించిన నిర్మాణాలే కాకుండా మరో 3.5 ఎకరాల భూములను సేకరించారు. వంద కోట్లు వెచ్చించి సేకరించిన స్థలాలను నేడు పార్కింగ్‌గా వినియోగించుకుంటున్నారు. మాస్టర్ ప్లాన్ కోసం వంద ఇళ్ళు లాడ్జిలు,వ్యాపార సంస్థలను సేవకరించారు. నష్టపరిహారాలు చెల్లించారు.అయితే సన్నిధివీధిలో అందరి కంటే ముందుగా తమ ఆస్తిని అప్పగిస్తామని ఓ లాడ్జి యజమాని దేవస్థానంకు ప్రతిపాదించారు. అయితే ఆయన తప్ప మిగిలినఅ ందరి ఆస్తులను సేకరించారు. ఆయన వృత్తి రీత్యా న్యాయవాది కావటంతో పరిహారం విషయంలో పేచీ పడింది. ఇలా ఐదేళ్ళు గడిచిన తరువాత కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి స్థానిక శాసనసభ్యుడు ఆయన వెంట పడ్డారు.పలుమార్లు సమావేశం జరిపారు. చివరకు ఫిబ్రవరి 25లో దేవాదాయశాఖ,రెవెన్యూశాఖ మంత్రి కలెక్టర్‌లు పది రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.కానీ జరగలేదు. శివరాత్రి తరువాత జిల్లా కలెక్టర్ స్థాయిలో కమిటి సమావేశం జరిపారు. బాధితునికి ఒప్పించారు. ఆతను రాతమూలకంగా ఇచ్చి మూడు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు పరిష్కారం లేదు. మాస్టర్ ప్లాన్‌కుఅ అడ్డంకిగా ఉన్న ఒకే ఒకవ్యక్తితో కలెక్టర్ కార్యాలయం చర్చలు జరిపింది. చివరకు బాధితుడు ఎంత కాలం పోరాటం చేస్తామన్నారు.

# కోవూరులో వేడుకగా స్త్రీశక్తి విజయోత్సవ సభ

### - భారీగా తరలివచ్చిన మహిళా గణం- ఆస్తిలో సమాన హక్కు కల్పించిన చరిత్ర మనది- తాత ఎన్టీఆర్ భావజాలాలను ముందుకు తీసుకెళ్తున్న లోకేష్: ఎమ్మెల్యే



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 25, ప్రభాతవార్త :** సూపర్ సిక్స్. సూపర్ హిట్ అన్న నినాదాలు హోరెత్తాయి. తరలివచ్చిన మహిళాగణంతో కోవూరు వీధులు కిక్కిరిశాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై ఆనందహేళి వెల్లివిరిసింది. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దాదాపు 5వేల మంది మహిళామణుల సమక్షంలో సోమవారం జరిగిన స్త్రీ శక్తి విజయోత్సవ సభ ఆద్యంతం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు హాజరుకాగా మహిళలు వారికి అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. అనంతరం వేదిక వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు పాలనలో జరిగిన లబ్ధిని వివరిస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పలువురు మహిళలతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మహిళా సాధికారత ఎలక్షంగా మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళా శక్తికి నిదర్శనమే ప్రశాంతిరెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడమని ఉద్ఘాటించారు. చంద్రబాబు అవకాశం ఇవ్వడం వల్లే ప్రశాంతి రెడ్డి ఎమ్మెల్యేగా తాను ఎంపీగా ఇక్కడ ఉన్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నిత్యం కోవూరు ప్రజల అభివృద్ధి గురించి ఆలోచిస్తుంటారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే మహిళలకు సంబంధించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని, దీని ద్వారా రూ. 3.7 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఏడాదికి 3 ఉచిత సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తున్నారని, మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను కూడా తీసుకువచ్చారన్నారు. డ్వాక్రా మహిళలకు(ఎ.ఎల్.ఎమ్) వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని గుర్తు చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం కార్యక్రమం కింద అకౌంట్లో 15000 జమ చేశారని, ప్రతి నెల ఒకటవ తేదీన ఇంటింటికి పెన్షన్ అందజేస్తూ ఆదుకుం టు న్నారన్నారు. ఎంఎస్‌ఎం ఈ కింద పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తా_జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా ఎంపీగా తనవంతు మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా మహిళలు మంచి ఆలోచనలతో ముందుకు వస్తే ఎంఎస్‌ఎంఈ కింద పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా తగిన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.

# నక్సలిజాన్ని సమర్థించినట్టు 'సుప్రీం' తీర్పులో ఎక్కడా పేర్కొనలేదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** సల్వాజుడుం రద్దు కేసులో సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించి మాట్లాడటం సరికాదని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సుప్రీం తీర్పును తప్పుగా అర్థం చేసుకుంటున్నారని సుప్రీంకోర్టు, హైకోర్టు లకు చెందిన ప్రముఖ విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ బెనర్జీ, జస్టిస్ అంజనా ప్రకాష్, జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ కైలాష్ గంభీర్, జస్టిస్ మదన్, జస్టిస్ జేసీ, జస్టిస్ కురియన్, జస్టిస్ విక్రమ్, జస్టిస్ ఏకే పట్నాయక్, జస్టిస్ గోపాల్ గౌడ, జస్టిస్ మురళీ ధర్, జస్టిస్ గోవింద్ మథుర్, జస్టిస్ చంద్రు, జస్టిస్ గోపాల్ రెడ్డి, జస్టిస్ కన్నన్, జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ మోహన్ గోపాల్, జస్టిస్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రఘురామ్ ఓ ప్రకటనలో అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. సల్వాజుడుం తీర్పు కేసులో నక్సలిజాన్ని గానీ, దాని భావజాలాన్ని గానీ ఎక్కడా సమర్థించినట్లు పేర్కొనలేదని స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తరపున ప్రచారం కోసం అమిత్ షా అటువంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదని తప్పుబట్టారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు గౌరవ ప్రదంగా, భావజాల కేంద్రీకృతంగా జరగాల్సిన ఎన్నికలని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగవని, అయినప్పటికీ అత్యున్నత పదవిలో ఉన్న హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇది సుప్రీంకోర్టు న్యాయమూర్తులపైనా ప్రభావం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉపరాష్ట్రపతి ఎన్నికను గౌరవప్రదంగా భావించాలని, వ్యక్తిగత దూషణలు, పేరుపెట్టి అవమానించడం వంటి సరికాదని పేర్కొన్నారు.

## సిఎం రేవంత్‌ను కలిసిన బాలాపూర్, ఖైరతాబాద్ గణేశ ఉత్సవ సమితి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేశ ఉత్సవ సమితి కలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బాలాపూర్ గణేశ నవరాత్రి వేడుకలకు గణేశ ఉత్సవ సమితి ఆహ్వా నించింది. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత నర సింహారెడ్డి, బాలాపూర్ గణేశ ఉత్సవ సమితి చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఖైరతాబాద్ గణేశ అడ్‌హాక్ కమిటీ కలిసింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో అడ్‌హాక్ కమిటీ శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి-2025 నవరాత్రి ఉత్సవాలకు సిఎంను ఆహ్వానించింది.



అంతర్జాతీయ బయోడిజైన్ నిపుణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశ దృశ్యం

# వైద్యరంగంలో వినూత్న ఆవిష్కరణలు

### భారత్ బయోడిజైన్ రిసెర్చి ఇన్నోవేషన్ కార్యక్రమం రతన్‌టాటా ఇన్నోవేషన్‌తో కలిసి పనిచేయనున్న బయోడిజైన్ రిసెర్చి : సిఎంచంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి: వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో అంతర్భాగంగా ఈ రీసెర్చి ఇన్నోవేషన్ కార్యకలాపాలు ఉంటాయని ఆయన అన్నారు. ఏఐ, మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియాపసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్త భాగస్వామ్యంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా భారత్ బయో డిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో, నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా పని చేయనుంది. అంతర్జాతీయ, స్థానిక నైపుణ్యాలను సమన్వయం చేయటం ద్వారా ప్రజారోగ్య రంగంలో బ్రెయిన్ కార్యక్రమం గణనీయమైన మార్పులను తీసుకువచ్చే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్ కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో సీఎం సమావేశం అయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా మెడికల్ టెక్నాలజీ రంగంలో కొత్త స్టార్టప్ లతో పాటు పరిశోధనలు, నిపుణులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తద్వారా ఏపీ నాలెడ్జి ఎకానమీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్ తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ,మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ కలపాల, స్టాన్‌ఫర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్ ప్రొఫెసర్ అనురాగ్ మైరల్, ఆసియా పసిఫిక్ బయోడిజైన్ సహాధ్యక్షుడు డాక్టర్ యోనా వైస్‌బచ్, బయోడిజైన్ ఆస్ట్రేలియా ఛైర్ ప్రొఫెసర్ కెవిన్ ప్లెగర్, టోక్యో బయోడిజైన్ ప్రతినిధి యూరియోన్ కొబయాషి, తైవాన్ బయోడిజైన్ నుంచి జేమ్స్ చియెన్‌హియా ట్సెంగ్, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ మార్క్ చాంగ్, మిరాయ్ మెడికల్ సహ వ్యవస్థాపకుడు కొలిన్ ఫోర్డే తదితరులు ముఖ్యమంత్రికి తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ను వైద్యారోగ్య రంగంలో ఆవిష్కరణలకు, మెడ్‌టెక్ పరిశోధనలకు కేంద్రంగా అభి వృద్ధి చేయాలనే రోడ్‌మ్యాప్ పై ముఖ్యమంత్రి చర్చించారు. వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, సాంకేతిక బదిలీ స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాల్లో సహకారం అందించే అంశంపై గ్లోబల్ నిపుణులు ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ప్రత్యేకించి యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఎయిమ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందంతో భారత్ బయోడిజైన్ బయోడిజైన్ ఆస్ట్రేలియాలు ఉమ్మడిగా పనిచేయనున్నాయి. వైద్యారోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను నిర్వహించేలా ఈ ఒప్పందం సహకరించనుంది. ఆంధ్రప్రదేశ్ ను గ్లోబల్ హెల్త్ టెక్నాలజీ, డిజిల్ హెల్త్ ఇన్నోవేషన్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమం ప్రధానంగా పనిచేయనుంది. ముందస్తు విశ్లేషణల ద్వారా వ్యాధుల సంక్రమణను నియంత్రించటం, ముందస్తుగా ఆరోగ్య భద్రతా కార్యక్రమాలు, తక్కువ వ్యయంతో ఆరోగ్య సేవల్ని ప్రజలకు అందించే అంశాలపై దృష్టి సారించనుంది. ఆదే సమయంలో అంతర్జాతీయ బయో డిజైన్ ఎకో సిస్టంలను భారత్‌లో ఉన్న భాగస్వాములను అనుసంధా నించటం పైనా ఈ ఒప్పందం సహకరించనుంది. ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న ఉత్తమ విధానాల్ని ఏపీలో అమలు చేయ టం, బయో డిజైన్‌లో శిక్షణ, పరిశోధనా రంగాల్లో అంతర్జాతీయ సహకారం, ప్రజారోగ్య రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



### కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహార్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ 9 జిల్లాల్లో ప్రారంభమైంది. ఉచితంగా 1.45 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం మొదలైంది.చౌకబియ్యం పక్కదారి పట్టకుండా నివారించడమే లక్ష్యంగారాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డులను నేటి నుంచి పంపిణీ చేస్తోంది. లబ్దిదారులకు సాంకేతిక హంగులతో స్మార్ట్ కార్డులు అందిస్తున్నారు. క్యూఆర్ కోడ్‌వంటి ప్రత్యేకతలు రూపొందించారు. దీనివల్ల రాష్ట్రంలో ఎక్కడి వారైనా, ఎక్కడి నుంచైనా రేషన తీసుకునే సదుపాయం కల్పించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పంపిణీ ప్రక్రియ వచ్చే నెల 15 తేదీ వరకు 4 విడతల్లో జరగనుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్ , తిరుపతి, నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయవాడలో వరలక్ష్మీ నగర్ లోను,కృష్ణాజిల్లా పెనమలూరులోను స్మార్ట్ రైస్ కార్డులను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఏ కార్డులను ప్రారంభించారు. అనంతరం సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్నారు. 15 రోజుల్లో 1.45 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ కార్డులను లబ్దిదారులకు ఉచితంగా ఇంటింటికీ వెళ్లి అందించనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. ఇక రాష్ట్రంలో నేటి నుంచి మొదటి విడత ప్రక్రియ కొన్ని జిల్లాల్లో ప్రారంభించారు. అదే విధంగా రెండో విడతను ఈనెల 30వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. స్మార్ట్ రైస్ కార్డులను ఏటీఎం కార్డు తరహాలో జేబులో ఇమిడి పోయే విధంగా తయారు చేశారు. ఈ స్మార్ట్ కార్డులపై ఒకవైపు రాజముద్రతో పాటు లబ్ధిదారు ఫొటో ఉండే విధంగా రూపొందించారు. మరోవైపు క్యూఆర్ కోడ్ ఉండేలా ముద్రించారు. కార్డుపై ఎటువంటి రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొత్తగా రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా త్వరలోనే కార్డులు రానున్నాయని అధికారులు పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 6.70 లక్షల కార్డుదారులతో పాటు అడ్రస్ మార్పు చేసుకున్న వారికీ స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ సహా పలు సాంకేతిక అంశాలతో స్మార్ట్ కార్డులు తయారు చేశారు. రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ పోస్ యంత్రాలనూ ప్రభుత్వం ఆధునికీకరించింది. స్మార్ట్ రైస్ కార్డుతో స్కాన్ చేసి బయోమెట్రిక్, ఐరీష్ గుర్తింపుతో సరకులు పంపిణీ చేసే ఏర్పాట్లు చేశారు. సరకుల పంపిణీ సమాచారం ఎప్పటికప్పుడు కేంద్ర సర్వర్ కు చేరవేసేలా రూపొందించారు. రేషన్, సరకుల పంపిణీలో అక్రమాలు వివరించడమే లక్ష్యం.

# స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత

### సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు (నెల్లూరు), ఆగస్టు 25, ప్రభాతవార్త :** ముత్తుకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. సరుకులు పొందిన, పొందని వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేటెడ్‌గా కనిపించేలా క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను సరిదిద్దేందుకు ఈ స్మార్ట్ కార్డులు దోహదం చేస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు సౌకర్యవంతంగా అనేక మార్పులు తీసుకొస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులు అంటూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వాహనాలను తెచ్చారు. ఆ వాహనాలు వచ్చిన సమయంలోనే రేషన్ సరుకులు తీసుకోవాలని, అవి కూడా ఇంటి వద్దకు రావు వీధిలో ఎక్కడో ఒక చోట నిలుపుతారన్నారు. వాహనాలు వచ్చిన గంటలో రేషన్ సరుకులు తీసుకోకపోతే ఇక ఆ నెలలో కట్, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రేషన్ వ్యవస్థలో పాత విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఏ రోజైనా రేషన్ షాపుకి వెళ్లి సరుకులు పొందవచ్చు65 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులకు నేరుగా ఇళ్ల వద్దకే సరుకులే ఇచ్చే ఏర్పాటు చేసింది. ఒకటో తేదీకి ఐదు రోజుల ముందే వారికి సరుకులు అందజేస్తున్నారు. మొదట రేషన్ కార్డు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది తెలుగుదేశం పార్టీ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ప్రయోజనాల కన్నా పాలకుల ఫొటోలకే ప్రాధాన్యమిచ్చారు. ఇప్పుడు మా ప్రభుత్వం కేవలం లబ్ధిదారుల ఫొటోలతోనే స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఈదురు రామ్ ప్రదీప్ కలిసేటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యూరియా కొరత లేదు

### కాంగ్రెస్ చేస్తున్నది తప్పుడు ప్రచారం
### బిసి రిజర్వేషన్లు బిసిలకు ఇవ్వాలి
### నిజామాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిలకు చెందాల్సిన రిజర్వేషన్లు బిసిలకే దక్కాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సోమ వారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఇందూర్‌లో బూత్ స్థాయి సభ్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు యూరియా కొరత అంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, బిజెపి ఎక్కడా కూడా యూరియా పంపిణీని ఆపలేదు. తెలంగాణకు అవసరమైనంత మేరకు యూరియా సరఫరా చేసిందన్నారు. తెలంగాణలో నడుస్తోంది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ యూరియా కొరత మాత్రమే అన్నారు. తాను పలు జిల్లాల్లో పర్యటించి కలెక్టర్లతో మాట్లాడానని, ఎక్కడా కూడా యూరియా కొరత లేదని వారు చెప్పారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటగా రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని, రైతుల ఆత్మ హత్యలు ఎక్కువగా జరిగినది కూడా బిఆర్ఎస్ పాలనలోనే. అందుకే రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు. ఈ సందర్భంగా ఎంపి ధర్మ పురి అర్వింద్ జన్మదినం సందర్భంగా హృదయపూర్వక శుభా కాంక్ష లు తెలిపిన ఆయన రూ.25 లక్షల వరకు ధర్మపురి అర్వింద్ ట్రస్ట్ ద్వారా కార్యకర్తల సంక్షేమం కోసం వితరణ చేశారు. కార్యకర్తల పట్ల అర్వింద్‌కి ఉన్న ప్రేమ గొప్పది అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు రావడం ప్రధాని నరేంద్ర మోడీ గొప్పతనం, అర్వింద్ అలుపెరుగని ప్రయత్నం అన్నారు. ప్రధాని మోడీ తెలంగాణలో 32 లక్షల మంది రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద మూడు విడతల్లో రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. తెలం గాణలో రైతుబంధు బంద్ అయిందని, తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో అనేక వాగ్దానాలు చేసి మాట తప్పిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వలేదని, రైతు భరోసా సరిగ్గా ఇవ్వలేద న్నారు. 19 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున పేదలకు ఇళ్లు కడతామని చెప్పారు, కానీ అమలు చేయలేదన్నారు. అన్నీ అబద్ధాలతోనే కాంగ్రెస్ కాలయాపన చేస్తుంద న్నారు. ఓటు చోరీతోనే గెలుస్తోందని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ఆరోపించారు.

## మిక్ కళాశాల అధ్యాపకుడు జి వి పి చంద్ర శేఖర్ యాదవ్‌కి డాక్టరేట్

**విజయవాడ,ఆగస్టు25,ప్రభాతవార్తప్రతినిధి:** మిక్ కాలేజీ అఫ్ టెక్నాలజీ, కంచికచర్ల లో పని చేయుచున్న జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ కి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం లో కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. వంశీ కిరణ్ గారు తెలిపారు. "క్వాడ్రాటిక్ ఫ్రీక్వెన్సీ మోడులాటెడ్ థర్మల్ వేవ్ ఇమేజింగ్ ఫర్ కేరెక్టరైజషన్ అఫ్ సాలిడ్స్" అను అంశం పై జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా డా. జి వీ పి చంద్ర శేఖర్ యాదవ్ ను కళాశాల సి. ఈ. ఓ. డి. పాండురంగ రావు, మేనేజ్మెంట్ మెంబెర్ ఎమ్. సుహాస్ గారు, ప్రిన్సిపాల్ డాక్టర్. టి. వంశీ కిరణ్. ఇతర అధ్యాపకులు అభినందిచారు.

## పూజల పేరిట పురోహితుడికి టోపీ

### రూ.6 లక్షలు స్వాహా చేసిన సైబర్ నేరగాళ్లు

**హైదరబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ఆగడాలు శృతి మించు తున్నాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని, రోజుకో కొత్తరకం పద్ధతుల్లో అమాయకపు ప్రజలను బురిడి కొట్టిస్తున్నారు. తాజాగా పూజల పేరుతో నగరానికి చెందిన ఓ పురోహితుడికి కుచ్చు టోపీపెట్టి అతడి ఖాతా లో ఉన్న రూ. 6 లక్షలు స్వాహా చేశారు. సైబర్ నేరాల కట్టడికి పోలీసులు విశ్వప్రయత్నం చేస్తున్నా నిత్యం ఎక్కడో ఒకచోట మోసాలు జరుగుతుం డటం కలకలం రేపు తోంది. వివరాల్లోకి వెళ్తే.. పాతబస్తీ పురానాపూల్‌కి చెందిన పురోహితుడు(52)కి సైబర్ నేరగాళ్ల ఫోన్ చేశారు. తాను సికిందరాబాద్ మిలిటరీ కార్యాలయం నుంచి క్యాప్టెన్ అమన్‌కుమార్ మాట్లాడు తున్నానని పరిచయం చేసుకొని, కల్నల్ సార్ ఆరోగ్యం బాగోలేదని ఇందుకోసం 11 రోజుల పూజ జరిపించడానికి 21 మంది పురోహితులు కావాలని తెలిపాడు. నిజమేనని నమ్మిన పురోహితుడు 11 రోజుల పూజకయ్యే ఖర్చుతో పాటు పురోహితుల సంభావన తదితర వివరాలను తెలపగా, అడ్వాన్స్ కింద రూ. 3 లక్షలు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు నమ్మకం కలిగించేందుకు ముందు గా ఆయన యుపిఐకి రూ. 10 వేలు పంపించారు. అనంతరం వేరే నంబర్ నుంచి విడియో కాల్‌చేసి మిగతా డబ్బు పంపుతా మని పురోహితుడిని నమ్మించి ఆయన బ్యాంకుఖాతా, ఎటిఎమ్ కార్డు, పిన్ నంబర్ వివరాలు తీసుకు న్నారు. ఇంకేముంది విడతల వారీగా పురోహితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 5.99 లక్షలు కాజేశారు. దీంతో మోసపో యానని గ్రహించిన బాధి తుడు సోమవారం సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ డయల్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీ సులు దర్యాప్తు చేపట్టారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఎటిఎమ్ కార్డు, పిన్‌నంబర్, ఒటిపి తదితర వివరాలు చెప్పవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ సభ్యురాలుగా శ్రుతి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ (ఐడబ్ల్యు ఎఫ్) ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎం. శ్రుతి ఎంపిక య్యారు. అహ్మదాబాద్ వేదికగా సోమవారం జరిగిన జాతీయ సమ్మేళనంలో వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్‌కు ఎన్నికలు జరిగాయి. ఇందులో శ్రుతి జాతీయ కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నికైనట్లు ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సహదేవ్ యాదవ్ ప్రకటించారు.

వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్‌కు విశేషంగా సేవలు అందించిన శ్రుతి ప్రస్తుతం ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్, రాష్ట్ర శాఖకు అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మంగళవారం 26 - ఆగష్టు - 2025




# అక్రమ రవాణా, నిల్వలపై కఠిన చర్యలు తప్పవు : కలెక్టర్ పి. ప్రశాంతి



**సీతానగరం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అక్రమ రవాణా లేదా నిల్వలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. తప్పుడు పద్ధతులు అవలంబిస్తే ఎవరినీ క్షమించేది లేదని ఆమె హెచ్చరించారు. సోమవారం సీతానగరం మండలంలోని వెదుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, సరఫరా, వినియోగం వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే కోరుకొండ గ్రామంలోని గ్రోమోర్ స్టోర్స్, గోదాము, శ్రీ పద్మజ ఫెర్టిలైజర్ జనరల్ స్టోర్స్‌ను కూడా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ ఎరువులు, యూరియా పంపిణీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే జరగాలన్నారు. ఒక్కో రైతుకు కేటాయించిన పరిమితిని మించకూడదని సూచించారు. రవాణా, నిల్వ వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. పిఏసిఎస్ సొసైటీలు, లైసెన్స్ కలిగిన డీలర్లు మాత్రమే ఎరువులను విక్రయించాలని తెలిపారు. ఎరువుల సరఫరా, వినియోగంపై రికార్డులను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, ఎవరూ నిబంధనలను ఉల్లంఘించకూడదని ఆమె హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి ఎం. వెంకట రమణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవ రావు తదితరులు ఉన్నారు.

# ప్రైమరీ స్కూల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



**అంబాజీపేట , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని గంగలకుర్రు గ్రామపంచాయతీ పరిధిలోని గుంట మామిడితోట మోడల్ ప్రైమరీ స్కూల్లో జరిగిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని,నిధులు అన్యాక్రాంతమైనట్లు మండల కాంగ్రెస్ నాయకులు నెల్లి వెంకటరమణ, ఆదుర్తి నారాయణమూర్తి లు ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి,అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తాసిల్దార్ బి. చినబాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రైమరీ స్కూల్లో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.12 లక్షలతో పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, తాగునీటి పైప్లైన్, తరగతి గదుల్లో టైల్స్ వేయాల్సి ఉందన్నారు. ప్రహరీ గోడను కొంత నిర్మాణం చేసి మధ్యలో ఆపేశారని, మరుగుదొడ్లు నిర్మించి డోర్లు కూడా పెట్టలేదని, అలాగే తరగతి గదుల్లో టైల్స్, వాటర్ పైప్ లైన్ బిగించలేదని ఫోటో క్లిప్పింగులను తాసిల్దార్ కు చూపించామన్నారు. పనులు నిలిచిపోవడంతో సిమెంట్ బస్తాలు గడ్డకట్టుకు పోయాయని, వాటర్ పైపులు, టైల్స్ పాడైపోయాయన్నారు. తక్షణమే అభివృద్ధి నిర్మాణ పనులు చేపట్టి, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

# మట్టి వినాయకుని పూజించి కాలుష్యాన్ని తగ్గించాలి : డి.ఎస్.పి ప్రసాద్




**కోనసీమ బ్యూరో ( అమలాపురం) , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
రానున్న వినాయక చవితిని పురస్కరించుకొని అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం గాంధీ సెంటర్ వినాయకుడి గుడి వద్ద ఏర్పాటుచేసిన వందలాది మట్టి వినాయకుని ఉచిత పంపిణీ కార్యక్రమంలో అమలాపురం డి.ఎస్.పి టి ఎస్ ఆర్ కే ప్రసాద్ పాల్గొని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకుని పూజించి కాలుష్యాన్ని తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి ఐ పి వీరబాబు, ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు నంబూరి విశ్వ నాథం, అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి నూలు సూర్య ప్రభాకర్ రావు, కోశాధికారి శ్రీకాకోలపు రాంపండు సంఘు కో ఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి వరదా రాంబాబు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షు డు వరదా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# చతుర్వేద పండితుల సమక్షంలో పెడసనగంటికి ఘనసన్మానం



**రావులపాలెం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో శ్రీ పార్వతీ రామలింగేశ్వరస్వామి వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి సేవాకేంద్రము నందు 31 వ వార్షిక వేదసభ ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి సన్నిధిలో సుమారు 155 మంది చతుర్వేదపండితులచే వేద పారాయణ ములు నయన శ్రవణ మనోహరంగా తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుల పర్యవేక్షణాధికారి బ్రహ్మశ్రీ గుళ్ళపల్లి దత్తాత్రేయ శర్మ ఘన పాఠి వారి ఆధ్వర్యంలో నిర్వహించగా, విష్ణుభొట్ల ఆంజనేయచయనులు వేదో పన్యాస ములు నిర్వహించారు. ఈ కార్యక్రమ అనంతరం గ్రామ తితిదే వేద పండితులు పెడసనగంటి సీతారామమూర్తిశర్మ అవధానిని గ్రామస్తులు, కొవ్వూరి జగదీష్ రెడ్డి , శ్రీసత్యసాయి సేవాసంస్థల సేవకు లు మన్యం పర్వత వర్ధనరావు, సత్య సాయి సేవ సంస్థల సభ్యులు, కర్రి సుబ్బారెడ్డి, కేశిరెడ్డి నరసింహా రావు(నాని), దొండపాటి నాగ సత్యనారాయణమూర్తిలు కలసి వివిధ అవార్డులు పొందిన సందర్భముగా సన్మానించి ఫోటోలు, సెల్ ఫోన్ ను అందించారు. ఈ కార్యక్రమంలో వేద గ్రామ ప్రముఖులు, పండితులు , స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మురళీరాజుని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా మహిళా విభాగం ఇంచార్జి కర్రా జయ సరిత



**ప్రత్తిపాడు , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇంచార్జిగా నియమితులైన కర్రా జయ సరిత ధర్మవరం గ్రామంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్సిపి నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజుని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు.రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జయ సరిత కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇంచార్జిగా కర్రా జయ సరిత నియామకం కావడంతో ముదునూరి మురళీకృష్ణంరాజు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఏ సందర్బంగా ఆమె మురళీకృష్ణంరాజుని మహిళా విభాగం పటిష్టతకు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్దినీడి సుజాత ,పశ్చిమ గోదావరి జిల్లా వైసిపిఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు,పశ్చిమ గోదావరి జిల్లా జనరల్ సెక్రెటరీ దేవా రాజేష్,వైస్సార్సీపీ సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు,రామానుజుల చిన్నమధు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ



**మామిడికుదురు , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
మండలం లోని పెదపట్నంలంక గ్రామానికి చెందిన యువకులు సోమవారం 600 మంది భక్తులకు ఉచితంగా మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న వినాయక మంటపాల వద్ద ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.ప్రతీ ఒక్కరూ పర్యావరణ రక్షణ కోసం మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలకు పూజ చేయాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్ర మంలో యేడిద రాజేష్, పైడిపర్తి రవితేజ,పినిశెట్టి లీల,కామిరెడ్డి దుర్గారావు,యేడిద సురేంద్ర,గిడుగు బాలాజీ,గుండుపల్లి నారాయణ మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి : బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్



**కోనసీమ బ్యూరో ( అమలాపురం) , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సోమవారం అమలాపురం పట్టణం గడియార స్తంభం సెంటర్ నుంచి సారథ్యం యాత్ర నిర్వహించారు. గడియార స్తంభం వద్ద నుంచి కాపు కళ్యాణమండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ భారీ గా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కాపు కళ్యాణ మండపం వద్ద జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొని మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త ప్రతీ బూత్ లో పర్యటించాలి. బీజేపీ కి ఒక కార్యకర్త కోసం 60 కిలోమీటర్లు వెళ్లిన చరిత్ర ఇదే ప్రాంతానికి చెందిన వారణాశి నారాయణరావు కు ఉంది. కార్యకర్తల ఆధారంగా పార్టీని అభివృద్ధి చేయాలి. రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. రైల్వే జోన్ ఇచ్చాం. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రతీ గ్రామానికి రోడ్లు వేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి బీజేపీ అభివృద్ధి అన్నారు. జల జీవన్ మిషన్ 50 వేల కోట్లు ఇవ్వబోతున్నాం. అంబేద్కర్ జిల్లా యొక్క రూపు రేఖలు మార్చాలన్నారు. ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ భారత్ నిర్మాణ్ ద్వారా ప్రతీ గ్రామానికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ సేవకు అన్నదానానికి పేరుగాంచిన డొక్కా సీతమ్మ కి నివాళులు అర్పించి పర్యటన ప్రారంభించడం జరిగిందన్నారు. 140 కోట్ల సంక్షేమం కోసం, బాగు కోసం నిరంతరం ప్రధాని మోడీ కృషి చేస్తున్నారు. నరేంద్ర మోడీ అనేక పథకాల ద్వారా మన గ్రామం లోని మన ఇంటికి వచ్చారు. అనేక భీమా పథకాలు పెట్టారు. పేద వారి కోసం ఆలోచించే నేత ప్రధాని మోడీ. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా అనేక సీసీ రోడ్లు, కాలువల అభివృద్ధి, ప్రతీ పంచాయతీ కి నేరుగా నిధులు ఇచ్చారన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి నేరుగా ఎకౌంట్ కి వచ్చే విధంగా చేశారన్నారు. కాకినాడ - కోటిపల్లి రైల్వే లైన్ పూర్తవుతుంది అన్నారు. త్వరలో అమలాపురం రైల్వే స్టేషన్ కల నెరవేరుతుందని అన్నారు. కత్తిపూడి నుండి ఒంగోలు వరకు జాతీయ రహదారి నిర్మితమవుతుందన్నారు. ఈరోడ్ల నిర్మాణం ద్వారా మన ప్రాంతం రూపు రేఖలు మారబోతున్నాయి. కోనసీమ కొబ్బరికి ప్రసిద్ధి. చమురు, ఉప్పుటేరు కారణంగా కొబ్బరి పంటకు నష్టం జరుగుతుంది. కోకోనట్ కి అనేక అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది. కొబ్బరి కి మద్దతు ధర పెరిగే విధంగా కృషి చేస్తున్నాం. కొబ్బరితో అద్భుత మైన ప్రొడక్ట్స్ తయారు చేస్తున్నారు. అనేక రకాల సైక్లోన్ కారణంగా కోనసీమ నష్టపోతుందన్నారు. తల్లి పేరిట ఒక వృక్షం పాతుదాం అన్నారు. తాటి చెట్టు ఎక్కే వారికి కొత్త ఇన్సూరెన్స్ పథకం కేంద్రం తీసుకు వచ్చిందన్నారు. మన జెండా మన వూరు కార్యక్రమం తీసుకు వస్తున్నాం. ఆగస్టు 30 న విజయవాడ జరిగే సంచార జాతులు స్ఫూర్తి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. సమావేశం కి ముందు అక్కడ ఏర్పాటు చేసిన కొబ్బరి పీచు తో తయారు చేసిన కళాకృతులను, బొమ్మలను పరిశీలించి, అద్భుతంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, అమలాపురం పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ పొట్లూరి రామ్మోహనరావు, గుంటూరు జిల్లా ఇంచార్జీ తమనంపూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, అనకాపల్లి జిల్లా ఇంచార్జీ కర్రి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, కొప్పనాతి దత్తాత్రేయ, సలాది వీరబాబు, ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస్ నగేశ్, గనిశెట్టి వెంకటేశ్వరరావు, కొప్పన లక్ష్మి, కొత్తపల్లి శ్రీదేవి, చాట్రాతి జానకి రాంబాబు, అడపా శ్రీనివాస్, చిలకమర్రి కస్తూరి, చొల్లంగి త్రినాథ్, గ్రంధి నానాజీ మోకా సుబ్బారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# మట్టి గణపతినే పూజిద్దాం




**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని ఆత్రేయపురం మండలం రాజవరం ఎంపీపీ ప్రాథమిక పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు బి. రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మట్టి గణపతి ని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టా ప్యారిస్ వద్దు మట్టి గణనాధుని పూజిద్దాం అనే నినాదంతో గ్రామ వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అందరం కూడా ప్లాస్టా ప్యారిస్ వద్దు మట్టి గణనాధుని పూజిద్దామని అలాగే మట్టి గణనాధులను పూజించి వినాయక చవితి పండుగను కుటుంబం సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరస్వామివారి దివ్య ఆశీస్సులు అనుగ్రహం ఎల్లవేళలా గ్రామ దేశ ప్రజలందరికి ఉండాలని స్వామివారిని వేడుకున్నారు పర్యావరణం కాపాడదాం మట్టి వినాయకుని పూజిద్దాం అనే నినాదంతో చవితి పూజలను గణపతి నవరాత్రులను అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించుకుని స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

## ఈవో ప్రమోషన్ పొందిన రాపాక శ్రీనివాస్..అభినందించిన ఉద్యోగులు



**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త )**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న రాపాక శ్రీనివాస్ కి ఈవో ప్రమోషన్ రావడంతో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు , ఆలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

# మహిళా పోలీస్ ఉపాధ్యాయురాలైంది..డీఎస్సీ లో 7వ ర్యాంకు సాధించిన దుర్గాదేవి



**అంబాజీపేట , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తూ డీఎస్సీ ఫలితాల్లో స్టేట్ సెవెంత్ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయురాలు అయింది. పి.గన్నవరం మండలం గుత్తులవారిపాలెంకు చెందిన గుత్తుల దుర్గాదేవి అంబాజీపేట మండలం మాచవరం సచివాలయం-1లో మహిళా పోలీస్ గా విధులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు కేటగిరిలో 82.37 మార్కులతో 7వ ర్యాంకు సాధించింది. భర్త చెల్లుబోయిన నాగభూషణం, అత్త మరిడమ్మ, తల్లితండ్రులు గుత్తుల కనకదుర్గారావు, పద్మావతిల ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించినట్లు దుర్గాదేవి తెలిపారు. టీజీటీ తెలుగు జోన్ 2లో 7వ ర్యాంకు, పీజీటీ తెలుగు జోన్ 2లో 13వ ర్యాంకు వచ్చిందన్నారు. 2018 డీఎస్సీ పరీక్షకు హాజరయ్యానని తక్కువ మార్కులు రావడంతో పట్టుదల పెరిగి బాగా చదివానన్నారు.చిన్నప్పటి నుండి ఉపాధ్యాయరాలిగా విధులు నిర్వహించాలనే బలమైన కోరికే డీఎస్సీలో ర్యాంకు సాధించేందుకు తోడ్పడిందని దుర్గాదేవి తెలిపారు.ఒక పక్క గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్ గా విధులు నిర్వహిస్తూనే పట్టుదలతో తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే తాను ఈ ఘనత సాధించినట్లు దుర్గాదేవి సంతోషం వ్యక్తం చేస్తూ తెలిపింది.

# డీఎస్సి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన"శ్యామ్"విద్యార్థులు




**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
ఇటీవల విడుదలైన డీఎస్సి ఫలితాల్లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇప్పటి వరకు పోలీసు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న శ్యామ్ తొలిసారిగా రాష్ట్ర వ్యాప్తంగా గల డీఎస్సి అభ్యర్థులకు కూడా శిక్షణ ఇవ్వగా తొలి ప్రయత్నం లోనే రాష్ట్ర,జిల్లా ర్యాంకులు సాధించి అద్భుత ప్రతిభ చాటారు.ఆరు మంది అభ్యర్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించారని శ్యామ్ అధినేత గుంటూరి శ్యామ్ వెల్లడించారు. అలాగే స్కూలు అసిస్టెంట్(సోషల్) విభాగంలో పదిమంది ఆయా జిల్లాల్లో ఫస్ట్ ర్యాంకు,ఎస్జీటీ విభాగంలో 9మంది ఆయా జిల్లాల మొదటి ర్యాంకులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు.ఇంతటి అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించారు.విశేష కృషి చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు సుమారు 260మందికి గాను 63మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు సాధించమే కాకుండా ఎస్సి ఎస్టీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించారని తెలిపారు.

# రాష్ట్రధ్యక్షుని సభకు తరలి వెళ్ళిన బీజేపీ శ్రేణులు



**మామిడికుదురు , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా కోనసీమ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న రామ్ మాధవ్ సభకు మామిడికుదురు నుంచి సోమవారం పార్టీ నాయకులు భారీగా తరలి వెళ్ళారు. పార్టీ జెండాలను ప్రదర్శిస్తూ మోటార్ సైకిళ్ళపై ర్యాలీ గా అమలాపురం పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గా రామకృష్ణ, నాయకులు మెండా ఆదినారాయణ,కంకిపాటి సుబ్బారావు,గాడి సత్తిబాబు,నక్కా త్రిలోచనారావు తదితరులు పాల్గొన్నారు.













# స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్ : ఎమ్మెల్యే బత్తుల

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పేదలకు అన్ని అవసరాలకు ఉపయోగపడే విధంగా రైస్‌కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్ ఉండే స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ మండలం గాడాల గ్రామంలో సచివాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ప్రజల కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, దీపం పథకం,తల్లికి వందనం,మరియు స్త్రీ శక్తి , రైతులకోసం అన్నదాత సుఖీభవ లాంటి ఎన్నో పథకాలను అమలుచేస్తున్నామని



ఇప్పుడు స్మార్ట్ రేషన్ కార్డులు కూడా అందిస్తున్నామని తెలిపారు. .ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సరే అభివృధి, సంక్షేమం ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం సహకారముతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది అని పేర్కొన్నారు.. కూటమి ప్రభుత్వం అత్యంత పగడ్బందీగా స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. ఇప్పటి వరకు ఉన్న రైస్ కార్డుల్లో ఆ కుటుంబానికి చెందిన సభ్యులందరితో ఫొటో ఉండేదని, ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫొటో ఉంటుందని తెలియజేసారు. ఇతర సభ్యుల పేర్లు మాత్రమే నమోదు చేస్తారన్నారు. ప్రస్తుతం ఇవ్వనున్న స్మార్ట్ కార్డులు బ్యాంకు డెబిట్ కార్డు (ఏటీఎం)ల తరహాలో ఉంటాయన్నారు. పారదర్శకతతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో వీటిని అనుసంధానం చేయడం వలన రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చన్నారు. స్మార్ట్ ఈ-పోస్ మిషన్లను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేనుందని, ఇప్పుడిస్తున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే కార్డుదారుడి వివరాలు వస్తాయన్నారు. దీని వల్ల గతంలో యంత్రాలతో వచ్చిన సర్వర్ సమస్యలు ఉండవని తెలియజేసారు.

రాజానగరం నియోజకవర్గంలో 85101 కొత్త స్మార్ట్ కార్డులను అందచేయడం జరుగుతుందన్నారు. తాజా పరిణామాలతో రేషన్ పంపిణీ వ్యవస్థ నూతన సాంకేతిక మార్పులతో అత్యంత పకడ్బందీగా మారనుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తి నిర్మాణాన్ని పూర్తిచేసిన దాత - నేమాని సత్యనారాయణ

**కె గంగవరం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

గంగవరం గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాలుర మరుగుదొడ్లను సొసైటీ అధ్యక్షులు నేమాని సత్యనారాయణ తన సొంత నిధులతో పూర్తి చేయించారు.

సుమారు రెండు లక్షలు విలువైన వాటర్ లైన్, తలుపులు ,టైల్స్, రహదారి పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ,విద్యార్థినీ, విద్యార్థులు నేమాని సత్యనారాయణను అభినందించారు.



## అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే సమస్యలు దూరం : ఎమ్మెల్యే గిడ్డి

**- కొర్లపాటివారిపాలెంలో రూ.1.10 కోట్లతో రహదారులకు భూమిపూజ**



**అంబాజీపేట , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పని చేస్తే ఎంతటి సమస్యనైనా పరిష్కరించవచ్చని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో నాబార్డ్ నిధులు రూ.1.10 కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైన్ సిసి రోడ్డు, బిటి రోడ్లకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్మాణాల పనుల్లో సంబంధిత అధికారుల సూచనలు పాటిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.అటువంటి అధికారుల్లో ముందుండే పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) అన్యం రాంబాబు అభినందనీయుడని ఎమ్మెల్యే కితాబునిచ్చారు.కొర్లపాటివారిపాలెం గ్రామ దేవత శ్రీ వనువులమ్మ అమ్మవారి ఆలయం నుండి మెయిన్ రోడ్డు వరకు బిటి రోడ్డు, అమ్మవారి ఆలయం సమీపము నుండి బస్ స్టేషన్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైన్ సిసి రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు అభివృద్ధి పట్ల ఉన్న దృక్పథంతో మన గ్రామాలు,మన నియోజకవర్గం రోజ రోజుకూ కొత్త రూపు సంతరించుకుంటున్నాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, డీఈఈ రాంబాబులను కొర్లపాటి వారిపాలెం వాసులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు గ్రామదేవత శ్రీ వనువులమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, అవిడి నీటి సంఘం వైస్ చైర్మన్ అక్కిశెట్టి ప్రసాద్, గ్రామ సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు కొర్లపాటి రాజగోపాల్ (గోపి),శిరిగినీడి వెంకటేశ్వరరావు,బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, డివివి సత్యనారాయణ, సుంకర బాలాజీ, గూడాల ఫణి, రవణం రాము, సుంకర నాయుడు,అరిగెల బుజ్జి, దొమ్మేటి శ్యామ్, దొమ్మేటి వెంకట రామారావు, పితాని రామకృష్ణ, నాగాబత్తుల సుబ్బారావు, కొప్పినీడి ఈశ్వరరావు,పేరాబత్తుల సుబ్బరాజు, పల్ల రామ్మూర్తి, సూదాబత్తుల రాము,నాగవరపు నాగరాజు, బండారు మల్లి, పత్తి దత్తుడు, మట్టపర్తి సోమేశ్వరరావు, దుర్గా శ్రీనివాస్,పత్తి శివ, పత్తి చంటి,వర్రే చింతన్న, ఇన్చార్జ్ ఎండీవో ఏఎస్ఎల్ నరసింహం,ఉపాధి ఏపీవో అడపా శ్రీ వెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం



**కోనసీమ బ్యూరో ( అమలాపురం ) , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్ నందు జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షురాలు, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంత కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి పరిశీలకులు , ముఖ్య అతిథులుగా రాష్ట్ర మైనింగ్ , ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, బొల్లా సతీష్, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, పార్లమెంట్ సభ్యులుగంటి హరీష్ మాధుర్, కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, గన్నవరం నియోజకవర్గం కన్వీనర్ నామన రాంబాబు, కో కన్వీనర్ మోకా ఆనంద్ సాగర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర ఎస్. సి సెల్ ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి బాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కంకటాల రామం,రాష్ట్ర వాణిజ్య విభాగం కర్రి రామస్వామి, రోళ్ళపాలెం సొసైటీ అధ్యక్షులు మట్ట మహాలక్ష్మి ప్రభాకర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీమతి అధికారి జయ వెంకటలక్ష్మి బాబ్జి, మాడ మాధవి మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, టిడిపి నాయకులు గంధం పల్లంరాజు, మాజీ కౌన్సిలర్ దున్నలా దుర్గా, అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, ఉప్పలగుప్తం మండలం టిడిపి అధ్యక్షులు అరిగేలా నానాజీ, చిల్లా జగదీశ్వరి, మాజీ %ఓజఖ్ష% దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఆకెటి పెద్ద, వేగిరాజు వెంకటరాజు, గంధం శ్రీను, నల్లా చిట్టి, వలవల శివరావు, చింతా శంకరమూర్తి మరియు మాజీ శాసనసభ్యులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంస్థల అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు , రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు, నియోజకవర్గాల పరిశీలకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఏడు వారల 'వెంకన్న'కు నిత్య కళ్యాణం, అష్టోత్తరపూజలలో ఆచరించిన భక్తులు

**- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.4.32 లక్షలు.**

**- వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి, గోశాలకు విరాళాల వెల్లువ**

**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆల యానికి సోమవారం వేలాది మంది భక్తులు తరలి వచ్చారు .ఏడువారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర పూజలు, శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం లో పాల్గొని స్వామివార్ని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మేలు కొలుపు ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ అష్టోత్తర శతనా మావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వ హిం చారు.అనంతరం అన్నప్రసాదాలు స్వీకరించారు. నిడదవోలుకి చెందిన నడుపల్లి పెద్రాజు, నాగ సత్య సూర్య కుమారి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 25,116లు





రాజమండ్రికి చెందిన,కాకినాడ జిల్లా, పిఠాపురం తహసిల్దార్ పిండి వీర వెంకట గోపాలకృష్ణ, గీత, కుమార్తె శశి భాను శ్రీ, కుమారుడు హరిహర శ్రీ చరణ కుటుంబ సభ్యులు రూ. 25,116లు కపిలేశ్వరపురంకి చెందిన కొరపాటి వెంకటేశ్వర రావు ,సూర్య ప్రమీల దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 29,999లు శ్రీస్వామి వారి ఆలయంలో ఉన్నటువంటి గోసం రక్షణార్థం, గోశాలకు విరాళంగా అందజేశారు వీరికి ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్. కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్ స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.శ్రీ స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ. 4, 32, 377లు. వచ్చినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

**ఆదిత్య యూనివర్సిటి లో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ : ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి**

**గండేపల్లి , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్ నందు శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి పెదబ్రహ్మదేవం సభ్యుల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్. డా.ఎమ్.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పూజకు అందరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రో.ఛాన్సలర్. డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి సంబంధమైన వినాయక చవితి పర్యావరణ హితం అయిన మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించి అందరూ పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో, రసాయనాలతో కూడిన వివిధ రంగులు ఉపయోగించి తయారు చేసిన విగ్రహాలు వాడటం వల్ల అది నీటిలో తొందరగా కరగకుండా అనేక అనర్థాలకు హేతువు అవుతున్నాయని నీరు, వాతావరణం కలుషితం అవుతుంది.తద్వారా అనేక రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి అన్నారు. శ్రీ శారదా



రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యం లో సమితి సభ్యులు, మరియు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది సహకారంతో గత 16 సంవత్సరాల నుండి ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేస్తూ కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కలిపించడానికి కృషి చేస్తున్న సభ్యులను డా.ఎన్.సతీష్ రెడ్డి, డా.ఎం. ఎస్.రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రో.వైస్ ఛాన్సలర్స్ డా. ఎస్. రమాశ్రీ,డా.ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, డా.వానతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ . ఎ.వి.బి.ఎస్.శర్మ, టి. రామచంద్రన్, పున్నం నాగేశ్వరావు ,సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, సభ్యులు జి.ప్రకాశరావు, పి.సత్యనారాయణరెడ్డి,తొగరు శ్రీనివాస్, జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కమిటీలు చిత్తశుద్ధితో కృషి చేయాలి

**రాష్ట్ర టిడిపి రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ**

**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

350 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన పురాతన క్షేత్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన ఆత్రేయపురంలో వేంచేసియున్నశివ,కేశవు ల ఆలయాలకు సోమవారం ఆలయ కమిటీల ప్రమాణ స్వీకార మహెూత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత జీవనాన్ని పొందాలంటే ప్రజలు ఆధ్యాత్మికత వైపు వెళ్లాలని అన్నారు. నూతన ఆలయాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, పది కాలాల పాటు పదిలంగా ఉండే విధంగా రాళ్లతో నిర్మించవచ్చని తెలి పారు.ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు( గబ్బర్ సింగ్) మాట్లాడుతూ ఈ పురాతన ఆలయాలు శిథిల స్థితికి చేరినందున పునర్నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రజల సహాయ సహకారాలతో చేపట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా గ్రూపు దేవాలయాల ఈవో నరేంద్ర, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ గా వేగేశ్న వెంకట సత్య ప్రసాదరాజు , శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా పులవర్తి కాశీ విశ్వేశ్వర రావు చేత ప్రమాణ స్వీకా రం చేయించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ సభ్యులుగా ఆలపాటి శేషారెడ్డి, అంగాని నాగలక్ష్మి, అల్లూరి కృష్ణంరాజు, ముదునూరి సత్యవతి, కాకిలేటి రవి ప్రకాష్, భమిడిపల్లి సత్యనారాయణ, పెనుమల్ల వెంకటలక్ష్మి, కాకరపర్తి నాంచారమ్మ లు ప్రమాణ స్వీకారం



చేశారు. అలాగే శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రాజ రాజేశ్వర స్వామి ఆలయ సభ్యులుగా శిష్ట సుబ్రహ్మణ్యం విశ్వాస్, పులిదిండి కనకరత్నం, యలమర్తి నాగ వెంకట పద్మ సత్యవతి, పెనుమళ్ళ వీర వెంకట సత్యనారాయణ, యాతం పద్మావతి, కోలమూరి కేదారేశ్వరి, దేవగుప్తాపు వీర వెంకట సత్యనారాయణ, పేత నాగ వెంకట సత్యనారాయణ, అర్చకులు నుంచి పుల్లేటికుర్తి శివరామ భాస్కర రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చేకూరి కృష్ణంరాజు, ఆత్రేయపురం సహకార సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్ర రాజు, పిఎస్ రాజు, ముదునూరి నాగరాజు, శ్రీకృష్ణ ఆలయ అర్చకులు వాడపల్లి జనార్ధనాచార్యులు, అనంతశర్మ, టీటీడీ వేద పండితుడు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు నూతన భవనం నిర్మించాలి

**అంబాజీపేట , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

మండలంలోని ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు నూతన భవనం నిర్మించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను అభివృద్ధి కమిటీ, వైద్య సిబ్బంది కోరారు. పి.గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పీహెచ్సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పిహెచ్సీ వైద్యురాలు కె.సుమప్రియలు పిహెచ్సీ నూతన భవనంతో పాటు మౌలిక వసతులకు అవసరమైన నిధులకు సంబంధించి ప్రపోజల్స్ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు మల్లిబాబు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవో ప్రమోషన్ పొందిన రాపాక శ్రీనివాస్..అభినందించిన ఉద్యోగులు



**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న రాపాక శ్రీనివాస్‌కి ఈవో ప్రమోషన్ రావడంతో ఆలయ డిప్యూటీ కమిష నర్ నల్లం సూర్య చక్రధరరావు,ఆలయ సిబ్బందిశుభాకాంక్షలు తెలియజేశారు.










Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

### మహిళల ఆర్చరీ వరల్డ్ టోర్నీ..

# ప్రపంచ ఛాంపియన్‌గా శార్వరి



**న్యూఢిల్లీ:** వరల్డ్ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో భారత్‌కు చెందిన శార్వరి షెండే ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. కెనడాలోని విన్నిపెగ్‌లో సోమవారం జరిగిన అండర్ 18 మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంగా శార్వరి బంగారు పతకాన్ని గెలుచుకుంది. దక్షిణ కొరియాకు చెందిన కిమ్ యెవాన్‌తో తీవ్రంగా పోరాడిన శార్వరి ఫైనల్లో 6-5 తేడాతో గట్టి పోటీని ఎదుర్కొని ఛాంపియన్‌షిప్ సాధించింది. 16 ఏళ్ల శార్వరి మొదటి మూడు సెట్లలో రెండింటిని గెలుచుకుని, మరొక సెట్‌ను సమం చేసి ఫైనల్‌లో 41-తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, కిమ్ తరువాతి రెండింటినీ గెలిచి స్కోర్‌లను సమం చేయడానికి మరియు షూట్‌ఆఫ్ చేయడానికి పోరాడింది. దక్షి ణ కొరియా ఆర్చర్ షూట్‌ఆఫ్‌లో తడబడి తొమ్మిది పరుగులు చేసింది. అయితే శార్వరి మ్యాచ్‌ను ముగించాల్సి న ఒత్తిడితో అద్భుత ప్రదర్శన చేసి 10 పరుగులు చేసి ఉత్కంఠభరితమైన ఫైనల్‌ను గెలుచుకుంది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న 2025 ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకున్న రెండవ భారతీయ మహిళగా శార్వరి గుర్తింపు పొందింది. అంతకు ముందు రోజు తనపర్తి చికిత అండర్ 21 విభాగంలో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత స్వర్ణాన్ని గెలుచుకుంది.



### బుచ్చిబాబు క్రికెట్ టోర్నీలో..

# హైదరాబాద్ రెండో విజయం

**జార్ఖండ్ 2 వికెట్లు తేడాతో చిత్తు**

**న్యూఢిల్లీ:** ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హైదరాబాద్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. జార్ఖండ్‌తో జరిగిన మూడు రోజుల మ్యాచ్‌లో భాగంగా సోమవారం హైదరాబాద్ 2 వికెట్లు తేడాతో గెలిచింది. జార్ఖండ్ నిర్దేశించిన 84 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హైదరాబాద్ 22.3 ఓవర్లలో 8 వికెట్లు కోలోనఊపయి 89 పరుగులు చేసింది. స్కోరు 83 వద్ద అనికేత్ సిక్స్ కొట్టి హైదరాబాద్ విజయాన్ని ఖరారు చేశాడు. జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌట్ అయింది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/75), రోహిత్ రాయుడు (4/69) రాణించారు. అనంతరం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 82.4 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటై 47 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. నితీశ్ (106, 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేయగా, రాహుల్ రాధేశ్ (70, 6 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ (65, 3 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలు సాధించారు. 47 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన జార్ఖండ్ 25.3 ఓవర్లలో 130 పరుగులకు కుప్పకూలింది. హైదరాబాద్ బౌలర్లు తనయ్ త్యాగరాజన్ (4/74), అనికేత్ (3/25) ఆకట్టుకున్నారు. 84 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఒక దశలో 61 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. అయితే రోహిత్ రాయుడు (31 బంతుల్లో 18 నాటౌట్, 1 సిక్స్), అనికేత్ (13 బంతుల్లో 12 నాటౌట్, 1 సిక్స్) 9 వికెట్‌కు 28 పరుగులు జోడించి హైదరాబాద్ జట్టును విజయతీరానికి చేర్చారు.

### కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ప్రీతి, ధర్మ జ్యోతి, మీరాకి స్వర్ణాలు







**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ ప్రారంభ రోజున భారత్ ఖాతాలో మూడు బంగారు పతకాలు జమఅయ్యాయి. భారత వెయిట్ లిఫ్టర్లు మంచి ప్రదర్శన కనబరిచి సత్తా చాటారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న 30వ కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ తొలి రోజు సోమవారం భారత్ వెయిట్ లిఫ్టర్లు స్వర్ణ పతకాలను సాధించారు. మహిళల 44-48 కిలోల విభాగంలో ప్రీతిస్మిత భోయ్ స్నాచ్‌లో 63 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 87 కిలోలు ఎత్తి మొత్తం 150 కిలోలతో ముగించింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ మీరాబాయి చాను స్నాచ్‌లో 84 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలు ఎత్తి మొత్తం 193 కిలోలు ఎత్తి అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో మీరాబాయి చానుకి ఇది ఐదవ పతకం. ఆమె గతంలో 2013, 2017, 2019 ఎడిషన్లలో బంగారు పతకాలు, 2015లో రజతం గెలుచుకుంది. అలాగే పురుషుల 56-60 కిలోల విభాగంలో ధర్మజ్యోతి దేవఘరియా స్నాచ్‌లో 97 కిలోలు మరియు క్లీన్ అండ్ జెర్క్‌లో 127 మొత్తం 224 కిలోలతో ముగించి భారత్‌కు రోజులో రెండవ స్వర్ణ పతకాన్ని అందించాడు. ఒలింపిక్ పతక విజేత వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను సోమవారం జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 48 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, తిరిగి పోటీలకు శ్రీకారం చుట్టింది.









### సౌతాఫ్రికా టి20 లీగ్‌కు

# భారత్ ప్లేయర్ల క్యూ

### వేలానికి 13 మంది రెడీ

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా లీగ్ ఆడేందుకు భారత ఆటగాళ్లు ఆసక్తి చూపుతూ క్యూ కడుతున్నారు. సౌతాఫ్రికా టీ20 లీగ్ నాలుగో ఎడిషన్‌కు ముందు నిర్వహించనున్న వేలానికి మొత్తం 13 మంది భారత ఆటగాళ్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్, ముంబై ఇండియన్స్ లెగ్ స్పిన్నర్ పీయూష్ చావ్లా సైతం ఉన్నాడు. అంతేకాకుండా సిద్దార్థ్ కౌల్, అంకిత్ రాజ్‌పుత్‌లు సైతం వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ఢిల్లీకి చెందిన అనురీత్ సింగ్ కతూరియా, పంజాబ్‌కు చెందిన సరుల్ కన్వర్, గుజరాత్‌కు చెందిన మహేశ్ అహిర్, రాజస్థాన్‌కు చెందిన నిఖిల్ జగా, యూపీకి చెందిన ఇమ్రాన్ ఖాన్, అతుల్ యాదవ్, తమిళనాడుకు చెందిన కేఎస్ నవీన్, రాష్ట్రాల పేర్లు పొందుపరచని అన్సారీ మరూఫ్, మొహమ్మద్ ఫైద్, వెంకటేశ్ గాలిపెల్లి లు సౌతాఫ్రికా టీ20 లీగ్ 2025 వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరంతా తమ బేస్ ప్రైజ్‌ను రూ.10లక్షలుగా నిర్ణయించుకున్నారు. చావ్లా తన బేస్ ప్రైస్‌ను రూ.50లక్షలుగా నమోదు చేసుకున్నాడు. సెప్టెంబర్ 9న సౌతాఫ్రికా టీ2025 వేలం జోహన్నెస్‌బర్గ్‌లో జరగనుంది. మొత్తం 784 మంది ఆటగాళ్లు వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పాకిస్థాన్ నుంచి 40 మంది, ఇంగ్లాండ్ నుంచి 150 మంది ఆటగాళ్లు వేలంలో నమోదు చేసుకున్నారు. ఆరు ఫ్రాంచైజీల వద్ద 7.4 మిలియన్ల యూఎస్ డాలర్ల (భారత్ కరెన్సీ ప్రకారం 646 కోట్ల 73 లక్షల రూపాయలు) పర్స్ ఉంది.

వేలంలో ఫ్రాంచైజీలు అన్ని కలిపి 84 మంది ఆటగాళ్లను మాత్రమే తీసుకునే అవకాశం ఉంది. అయితే భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నిబంధనల ప్రకారం దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్ల ఎవ్వరూ కూడా విదేశీ లీగుల్లో ఆడకూడదు. అంతేకాకుండా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పడంతో పాటు, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)తోనూ అనుబంధం పూర్తిగా తెంచుకోవాలి. అంటే ఒక్కసారి ఎవరైనా భారత ప్లేయర్ విదేశీ లీగ్ ఆడితే అతడు భారత జట్టుతో పాటు ఐపీఎల్ ఆడే అర్హతను కోల్పోతాడని బీసీసీఐ స్పష్టంగా పేర్కొంది. దీంతో వీరంతా భారత్ తరపున క్రికెట్ ఆడే అవకాశాన్ని కోల్పోనున్నారు.

### అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్..

# మురళి, రవీనా, రోహిత్ స్వర్ణం







**న్యూఢిల్లీ:** అంతర్‌రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీశంకర్ మురళి, రోహిత్ యాదవ్, రవినా గయాక్వాడ్‌లు స్వర్ణ పతకాలు సాధించారు. జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌ల చివరి రోజున ఒలింపియన్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ 8.06 మీటర్ల దూరం దూకి స్వర్ణం సాధించాడు. ఈ ప్రయత్నంతో, శ్రీశంకర్ ఇప్పుడు రోడ్ టు వరల్డ్ ఛాంపియన్‌షిప్ స్టాండింగ్స్‌లో టాప్ 36లోకి ప్రవేశించాడు, గ్లోబల్ ఈవెంట్‌కు అర్హత స్థానాన్ని సంపాదించడానికి దగ్గరగా ఉన్నాడు. ఇక పురుషుల జావెలిన్ త్రో ఫైనల్స్‌లో అత్యంత ఉత్కంఠభరితమైన పోటీలో రోహిత్ యాదవ్ 83.65 మీటర్ల వ్యక్తిగత ప్రయత్నంతో ఉత్తమ ప్రదర్శన చేయడంతో స్వర్ణం సాధించాడు. తన చివరి ప్రయత్నంలో 83.20 మీటర్లు నమోదు చేసిన సచిన్ యాదవ్‌ను ఓడించాడు. పరుగులో మహారాష్ట్రకు చెందిన రవినా గయాక్వాడ్ మహిళల 10,000 మీటర్ల పరుగును 35:09.57 సెకన్లలో గెలుచుకోవడం ద్వారా తొలి స్వర్ణం సాధించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన అంకిత మహిళల 3000 మీటర్ల పరుగును 9:44.83 సెకన్లతో దూసుకెళ్లగా, హర్యానాకు చెందిన బాల్కిషన్ పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకుంది. రిలేలు నాటకీయత మరియు వేగంతో సాయంత్రం ముగిసింది. మహిళల 4+400 మీటర్లలో, కర్ణాటక, పంజాబ్, తమిళనాడులను ఓడించి ముగింపును అందించింది.



# టెక్ ఎఐకి భారత్ అద్భుత మార్కెట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)కు భారత్ అద్భుతమైన మార్కెట్ అని మైక్రోసాఫ్ట్ ఇండియా భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది లేదా ఏడాదిన్నరలో నూటికి 82 కంపెనీలు తమ ఉద్యోగులకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతుంటే, భారత్‌లో మాత్రం 93 శాతం కంపెనీలు ఇందుకు సిద్దంగా ఉన్నట్టు సంస్థ ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ఈ గిరాకీని తట్టుకునేందుకు పెద్దసంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, అప్లికేషన్స్ ఇంజనీర్లు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ కోడింగ్‌లో 30 శాతం ఏఐ ద్వారానే రాస్తున్నట్టు తెలిపారు. భారత్‌లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐలో 300 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్టు తెలిపారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలను చందోక్ తోసిపుచ్చారు. కొన్ని ఉద్యోగాలు పోయినా, ఏఐ ఆర్కెస్ట్రేటర్, ఏఐ ఏజెంట్ మేనేజర్, ఏజెంట్ బాస్, ప్రాంప్ట్ ఇంజనీర్ వంటి అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నారు. అయితే ఇందుకు అవసరమైన పూర్తి స్థాయి ఏఐ నైపుణ్యాలను యువత అలవర్చుకోక తప్పదన్నారు. ట్రంప్ టారిఫల ప్రభావంపై అడిగిన ప్రశ్నకు మాత్రం చందోక్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే ఆర్థిక సంబంధాలు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయన్నారు. ఐదేళ్లలో భారత్‌లో కోటి మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యానికి మైక్రోసాఫ్ట్ ఇండియా కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

# గేమింగ్ పేరుతో భారీ నష్టం

### యేడాదిలో రూ.20 వేల కోట్లు నష్టపోయిన 45 కోట్ల ఇండియన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ విపరీతంగా పెరిగిపోయింది. ఇదే సమయంలో గేమింగ్ గురించి షాకింగ్ నివేదిక వెలుగులోకి వచ్చింది. దాదాపు 45 కోట్ల మంది భారతీయులు ఏటా రూ.20 లక్షల కోట్లు రియల్ మనీ గేమ్స్ ద్వారా పోగొట్టుకుంటున్నారని ప్రభుత్వం అంచనా వేసింది. గేమ్ ఆడితే టైమ్ పాస్ అవుతుందని చాలా మంది యువత రియల్ మనీ గేమ్స్ ఆడారు. కానీ ఇది కేవలం ఆట మాత్రమే కాదని, వాస్తవంగా ఇదొక ఫైనాన్షియల్ ట్రాప్ అని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇటీవల గవర్నమెంట్ అంచనాల ప్రకారం, దేశంలో దాదాపు 45 కోట్ల మంది భారతీయులు రియల్ మనీ గేమింగ్ ద్వారా ఏడాదికి రూ.20 వేల కోట్లు నష్టపోయారు. ఈ భారీ నష్టాలు వాటి వెనక ఉన్న విషాద సంఘటనలు చూసిన ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



2025లో ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్ చట్టంగా మారింది. ఈ చట్టం హానికరమైన రియల్‌మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ, ఇ-స్పోర్ట్స్, విద్య పరమైన గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్స హిస్తోంది. లక్ష్యం ఏంటంటే, కుటుంబాలను ఆర్థిక సంక్షోభం, బానిసత్వం నుంచి కాపాడడం, అదే సమయంలో గేమింగ్ రంగంలో ఉద్యోగాలు, పెట్టుబడులు, గ్లోబల్ ఇ-స్పోర్ట్స్ మ్యాప్‌లో భారత్‌ను నిలబెట్టడం.కాగా, ఈ గేమింగ్ నష్టాల వెనక యువత అప్పుల్లో కూరుకుపోవడం, కుటుంబాలు నాశనం కావడం, కొన్ని చోట్ల ఆత్మహత్యలు కూడా జరిగాయి. కర్ణాటకలో గత మూడేళ్లలో 18 మంది ఆన్‌లైన్ మనీ గేమ్స్ వల్ల ఆత్మహత్య చేసుకున్నారు. మైసూరులో ఒక కుటుంబం రూ.80 లక్షలు పోగొట్టుకుని ముగ్గురూ ఆత్మహత్య చేసుకున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్‌లలోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. ఈ సమస్య ఎంత విస్తృతంగా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అయితే, గేమింగ్ రంగంలో అంతా చెడు కాదు. ఇ-స్పోర్ట్స్ ఒక అద్భుతమైన అవకాశంగా మారుతోంది. ఇప్పటికే ఈ రంగం 1.5 లక్షల డైరెక్ట్ ఉద్యోగాలను సృష్టించింది. 2030 నాటికి ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని అంచనా. ప్రతి డైరెక్ట్ ఉద్యోగానికి, లాజిస్టిక్స్, కంటెంట్, ఎనలిటిక్స్‌లో మరో రెండు మూడు ఉద్యోగాలు వస్తున్నాయి. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, దాదాపు 40 గేమర్స్ టైర్2, టైర్3 నగరాల నుంచి వస్తున్నారు. అంటే, గేమింగ్ అవకాశాలు మెట్రోలకు మాత్రమే పరిమితం కాకుండా, చిన్న పట్టణాలకూ విస్తరిస్తున్నాయి. ఈ కొత్త చట్టం గ్యాంబ్లింగ్ రకం మనీ గేమ్స్‌ను, నిజమైన స్కిల్-బేస్డ్ ఇ-స్పోర్ట్స్‌ను స్పష్టంగా వేరు చేస్తుంది. ఈ చట్టం రూపొందించడానికి ప్రభుత్వం మంత్రిత్వ శాఖలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, బ్యాంకులు, తల్లిదండ్రులు, గేమింగ్ ఇండస్ట్రీతో సుదీర్ఘ సంప్రదింపులు జరిపింది. ఈ చట్టం హానికరమైన గేమ్స్‌ను నియంత్రిస్తూ, నిజమైన గేమింగ్ ఔత్సాహికులకు మద్దతు ఇస్తుంది.



### ఫార్మా ఎగుమతుల్లో

# 5శాతం వృద్ధి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** అనిశ్చిత పరిస్థితుల్లోనూ భారత ఫార్మా ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత్ నుంచి 757 కోట్ల డాలర్ల (సుమారు రూ.65,860 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5.21 శాతం ఎక్కువగా నమోదైంది. ఫార్ములేషన్లు, బయోలాజిక్స్ విభాగాలు ఎగుమతులు పెరిగేందుకు బాగా దోహదం చేశాయి. కాగా ఇదే కాలంలో విదేశాల నుంచి మన దేశానికి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు 4.21 శాతం పెరిగి 78.6 కోట్ల డాలర్లకు చేరినట్టు ఫార్మెగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు. జూన్ త్రైమాసికంలో భారత్‌కు దిగుమతైన ఫార్మా ఉత్పత్తుల్లో 46 శాతం బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియరీలు ఉన్నాయి. అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిడి, టారిఫ్ సమస్యలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా త్రైమాసికాల్లోనూ ఎగుమతుల వృద్ధి రేటు కొనసాగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో భారత్ నుంచి 3,047 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.39 శాతం ఎక్కువగా నమోదైంది.

# లాభాలతో ముగిసిన సూచీలు

### సెన్సెక్స్ 300 పాయింట్లు జంప్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు25:** అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, ఐటీ షేర్లపై మదుపర్లు ఆసక్తి కారణంగా దేశీయ సూచీలు లాభాలను ఆర్జించాయి. అయితే బ్యాంకింగ్ రంగం మాత్రం స్వల్ప నష్టాలను నమోదు చేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత ఉంటుందని అంచనాలు వెలువడడం సూచీలకు సానుకూలంగా మారింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి గత శుక్రవారం ముగింపు (81, 306)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 200 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 500 పాయింట్లు ఎగబాకి 81, 799 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే చివర్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో చివరకు సెన్సెక్స్ 329 పాయింట్ల లాభంతో 81, 635 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 97 పాయింట్ల లాభంతో 24, 9673 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో వొడాఫోన్ ఐడియా, జుబిలెంట్ ఫుడ్, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, జైడస్ లైఫ్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాలను ఆర్జించాయి. ఏంజెల్ వన్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, సీడీఎస్ఎల్, ఫోర్టిస్ హెల్త్, మ్యాన్‌కైండ్ ఫార్మా షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 71 పాయింట్లు అర్జించింది. బ్యాంక్ నిఫ్టీ 10 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ రూ.87.58గా ఉంది.

# 19 నుంచి విజయవాడలో నారెడ్కో ప్రాపర్టీ ఫెస్టివల్

### 60కి పైగా హౌసింగ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ సంస్థలు పాల్గొంటున్న మెగాషో

**విజయవాడ, ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నారెడ్కో సెంట్రల్ జోన్ 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌ను విజయవాడసి ఏ కన్వెన్షన్‌లో సెప్టెంబర్ 19 నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. సోమవారం నగరంలోని మాలక్ష్మి ఛాంబర్స్‌లో నిర్వహించిన మీడియాకు సమావేశంలో వివరాలను ప్రకటించారు. మూడు రోజులపాటు జరిగే ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో గృహ కొనుగోలుదారులు, స్థిరాస్తి వ్యాపార రంగానికి చెందిన వారికి సంయుక్త వేదికగా నిలవనుంది. ఈ ఫెస్టివల్‌లో 60కుపైగా ఎగ్జిబిటర్స్ పాల్గొనబోతున్నారు. వీరిలో విశ్వసనీయ రియల్ ఎస్టేట్ డెవలపర్లు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్ బ్రాండ్లు, ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెంట్లు, బ్యాంకులు ఇతర అనుబంధ సేవల విభాగాలు ఉంటాయి. ఈ ఎక్స్‌పో ద్వారా విజయవాడ, ప్రజా రాజధాని అమరావతి పరిసర ప్రాంత ప్రజలు తమ బడ్జెట్‌కు అనుగుణంగా అన్ని రకాల ఆమోదం పొందిన రెసిడెన్షియల్ ప్రాజెక్టులను సరిచూసుకుని ఎంచుకునే అవకాశం ఉంది. బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ భాగస్వాములతో నేరుగా చర్చించి తక్షణ సలహాలు పొందవచ్చు. ఇంటీరియర్ సొల్యూషన్స్, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉండనుండగా, నగర వాసులు తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా నారెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ మండవ మాట్లాడుతూ నారెడ్కో 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్ ద్వారా పారదర్శకత, ప్రాక్టికల్ ఫైనాన్స్ సపోర్ట్ ఆలంబనగా గృహ కొనుగోలుదారులను క్రమబద్ధమైన మార్గదర్శకత్వం అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. విశ్వసనీయ డెవలపర్లు, స్పష్టమైన ప్రాజెక్ట్ ఆప్షన్లు, తక్షణ ఫైనాన్షియల్ సహాయం అన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకురావటం ప్రాపర్టీ షో ప్రత్యేకత అన్నారు. విజయవాడఅమరావతి రియల్ ఎస్టేట్ రంగం తదుపరి వృద్ధి దశలోకి అడుగిడుతోందని, ప్రజలు ధైర్యంగా, తగిన సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడానికి ఇది సరైన సమయం అని సందీప్ మండవ పేర్కొన్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పాలసీ స్పష్టత, మౌలిక వసతుల అభివృద్ధి తద్వారా ప్రాజెక్టుల సమయానుకూల నిర్మాణంతో కొనుగోలుదారుల నమ్మకానికి అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. టైటిల్ స్పాన్సర్ ఎస్ఎల్‌వి డెవలపర్స్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాస రాజు మాట్లాడుతూ హోమ్ బయ్యర్స్‌కు నేరుగా సేవలందించే ఈ ఈవెంట్‌లో భాగస్వామ్యం కావటం గర్వంగా ఉందని, మా ప్రీమియమ్ కమ్యూనిటీలను ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించి, ప్రత్యేక మార్గదర్శకతను అందిస్తామని తెలిపారు. నారెడ్కో సెంట్రల్ జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరి ప్రసాద్ వేదిక వద్ద ఉండే వినియోగదారులకు అందుబాటులో ఉండే సౌకర్యాలను వివరించారు. ఇందులో ప్రాజెక్ట్ జోన్లు, బ్యాంకులు, ఫైనాన్షియర్ డెస్క్‌లు, ఇంటీరియర్స్ ఎగ్జిబిషన్, కొనుగోలు దారుల సలహా కౌంటర్లు, రిజిస్ట్రేషన్ వంటి సదుపాయాలు ఉంటాయన్నారు. ప్రాపర్టీ షోకు ఉచిత ప్రవేశం కల్పించామని, కన్వెన్షన్ వద్ద తక్షణ రిజిస్ట్రేషన్ సదుపాయం అందుబాటులో ఉందని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో నారెడ్కో రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.











# స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్ : ఎమ్మెల్యే బత్తుల

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పేదలకు అన్ని అవసరాలకు ఉపయోగపడే విధంగా రైస్‌కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్ ఉండే స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ మండలం గాడాల గ్రామంలో సచివాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ప్రజల కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, దీపం పథకం,తల్లికి వందనం,మరియు స్త్రీ శక్తి , రైతులకోసం అన్నదాత సుఖీభవ లాంటి ఎన్నో పథకాలను అమలుచేస్తున్నామని



ఇప్పుడు స్మార్ట్ రేషన్ కార్డులు కూడా అందిస్తున్నామని తెలిపారు. .ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా సరే అభివృధి, సంక్షేమం ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం సహకారముతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది అని పేర్కొన్నారు.. కూటమి ప్రభుత్వం అత్యంత పగడ్బందీగా స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. ఇప్పటి వరకు ఉన్న రైస్ కార్డుల్లో ఆ కుటుంబానికి చెందిన సభ్యులందరితో ఫొటో ఉండేదని, ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫొటో ఉంటుందని తెలియజేసారు. ఇతర సభ్యుల పేర్లు మాత్రమే నమోదు చేస్తారన్నారు. ప్రస్తుతం ఇవ్వనున్న స్మార్ట్ కార్డులు బ్యాంకు డెబిట్ కార్డు (ఏటీఎం)ల తరహాలో ఉంటాయన్నారు. పారదర్శకతతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో వీటిని అనుసంధానం చేయడం వలన రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చన్నారు. స్మార్ట్ ఈ-పోస్ మిషన్లను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేనుందని, ఇప్పుడిస్తున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే కార్డుదారుడి వివరాలు వస్తాయన్నారు. దీని వల్ల గతంలో యంత్రాలతో వచ్చిన సర్వర్ సమస్యలు ఉండవని తెలియజేసారు.

రాజానగరం నియోజకవర్గంలో 85101 కొత్త స్మార్ట్ కార్డులను అందచేయడం జరుగుతుందన్నారు. తాజా పరిణామాలతో రేషన్ పంపిణీ వ్యవస్థ నూతన సాంకేతిక మార్పులతో అత్యంత పకడ్బందీగా మారనుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తి నిర్మాణాన్ని పూర్తిచేసిన దాత - నేమాని సత్యనారాయణ

**కె గంగవరం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

గంగవరం గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాలుర మరుగుదొడ్లను సొసైటీ అధ్యక్షులు నేమాని సత్యనారాయణ తన సొంత నిధులతో పూర్తి చేయించారు.

సుమారు రెండు లక్షలు విలువైన వాటర్ లైన్, తలుపులు ,టైల్స్, రహదారి పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ,విద్యార్థినీ, విద్యార్థులు నేమాని సత్యనారాయణ ను అభినందించారు.



## అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే సమస్యలు దూరం : ఎమ్మెల్యే గిడ్డి

**- కొర్లపాటివారిపాలెంలో రూ.1.10 కోట్లతో రహదారులకు భూమిపూజ**



**అంబాజీపేట , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పని చేస్తే ఎంతటి సమస్యనైనా పరిష్కరించవచ్చని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో నాబార్డ్ నిధులు రూ.1.10 కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైన్ సిసి రోడ్డు, బిటి రోడ్లకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్మాణాల పనుల్లో సంబంధిత అధికారుల సూచనలు పాటిస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.అటువంటి అధికారుల్లో ముందుండే పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) అన్యం రాంబాబు అభినందనీయుడని ఎమ్మెల్యే కితాబునిచ్చారు.కొర్లపాటివారిపాలెం గ్రామ దేవత శ్రీ వనువులమ్మ అమ్మవారి ఆలయం నుండి మెయిన్ రోడ్డు వరకు బిటి రోడ్డు, అమ్మవారి ఆలయం సమీపము నుండి బస్ స్టేషన్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైన్ సిసి రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు అభివృద్ధి పట్ల ఉన్న దృక్పథంతో మన గ్రామాలు,మన నియోజకవర్గం రోజ రోజుకూ కొత్త రూపు సంతరించు కుంటున్నాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ, డీఈఈ రాంబాబులను కొర్లపాటి వారిపాలెం వాసులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు గ్రామదేవత శ్రీ వనువులమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, అవిడి నీటి సంఘం వైస్ చైర్మన్ అక్కిశెట్టి ప్రసాద్, గ్రామ సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు కొర్లపాటి రాజగోపాల్ (గోపి),శిరిగినీడి వెంకటేశ్వరరావు,బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, డివిడి సత్యనారాయణ, సుంకర బాలాజీ, గూడాల ఫణి, రవణం రాము, సుంకర నాయుడు,అరిగెల బుజ్జి, దొమ్మేటి శ్యామ్, దొమ్మేటి వెంకట రామారావు, పితాని రామకృష్ణ, నాగాబత్తుల సుబ్బారావు, కొప్పినీడి ఈశ్వరరావు,పేరాబత్తుల సుబ్బరాజు, పళ్ళ రామ్మూర్తి, సూదాబత్తుల రాము,నాగవరపు నాగరాజు, బండారు మల్లి, పత్తి దత్తుడు, మట్టపర్తి సోమేశ్వరరావు, దుర్గా శ్రీనివాస్,పత్తి శివ, పత్తి చంటి,వర్రే చింతన్న, ఇన్నార్ ఎండీవీ ఏఎన్ఎల్ నరసింహం,ఉపాధి ఏపీవో అడపా శ్రీ వెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం



**కోనసీమ బ్యూరో ( అమలాపురం ) , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్ నందు జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షురాలు, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంత కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి పరిశీలకులు , ముఖ్య అతిథులుగా రాష్ట్ర మైనింగ్ , ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, బొల్లా సతీష్, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, పార్లమెంట్ సభ్యులుగంటి హరీష్ మాధుర్, కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, గన్నవరం నియోజకవర్గం కన్వీనర్ నామన రాంబాబు, కో కన్వీనర్ మోకా ఆనంద్ సాగర్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర ఎస్. సి సెల్ ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, అమలాపురం నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి బాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కంకటాల రామం,రాష్ట్ర వాణిజ్య విభాగం కర్రి రామస్వామి, రోళ్ళపాలెం సొసైటీ అధ్యక్షులు మట్ట మహాలక్ష్మి ప్రభాకర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీమతి అధికారి జయ వెంకటలక్ష్మి బాబ్జి, మాడ మాధవి మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, టిడిపి నాయకులు గంధం పల్లంరాజు, మాజీ కౌన్సిలర్ దున్నలా దుర్గా, అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, ఉప్పలగుప్తం మండలం టిడిపి అధ్యక్షులు అరిగెలా నానాజీ, చిల్లా జగదీశ్వరి, మాజీ %ఓజుూ౩% దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఆకెటి పెద్ద, వేగిరాజు వెంకటరాజు, గంధం శ్రీను, నల్లా చిట్టి, వలవల శివరావు, చింతా శంకరమూర్తి మరియు మాజీ శాసనసభ్యులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంస్థల అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు , రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లు, నియోజకవర్గాల పరిశీలకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఏడు వారల 'వెంకన్న'కు నిత్య కళ్యాణం, అష్టోత్తరపూజలలో ఆచరించిన భక్తులు

**- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.4.32 లక్షలు.**

**- వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి, గోశాలకు విరాళాల వెల్లువ**

**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆల యానికి సోమవారం వేలాది మంది భక్తులు తరలి వచ్చారు .ఏడువారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర పూజలు, శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం లో పాల్గొని స్వామివార్ని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మేలు కొలుపు ఐశ్వర్య లక్ష్మి హోమం గోపూజ అష్టోత్తర శతనా మావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వ హించారు.అనంతరం అన్నప్రసాదాలు స్వీకరించారు. నిడదవోలు కి చెందిన నడుపల్లి పెద్రాజు, నాగ సత్య సూర్య కుమారి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 25,116లు





రాజమండ్రికి చెందిన,కాకినాడ జిల్లా, పిఠాపురం తహసిల్దార్ పిండి వీర వెంకట గోపాలకృష్ణ, గీత, కుమార్తె శశి భాను శ్రీ, కుమారుడు హరిహర శ్రీ చరణ కుటుంబ సభ్యులు రూ. 25,116లు కపిలే శ్వరపురంకి చెందిన కొరపాటి వెంకటేశ్వర రావు ,సూర్య ప్రమీల దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 29,999లు శ్రీస్వామి వారి ఆలయంలో ఉన్నటువంటి గోసం రక్షణార్థం, గోశాలకు విరాళంగా అందజేశారు వీరికి ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్. కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్ స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.శ్రీ స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ. 4, 32, 377లు. వచ్చినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

**ఆదిత్య యూనివర్శిటి లో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ : ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి**

**గండేపల్లి , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్ నందు శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి పెదబ్రహ్మదేవం సభ్యుల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్. డా.ఎమ్.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పూజకు అందరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రో.ఛాన్సలర్. డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి సంబంధమైన వినాయక చవితి పర్యావరణ హితం అయిన మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించి అందరూ పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో, రసాయనాలతో కూడిన వివిధ రంగులు ఉపయోగించి తయారు చేసిన విగ్రహాలు వాడటం వల్ల అది నీటిలో తొందరగా కరగకుండా అనేక అనర్థాలకు హేతువు అవుతున్నాయని నీరు, వాతావరణం కలుషితం అవుతుంది.తద్వారా అనేక రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి అన్నారు. శ్రీ శారదా



రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యం లో సమితి సభ్యులు, మరియు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది సహకారంతో గత 16 సంవత్సరాల నుండి ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేస్తూ కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కలిపించడానికి కృషి చేస్తున్న సభ్యుల ను డా.ఎన్.సతీష్ రెడ్డి, డా.ఎం. ఎస్.రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రో.వైస్ ఛాన్సలర్స్ డా. ఎస్. రమాశ్రీ,డా.ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, డా.వానతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ . ఎ.వి.బి.ఎస్.శర్మ, టి. రామచంద్రన్, పున్నం నాగేశ్వరావు ,సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, సభ్యులు జి.ప్రకాశరావు, పి.సత్యనారాయణరెడ్డి,తొగరు శ్రీనివాస్, జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కమిటీలు చిత్తశుద్ధితో కృషి చేయాలి

**రాష్ట్ర టిడిపి రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ**

**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

350 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన పురాతన క్షేత్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన ఆత్రేయపురంలో వేంచేసియున్నశివ,కేశవు ల ఆలయాలకు సోమవారం ఆలయ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత జీవనాన్ని పొందాలంటే ప్రజలు ఆధ్యాత్మికత వైపు వెళ్లాలని అన్నారు. నూతన ఆలయాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, పది కాలాల పాటు పదిలంగా ఉండే విధంగా రాళ్లతో నిర్మించవచ్చని తెలి పారు.ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు( గబ్బర్ సింగ్) మాట్లాడుతూ ఈ పురాతన ఆలయాలు శిథిల స్థితికి చేరినందున పునర్నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రజల సహాయ సహకారాలతో చేపట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా గ్రూపు దేవాలయాల ఈవో నరేంద్ర, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ గా వేగేశ్న వెంకట సత్య ప్రసాదరాజు , శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా పులవర్తి కాశీ విశ్వేశ్వర రావు చేత ప్రమాణ స్వీకా రం చేయించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ సభ్యులుగా ఆలపాటి శేషారెడ్డి, అంగాని నాగలక్ష్మి, అల్లూరి కృష్ణంరాజు, ముదునూరి సత్యవతి, కాకిలేటి రవి ప్రకాష్, భమిడిపల్లి సత్యనారాయణ, పెనుమల్ల వెంకటలక్ష్మి, కాకరపర్తి నాంచారమ్మ లు ప్రమాణ స్వీకారం



చేశారు. అలాగే శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రాజ రాజేశ్వర స్వామి ఆలయ సభ్యులుగా శిష్ట సుబ్రహ్మణ్యం విశ్వాస్, పులిదిండి కనకరత్నం, యలమర్తి నాగ వెంకట పద్మ సత్యవతి, పెనుమళ్ళ వీర వెంకట సత్యనారాయణ, యాతం పద్మావతి, కోలమూరి కేదారేశ్వరి, దేవగుప్తాపు వీర వెంకట సత్యనారాయణ, పేత నాగ వెంకట సత్యనారాయణ, అర్చకులు నుంచి పుల్లేటికుర్తి శివరామ భాస్కర రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చేకూరి కృష్ణంరాజు, ఆత్రేయపురం సహకార సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్ర రాజు, పిఎస్ రాజు, ముదునూరి నాగరాజు, శ్రీకృష్ణ ఆలయ అర్చకులు వాడపల్లి జనార్ధనాచార్యులు, అనంతశర్మ, టీటీడీ వేద పండితుడు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు నూతన భవనం నిర్మించాలి

**అంబాజీపేట , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

మండలంలోని ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు నూతన భవనం నిర్మించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను అభివృద్ధి కమిటీ, వైద్య సిబ్బంది కోరారు. పి.గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద పీహెచ్సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పిహెచ్సీ వైద్యురాలు కె.సుమప్రియలు పిహెచ్సీ నూతన భవనంతో పాటు మౌలిక వసతులకు అవసరమైన నిధులకు సంబంధించి ప్రపోజల్స్ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండారు మల్లిబాబు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవో ప్రమోషన్ పొందిన రాపాక శ్రీనివాస్..అభినందించిన ఉద్యోగులు



**ఆత్రేయపురం , ఆగష్టు 25 , ( ప్రభాతవార్త ) :**

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న రాపాక శ్రీనివాస్‌కి ఈవో ప్రమోషన్ రావడంతో ఆలయ డిప్యూటీ కమిష నర్ నల్లం సూర్య చక్రధరరావు,ఆలయ సిబ్బందిశుభాకాంక్షలు తెలియజేశారు.










Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps